ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

శుక్రవారం 10 జూలై 2026 | Friday 10 July 2026 | హైదరాబాద్ Hyderabad | ➪ పేజీలు: 12+12 | ➪ వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 96 | Vol.No 28 Issue No .96 | www.visionandhra.in

# 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థ

- దేశ ఆర్థిక వ్యవస్థలో 10శాతం వాటా సాధించేలా ప్రణాళికలు
- తెలంగాణను అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ఓఆర్ఆర్ లోపలున్న పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలింపు
- హైదరాబాద్‌ను కాలుష్యం నుంచి తప్పించే చర్యలు
- ఇండియాస్ నెక్స్- జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్ ప్రారంభంలో సిఎం రేవంత్





హైదరాబాద్,జూలై9 : 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థగా ఎదుగు తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. షాబాద్ మండలం సీతారాంపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియాస్ నెక్స్- జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. యువతలో నైపుణ్యాభివృద్ధి కోసమే.. స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పాం. ఏటా 1.10 లక్షల మంది యువత ఇంజినీరింగ్ పట్టాలతో బయటకి వస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పరిశ్రమలు రావాలి. బ్లూకాలర్ ఎంప్లాయిస్‌లో కొత్త స్కిల్స్ పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. సీతారాంపురం ప్రజల త్యాగాల వల్లే ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటయ్యాయని తెలిపారు. గతంలోనూ రంగారెడ్డి జిల్లా ప్రజల త్యాగాల వల్లే ఓఆర్ఆర్, పరిశ్రమలు వచ్చాయన్నారు. అత్యంత నివాస అనుకూల నగరాల జాబితాలో హైదరాబాద్ ముందుంటుంది. అయినప్పటికీ హైదరాబాద్‌ను కూడా కాలుష్య సమస్య వేధిస్తోంది. 1.34 కోట్ల మంది ఓఆర్ఆర్ లోపల నివసిస్తున్నారు. మిగతా 2లో..

# 2036 ఒలింపిక్స్‌కు తెలంగాణ వేదిక కావాలి

- క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు రూ.7.15 కోట్ల నగదు ప్రోత్సాహకాలు
- గచ్చీబౌలిలో స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి





హైదరాబాద్, జూలై 9: 2036 ఒలింపిక్ క్రీడలను నిర్వహించేందుకు భారత్ పోటీ పడుతున్న నేపథ్యంలో ఆ ప్రతిష్ఠాత్మక క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. మిగతా 2లో..

## స్పీకర్, మండలి ఛైర్మన్‌తో సిఎస్ భేటీ



హైదరాబాద్,జూలై9 : తెలంగాణ నూతన సీఎస్ సంజయ్ జాజు గురువారం తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని, శాసన మిగతా 2లో..

## మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ తొలిదశ పనులకు గ్రీన్ సిగ్నల్

- రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు

మిగతా 2లో..



# వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నాం

- రెండున్నరేళ్లలోనే 35వేల కోట్లు రైతులకు అందచేత
- రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నాం
- బిఆర్ఎస్ పాలనలో క్రాప్ డ్యామేజీకు కెసిఆర్ ఒక్కపైసా ఇవ్వలేదు
- ఖమ్మం పర్యటనలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క



ఖమ్మం,జూలై9 : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. రైతాంగానికి అవసరమైన సహాయ సహకారాలు అన్ని విధాలుగా అందిస్తున్నామని పేర్కొన్నారు. గురువారం ఖమ్మం జిల్లా చింతకాని మండలం లచ్చగూడెంలో డిప్యూటీ సీఎం పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. చింతకాని మండలం జగన్నాథపురం మత్కేపల్లి క్రాస్ రోడ్డులో రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతు ఆశీర్వాద సభకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేబినెట్ మంత్రులు అందరినీ ఆహ్వానించామని పేర్కొన్నారు. పదేళ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ రైతు భరోసాకు రూ.75 వేల కోట్లు ఖర్చు చేసిందని మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాకు కేవలం రెండున్నరేళ్లలో రూ.35 వేల కోట్లను రైతులకు అందజేసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో క్రాప్ డ్యామేజ్‌కి ఒక్క రూపాయి కూడా మిగతా 2లో..

## హరీష్ రావుపై కెసిఆర్‌కు నమ్మకం లేదు

- అందుకే మంత్రి పదవికి దూరం పెట్టారు
- ఎల్‌నినోపై కార్యాచరణ చేపడతున్నాం
- సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్



హైదరాబాద్,జూలై9 : ఇరిగేషన్‌లో హరీశ్‌రావు నిష్ణాతుడైతే వాళ్ల మామ కేసీఆర్ ఆయనను మంత్రి పదవి నుంచి మొదట్లో ఎందుకు తొలగించారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. హరీశ్‌రావుపై కేసీఆర్‌కు నమ్మకం లేకనే మంత్రి పదవి నుంచి తీసేశారని విమర్శించారు. ఈ మేరకు మాజీ మంత్రి హరీశ్‌రావుకి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. గురువారం సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్ చిట్‌చాట్ చేశారు.మేడిగడ్డ, అన్నారం, మిగతా 2లో..

## ఉమ్మడి జిల్లాలో హాట్ టాపిక్‌గా కాంగ్రెస్ పంచాయితీ

- కొండా వర్సెస్, కడియం అన్నట్లుగా పరిస్థితులు
- మంత్రి పనితీరుపై కాంగ్రెస్ నేతలల్లో అసంతృప్తి





మిగతా 2లో..

## తాడిచర్ల-2 కేటాయింపు కిషన్ రెడ్డి కృషి ఫలితమే

- యూపిఏ హయాంలో కేటాయింపు అవాస్తవం
- భట్టి వ్యాఖ్యలపై మండిపడ్డ బిజెపి ఎమ్మెల్యే పాయల శంకర్



న్యూఢిల్లీ,జూలై9 : తాడిచర్ల-2 గని కేటాయింపు పూర్తిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృషి ఫలితమేనని ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్అన్నారు. యూపీఏ-2 ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ తాడిచర్ల-2 బొగ్గు గనిని సింగరేణికి కేటాయించలేకపోయిందని విమర్శించారు. సింగరేణికి మీరేం చేశారని భట్టి విక్రమార్కను ప్రశ్నించారు. ఈ మేరకు మిగతా 2లో..

## బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్

- దర్యాప్తుకు సహకరించాలని హైకోర్టు ఆదేశం



హైదరాబాద్,జూలై9 : కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కు ఊరట లభించింది. పోక్సో కేసులో అతడికి తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. షరతులతో కూడిన బెయిల్ ఇచ్చిన ఉన్నత న్యాయస్థానం.. దర్యాప్తునకు సహకరించాలని బండి భగీరథ్‌ను ఆదేశించింది. హైదరాబాద్‌లోని పేట్‌బషీరాబాద్ పీఎస్‌లో అతడిపై పోక్సో కేసు మిగతా 2లో..

## బిఆర్ఎస్ ఖాతాలోని 1400 కోట్లు పంచాలి

- అమరలు కుటుంబాలకు పంచి నిజాయితీ చాటాలి
- టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత డిమాండ్



భద్రాద్రికొత్తగూడెం,జూలై9 : బీఆర్ఎస్ పార్టీ ఖాతాలోని రూ.1,400 కోట్లు అమరుల కుటుంబాలకు పంచాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఆ డబ్బు క్విడ్ ప్రోకో ద్వారా వచ్చింది కాదా?అని ప్రశ్నించారు. బాయిబాట కార్యక్రమంలో భాగంగా మిగతా 2లో..

## కళాకారుల ఆరోగ్యం, సంక్షేమం కూడా ముఖ్యమే

- కళాకారులతో మాట్లాడినప్పుడు వారి ఆరోగ్య సమస్యలు గుర్తించా
- అందుకే వారి ఆరోగ్యం కోసం ఉచిత వైద్య చికిత్స ఏర్పాటు చేశా
- ఎక్స్ వేదికగా డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ వెల్లడి



అమరావతి,జూలై9 : సంప్రదాయ కళలను పరిరక్షించడం అంటే వాటిని ప్రోత్సహించడం మాత్రమే కాదని, వాటిని జీవనాధారంగా చేసుకున్న కళాకారుల ఆరోగ్యం, సంక్షేమాన్ని కాపాడటం కూడా ప్రభుత్వ బాధ్యత అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మిగతా 2లో..

## ధాన్యం కొనుగోళ్లో రికార్డు

- వినూత్న సంస్కరణలతో రైతులకు మేలు
- పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



విజయవాడ,జూలై9 :గత రెండేళ్లుగా కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో వినూత్న సంస్కరణలను అమలు చేసిందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ద్వారా రైతులు, రైస్ మిల్లర్ల మధ్య సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ నిర్వహిస్తోందని మిగతా 2లో..

# వైసిపి పాలనతో ప్రజలకు తప్పని ఇక్కట్లు

- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో భయాందోళనలు
- అధికారంలోకి రాగానే దాన్ని రద్దు చేశాం
- దళారులతో పనిలేకుండా పట్టాదారు పాస్ పుస్తకాలు
- కులమత విద్వేషాలు రగిలించే వారిపట్ల జాగ్రతగా ఉండాల్సిందే
- బనగానిపల్లె సభలో సిఎం చంద్రబాబు నాయుడు




నంద్యాల,జూలై9 : గత వైసిపి పాలకుల నిర్ణయాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని సీఎం చంద్రబాబు అన్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్.. ప్రజల్లో భయాందోళనలు సృష్టించిందని విమర్శించారు. మాట వినని వారి భూములను 22ఏ జాబితాలో చేర్చారని వ్యాఖ్యానించారు. బనగానపల్లెలో రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసినట్లు తెలిపారు. ప్రజల ఆస్తిపై ప్రజలకే హక్కు ఉండాలని స్పష్టం చేసిన సీఎం.. భూమి ప్రజలదైతే పట్టా పుస్తకాలపై, భూమి సరిహద్దు రాళ్లపై గత ప్రభుత్వం తమ ఫొటోలు, పేర్లు మిగతా 2లో..

## హరీష్ రావుపైకెసిఆర్‌కు నమ్మకం లేదు

సుందిళ్లలో వచ్చే వేసవి వరకు రిపేర్లు పూర్తి అవుతాయని తెలిపారు. బ్యారేజీలో డ్యామేజీ మరమ్మతులు చేయడానికి తాము చిత్తశుద్ధితో పని చేస్తున్నామని స్పష్టం చేశారు. హరీశ్‌రావు తనకు మంత్రి పదవి ఇవ్వాలని అంటున్నారని.. కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి చెప్పినట్లుగా హరీశ్‌రావు తమ పార్టీలో చేరుతారా? అని ప్రశ్నించారు. హరీశ్‌రావు వ్యాఖ్యలపై సరైన సమయంలో సవివరంగా తాము సమాధానం చెబుతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఇకపోతే ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా జిల్లాల వారీగా కార్యాచరణకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. ప్రతి పరిస్థితినీ ప్రభుత్వం పర్యవేక్షిస్తోందన్నారు. గ్రామసభల ద్వారా ఎల్‌నినోపై చైతన్యం కల్పిస్తామన్నారు. శాస్త్రవేత్తల సూచనలతో పంటల ఎంపిక చేయాలన్నారు. ప్రతి రైతుకు సాంకేతిక సలహాలు అందించనున్నట్లు తెలిపారు. రిజర్వాయర్ల నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు మంత్రి తెలిపారు. సాగునీటి వినియోగం శాస్త్రీయంగా నిర్వహిస్తామన్నారు. ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ప్రతి జిల్లాలో నిరంతరం సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. వదంతులను నమ్మొద్దని.. అధికారుల సూచనలు పాటించాలని రైతులను సూచించారు. ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వర్చువల్‌గా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు.

## స్పీకర్, మండలి ఛైర్మన్‌తో సిఎస్ భేటీ

సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌లను వారివారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలి ఛైర్మన్‌కు, అసెంబ్లీ స్పీకర్‌కు సీఎస్ పుష్పగుచ్ఛం అందజేసి ,శాలువాతో సత్కరించారు. అనంతరం వారు సీఎస్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సెక్రెటరీ డాక్టర్ నరసింహా చార్యులు , వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య తదితరులు పాల్గొన్నారు.

## మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ తొలిదశ పనులకు గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్,జూలై9 :మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ తొలి దశ పనులకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతులు ఇస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఫేజ్-1ఎ, ఫేజ్-1బీ ప్రాధాన్య కారిడార్లలో మూసీ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 9.20 కి.మీ., ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.80 కి.మీ. మేర అభివృద్ధి పనులు కొనసాగనున్నాయి. మొత్తం 21 కి.మీ. ప్రాధాన్య స్ట్రెచ్‌లో రివర్‌ఫ్రంట్ పనులు జరుగనున్నాయి. భూసేకరణ వ్యయం మినహా రూ.7,345.12 కోట్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందులో ఏడీబీ నుంచి రూ.4,500 కోట్ల రుణాన్ని తీసుకోనుండగా..మిగతా .2,845.12 కోట్లు ఊఓఆం లేదా ≑ఉఎఎఅ నుంచి రుణం తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మూసీ రివర్‌ఫ్రంట్ పనులను ఈపీసీ (ఇఖఅ) విధానంలో నిర్వహించనున్నారు. ప్రాజెక్టు పర్యవేక్షణకు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ(ఖఓఅ) నియామకానికి సర్కార్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు తదుపరి చర్యలు చేపట్టాలని ఎమ్ఆర్‌డీసీఎల్(ఓఖీఆఅఒ)కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## బిఆర్ఎస్ ఖాతాలోని 1400 కోట్లు పంచాలి

కొత్తగూడెంలో కవిత పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మా పార్టీతో భయం లేదంటూనే ఈసీకి వెయ్యికి పైగా ఫిర్యాదులు ఇచ్చారు. టీఆర్ఎస్ పేరు నాకు రాకుండా కుట్రలు చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీకి నీతినియమాలు అంటూ ఏమీ లేవా? తల్లి, చెల్లి అనే సభ్యత మరిచి పార్టీ సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. నా కంఠంలో ప్రాణముండగా మళ్లీ బీఆర్ఎస్‌లోకి వెళ్లను. నా పోరాటాలు ప్రజల్లోకి వెళ్లకుండా కాంగ్రెస్, భాజపా చేతులు కలిపాయని ఆరోపించారు. ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు క్విడ్ ప్రోకో కింద కేటీఆర్ అక్రమ పర్మిషన్లు ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిలో హరీశ్‌రావు అనకొండ. బీఆర్ఎస్ పార్టీ ఇంకా ఆయన్నే ముందు పెడుతోంది. ఆ పార్టీ ఈ జన్మలో బాగుపడదు.. అధికారంలోకి రాదు. పెద్దాయనకు మరకలు అంటించిన ఆయనకు 3 నెలలు మంత్రి పదవి కావాలంట. కేటీఆర్ ఇటీవల రూ.188 కోట్లతో ఓ ఇంగ్లిష్ పత్రిక కొన్నారు. ఫీనిక్స్ సంస్థకు రూ.80వేల కోట్ల విలువైన భూముల కట్టబెట్టారు. ఆ సంస్థ రూ.33 లక్షల టన్నుల కలప కొట్టేస్తోందని కవిత ఆరోపించారు.

## ఉమ్మడి జిల్లాలో హాట్ టాపిక్‌గా కాంగ్రెస్ పంచాయితీ

వరంగల్,జూలై9 : ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ నేతల మధ్య కొనసాగుతున్న విభేదాలు జిల్లాలో అలజడి సృష్టిస్తున్నాయి. ఇప్పుడు కొండా వర్సెస్ కడియం లాగా పరిస్థితి మారింది. కొండా తీరుపైనా స్థానికంగా వ్యతిరేకత వస్తోంది. దేవాలయాలను గాలికి వదిలేశారని, అన్యాక్రాంత భూములపై చర్యలు తీసుకోవడం లేదని కాంగ్రెస్‌లోనే విమర్శలు ఉన్నాయి. ఇకపోతే తాజా వివాదం టీపీసీసీ దృష్టికి చేరాయి. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను బుధవారం కలిసి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై ఫిర్యాదు చేశారు. దేవాదాయ శాఖకు సంబంధించిన అంశాలపై తనకు సమాచారం ఇవ్వకుండా ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఏకపక్షంగా సమీక్షా సమావేశం నిర్వహించారని, ఇది ప్రభుత్వ ప్రోటోకాల్‌కు విరుద్ధమని కొండా సురేఖ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై పార్టీ పరంగా క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఆమె టీపీసీసీ అధ్యక్షుడిని కోరారు. ఇదే విషయంపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు ఆమె వివరించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా స్పందించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి వరంగల్ జిల్లాలో నెలకొన్న రాజకీయ పరిణామాలు, గ్రూపు రాజకీయాలపై పార్టీ ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటోందని చెప్పారు. కొండా సురేఖ, కడియం శ్రీహరి ఇద్దరితో త్వరలోనే మాట్లాడి వివాదాన్ని సామరస్యంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం, పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఎవరూ వ్యవహరించకూడదని, అలాంటి చర్యలను పార్టీ ఏమాత్రం సహించబోదని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై అవసరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని ఆయన తెలిపారు.

## బండి భగీరథ్‌కు  షరతులతో కూడిన బెయిల్

నమోదైంది. మే 16న పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై ఇటీవల వాదనలు ముగియడంతో తీర్పును హైకోర్టు వాయిదా వేసింది. పిటిషనర్ తరఫు న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ భగీరథ్ విద్యార్థి అని, 45 రోజులకుపైగా జైలులో ఉండటంతో జీవితంలో చాలా కోల్పోయాడన్నారు. పరస్పర అంగీకారంతో జరిగిన దానిపై కేసులు నమోదు చేయడం చెల్లదని.. ఇదే విషయాన్ని హైకోర్టు, సుప్రీంకోర్టులు పలు తీర్పుల్లో వెల్లడించాయన్నారు. బెయిల్ మంజూరు చేస్తే కోర్టు విధించిన షరతులకు కట్టుబడి ఉంటారన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. మే 8న ఎఫ్ఐఆర్ నమోదు చేసిన వెంటనే వాంగ్మూలాల సేకరణ మొదలైందన్నారు. దర్యాప్తు దాదాపు పూర్తికావచ్చిందని, గడువులోగా అభియోగ పత్రాన్ని దాఖలు చేస్తామన్నారు. ఈ దశలో బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేస్తారన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

## 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థ

ఓఆర్ఆర్ లోపలున్న పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలించాలని నిర్ణయించాం. పెరి అర్బన్ రీజియన్‌లో ప్రత్యేక మాన్యుఫ్యాక్చరింగ్ జోన్లు ఏర్పాటుచేస్తున్నామని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాజకీయంగా ఎన్ని ఆరోపణలు వచ్చినా తమ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని సీఎం అన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు ఉంటాయని, ప్రస్తుతం రాష్ట్ర అభివృద్ధికి అందరూ సహకరించాలని ప్రతిపక్షాలను కోరారు. అధికారం కోల్పోయిన బాధ ఉన్నా అభివృద్ధిని అడ్డుకోవద్దని, తమ ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్న సీఎం.. అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌లో రాకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేస్తున్నామని చెప్పారు. అందుకే ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న సుమారు 2,100 చ.కి.మీ. ప్రాంతాన్ని ఏరియాగా అభివృద్ధి చేయాలని నిర్ణయించామని తెలిపారు. అలాగే రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్ ప్రాంతాలుగా విభజించి సమతుల అభివృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని వెల్లడించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ 10శాతం వాటా సాధించేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజల సహకారంతో 2034 నాటికి రాష్ట్రాన్ని1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించాలంటే మెరుగైన మౌలిక సదుపాయాలు అవసరమని సీఎం అభిప్రాయ పడ్డారు. యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు అందించేందుకు అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు, స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీతారాంపూర్‌లో సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్ ప్రారంభం కావడం సంతోషకరమని పేర్కొన్న సీఎం.. ఈ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన కుటుంబాలకు ఇంటి పట్టాలు ఇవ్వడంతో పాటు ఉపాధి కోసం వ్యాపార సముదాయాలు నిర్మించి అందించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా రైతులు చేసిన త్యాగాల వల్లే ఈ అభివృద్ధి సాధ్యమైందని సీఎం కొనియాడారు. చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే బుద్వేల్ నుంచి కొడంగల్ వరకు 100 మీటర్ల వెడల్పుతో రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. సీతారాంపూర్‌లో నిర్మిస్తున్న ఆలయ ప్రారంభోత్సవానికి త్వరలో మరోసారి వస్తానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజల సహకారంతో తెలంగాణను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## 2036 ఒలింపిక్స్‌కు తెలంగాణ వేదిక కావాలి

ఒలింపిక్స్ నిర్వహణకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలతో హైదరాబాద్‌ను అంతర్జాతీయ క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. గచ్చీబౌలి స్టేడియంలో ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు పీటీ ఉషతో కలిసి గచ్చీబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌తో పాటు లిలియంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ (YIPESU)కి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. క్రీడల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అభినందించిన పీటీ ఉష, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ 82 ఎకరాల్లో అత్యాధునిక సౌకర్యాలతో ప్రపంచ స్థాయి స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీని నిర్మిస్తున్నామని, 2028 డిసెంబర్ నాటికి యూనివర్సిటీని అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. దేశంలో క్రీడారంగానికి స్పష్టమైన విధానం లేకపోవడం వల్ల ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించలేకపోయామని, అందుకే తెలంగాణ ప్రభుత్వం సమగ్ర క్రీడా విధానాన్ని రూపొందించిందని చెప్పారు. హైదరాబాద్ గతంలో ఆఫ్రో-ఏషియన్ గేమ్స్, ప్రపంచ మిలిటరీ గేమ్స్, కామన్‌వెల్త్ పోటీలకు ఆతిథ్యం ఇచ్చిందని గుర్తు చేసిన సీఎం, గత రెండు దశాబ్దాలుగా క్రీడా రంగం నిర్లక్ష్యానికి గురైందన్నారు. పాత స్టేడియాలను పునరుద్ధరించి అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంతో ఏర్పాటవుతున్న ఈ స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్వహణలో ప్రభుత్వ జోక్యం ఉండదని, క్రీడా దిగ్గజాలు అభినవ్ బింద్రా, కపిల్ దేవ్, సంజీవ్ గోయెంకా, ఉపాసన కొనిదెల, కావ్యా మారన్ తదితరుల సహకారంతో ప్రపంచ స్థాయి శిక్షణ అందిస్తామని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే యువతకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహం అందిస్తుందని, దేశానికి పతకాలు సాధించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించే బాధ్యత తీసుకుంటామని సీఎం ప్రకటించారు. ఓటమిని విజయానికి మెట్టుగా భావించి యువత క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన తెలంగాణకు చెందిన ఆరుగురు క్రీడాకారులకు మొత్తం రూ.7.15 కోట్ల నగదు ప్రోత్సాహకాలను ముఖ్యమంత్రి అందజేశారు. అలాగే, 2026 ఖేలో ఇండియా యూత్ గేమ్స్, జాతీయ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌తో పాటు హాకీ ఇండియా లీగ్, ప్రపంచ పికిల్‌బాల్ లీగ్, ఆర్చరీ ప్రీమియర్ లీగ్, టెన్నిస్ ప్రీమియర్ లీగ్ పోటీలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. అనంతరం "తెలంగాణ స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్" కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు.

## వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నాం

ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో రైతుల కోసం పని చేస్తోందని స్పష్టం చేశారు. రైతుభరోసా కింద కేవలం తొమ్మిది రోజుల్లో ఎనిమిది ఎకరాల చొప్పున పూర్తిస్థాయిలో అందరికీ రూ.8759 కోట్లు ఇచ్చామని వెల్లడించారు. రైతు ఆశీర్వాద సభలో మరో రూ.1900 కోట్లు రైతు భరోసాకు తొమ్మిది ఎకరాల నుంచి యాభై ఎకరాల వరకూ విడుదల చేయనున్నామని తెలిపారు. అన్నదాతలు రైతు ఆశీర్వాద సభకు పెద్ద సంఖ్యలో తరలి రావాలని మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న మెగా రైతు మేళాను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, జిల్లా కలెక్టర్ దివాకరతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ సాంకేతికతపై అవగాహన కల్పించడమే ఈ మెగా రైతు మేళా ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు. మెగా రైతు మేళా ప్రాంగణంలోనే శుక్రవారం మధ్యాహ్నం రైతు ఆశీర్వాద సభ నిర్వహించనున్నారు. ఈ సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ కార్యక్రమాలు, వ్యవసాయ అభివృద్ధి చర్యలపై సీఎం రైతులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వంపై భట్టి విక్రమార్క విమర్శలు గుప్పించారు. దశాబ్దాల క్రితం నిర్మించిన నాగార్జునసాగర్, ఎస్ఆర్ఎస్పీ, కడెం వంటి ప్రాజెక్టులు ఇప్పటికీ బలంగా ఉన్నాయని, బీఆర్ఎస్ నిర్మించిన ప్రాజెక్టుల పరిస్థితి రాష్ట్ర ప్రజలకు తెలిసిందేనని వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లాకు గత ప్రభుత్వాలు తగిన నీటి వనరులు అందించలేదని, ఆ విషయాన్ని చరిత్రతో సహా నిరూపిస్తామని అన్నారు. బీఆర్ఎస్ ప్రజలను మాటలతో మోసం చేసే పార్టీ అని, 2023 అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ పార్టీ నేతలు జిల్లాల పర్యటనలు చేస్తూ విమర్శలు చేస్తున్నప్పటికీ ప్రజలు నమ్మే పరిస్థితి లేదని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదవుతోందని, రైతులు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. తక్కువ కాలంలో దిగుబడి వచ్చే పంటలు, ఆరుతడి పంటలు, పప్పుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలని కోరారు. నాగార్జునసాగర్‌లో నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో సీతారామ ప్రాజెక్టు, రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా వైరా ప్రాజెక్టుకు నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. ఆ నీరు ఇవాళ లేదా రేపటిలోగా వైరా రిజర్వాయర్‌కు చేరుతుందని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. మధిర నియోజకవర్గంలోని మొక్కజొన్న రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరడంతో రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోలు చేపట్టినట్లు తెలిపారు. ప్రకృతి, కేంద్ర ప్రభుత్వ సహకారం పూర్తిస్థాయిలో లేకపోయినా రైతుల కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. కేంద్రం నుంచి అవసరమైన ఎరువులు సాధించామని, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు టెక్నాలజీ వినియోగిస్తూ యాప్ ద్వారా యూరియా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అలాగే వర్షాల సమాచారాన్ని కూడా సాంకేతికత ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు అందిస్తున్నామని వెల్లడించారు. సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం పనిచేయడం లేదని విమర్శించే వారికి లెక్కలతో సహా సమాధానం చెబుతామని అన్నారు. రైతు భరోసా పథకం కింద కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ మాత్రమేనని పేర్కొన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ కోసం ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని, రైతుల ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకుంటోందన్నారు.

## వైసిపి పాలనతో ప్రజలకు తప్పని ఇక్కట్లు

ముద్రించడం సరైంది కాదన్నారు. ఫొటోల పిచ్చి పరాకాష్ఠకు చేరిందని విమర్శించారు. జగన్ ఫొటోలతో ఉన్న పాత పట్టాదారు పాస్‌పుస్తకాలను రద్దు చేసి, ఇప్పుడు రాజముద్రతో పాస్‌పుస్తకాలను అందిస్తున్నామని చెప్పారు. రైతులకు పారదర్శకమైన సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రతి సమస్యనూ పరిష్కరించే బాధ్యత తమదేనని చెప్పారు. దళారీ వ్యవస్థకు తావు లేకుండా గ్రామసభల్లోనే పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా పాలన అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పట్టాదారు పాస్‌పుస్తకాలపై ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా భూమికి సంబంధించిన పూర్తి వివరాలను సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపే బాధ్యత నాది. తిరుపతి జిల్లా శెట్టిపల్లిలో, గుంటూరు జిల్లా వట్టిచెరుకూరులో 70 ఏళ్ల నాటి సమస్యలు పరిష్కరించాం. భూముల వివరాలన్నీ మీ సమక్షంలోనే పొందుపరుస్తున్నాం. దళారీ వ్యవస్థకు చోటు లేకుండా గ్రామసభల్లోనే పుస్తకాలిస్తున్నాం. ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా చేయాలన్నదే మా లక్ష్యం. 6,887 గ్రామాల్లో సర్వే చేశాం.. 29,04,000 పాస్ పుస్తకాలిచ్చాం. క్యూఆర్ కోడ్‌లో రికార్డులన్నీ స్పష్టంగా ఉంటాయి. డోన్‌లో ఎన్నో ఏళ్లుగా వక్ఫ్ భూములు సాగు చేసుకుంటున్న 784 మంది రైతుల సమస్య పరిష్కరించాం అని వివరించారు. రౌడీలు, సంఘ విద్రోహ శక్తులను ఎవరూ ప్రోత్సహించవద్దు. కుల, మతాలను విభజించడానికి వీల్లేదు. రావణ్ అనే వ్యక్తి.. పురాణాలను దూషించాడు. రాముడు, సీతపై నీచంగా మాట్లాడాడు. తీవ్రవాదాన్ని, పాకిస్థాన్‌ను సమర్థించాడు. ఇలాంటి వాళ్లకు గొడ్డలిపార్టీ ఆర్థికసాయం చేసింది. రాష్ట్రంలో వింత ప్రవర్తన కలిగిన కొందరు వ్యక్తులున్నారు. ఆస్తి కోసం తల్లిని హింసిస్తున్నారు. ఓట్ల కోసం చనిపోయిన తండ్రికి పూజలు చేస్తున్నారు. తల్లిని గౌరవించలేని వ్యక్తి మనకు అవసరమా? తల్లులంటే గౌరవం ఉండాలనే.. తల్లికి వందనం తీసుకొచ్చా. గొడ్డలి పార్టీ.. విసుగు, విరామం లేకుండా కుట్రలు, కుతంత్రాలు చేస్తోంది. కులం, మతం, ప్రాంతాల వారీగా ముక్కలు చేసే కుట్రకు పాల్పడుతోంది. రాయలసీమలో ముఠాలు లేకుండా చేసింది తెదేపానే. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదు. ప్రజల ఆస్తులు, ప్రాణాలకు రక్షణగా ఉండాలి. ఆడబిడ్డలు స్వేచ్ఛగా తిరగాలి. మత విద్వేషాలు రెచ్చగొట్టడం, మనోభావాలు దెబ్బతీయడం మంచిదికాదు. ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరిరోజు అని మళ్లీ హెచ్చరిస్తున్నానని చంద్రబాబు అన్నారు. గ్రామసభలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. వైసీపీపై తీవ్ర విమర్శలు చేశారు. బనగానపల్లె.. బ్రహ్మంగారు నడయాడిన పవిత్ర ప్రాంతమని పేర్కొన్న ఆయన, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి కంటే అరాచక పాలనే ఎక్కువగా కనిపించిందని అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన అనేక అభివృద్ధి పనులను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిందని మంత్రి విమర్శించారు. ఐదేళ్లలో రాయలసీమ కోసం వైసీపీ నేతలు ఏం చేశారో, తాము ఏం చేశామో ప్రజల సమక్షంలో చర్చకు రావాలని సవాల్ చేశారు. బనగానపల్లె బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని టీడీపీ ప్రభుత్వం ప్రారంభిస్తే, వైసీపీ ప్రభుత్వం దానిని నిలిపివేసిందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం మళ్లీ తమ ప్రభుత్వం ఆ పనులను వేగవంతం చేసి బైపాస్ రోడ్డు నిర్మాణంలో 70 శాతం పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. అలాగే బనగానపల్లెలో 41 కిలోమీటర్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను పూర్తి చేశామని మంత్రి వెల్లడించారు. గ్రామాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామీణ వ్యవస్థను నిర్వీర్యం చేశారని బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.


# ధాన్యం కొనుగోళ్లో రికార్డు

తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మార్గదర్శకత్వంలో రాష్ట్ర చరిత్రలోనే అత్యుత్తమ ధాన్యం కొనుగోలు చేపట్టినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వంలో రెండేళ్ల ధాన్యం సేకరణ విజయవంతంగా పూర్తవడంపై పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతులు, రైస్ మిల్లర్లతో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో అధికారులు బాగా పని చేశారని కొనియాడారు. రానున్న సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, కూటమి ప్రభుత్వం రెండో ఏడాదిలో 74 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిందని వివరించారు. రూ.31 వేల కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసి, 11.53 లక్షల మంది రైతులకు 95 శాతం చెల్లింపులు 24 గంటల్లోనే చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో మధ్యాహ్న భోజన పథకానికి నాణ్యమైన బీపీటీ బియ్యం అందిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తున్న 10 శాతం బ్రోకెన్ రైస్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించి దేశవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించిందన్నారు. ప్రతి ధాన్యం బస్తాకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి, రైతు నుంచి ఫెయిర్ ప్రైస్ షాప్ వరకు పూర్తి వివరాలు తెలుసుకునే వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. వాట్సాప్ ద్వారా రైతులు ధాన్యం విక్రయించుకునే సౌకర్యాన్ని కల్పించామని వెల్లడించారు. గన్నీ బ్యాగులు, గోదాములు, రవాణా, తేమ శాతం వంటి అంశాల్లో పారదర్శకత పెంచేందుకు చర్యలు తీసుకున్నామని నాదెండ్ల తెలిపారు. ఖరీఫ్ నుంచి రైతు సేవా కేంద్రాల్లోనే గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచామన్నారు. రవాణా జాప్యాన్ని నివారించేందుకు ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులను కూడా 48 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. ఆర్ఎఫ్ఐడీ స్టిక్కర్లు, స్కానర్లతో లారీల కదలికలను పర్యవేక్షించే వ్యవస్థ అమలు చేస్తున్నామని చెప్పారు. తేమ కొలిచే మాయిశ్చర్ మీటర్లు అన్ని చోట్లా ఒకే కంపెనీ, ఒకే మోడల్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం 90 శాతం ఏర్పాటు పూర్తవగా, ఖరీఫ్ నాటికి 100 శాతం పూర్తి చేస్తామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ సీజన్‌లో వరి ఉత్పత్తి సుమారు 15 శాతం తగ్గే అవకాశం ఉందని ప్రాథమిక అంచనాలు ఉన్నాయన్నారు. రైతులకు ముందస్తు అవగాహన కల్పించి, అవసరమైన సూచనలు అందించి సమస్యలను అధిగమించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

### తాడిచర్ల-2 కేటాయింపు

## కిషన్ రెడ్డి కృషి ఫలితమే

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ బిడ్డగా, సింగరేణి కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని



ప్రధాని నరేంద్ర మోదీని ఒప్పించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ గనిని సింగరేణికి కేటాయింపునకు కృషి చేశారని పేర్కొన్నారు. తాడిచర్ల గని కేటాయింపును సింగరేణి కార్మిక సంఘాలు స్వాగతిస్తూ ప్రధాని మోదీ, కిషన్ రెడ్డికి పాలాభిషేకాలు చేస్తున్నాయని తెలిపారు. కార్మికుల్లో వ్యక్తమవుతున్న ఆనందాన్ని, బీజేపీకి వస్తున్న ప్రజాదరణను కాంగ్రెస్ సహించకలేకపోతోందన్నారు. సింగరేణి ఆర్థిక పరిస్థితిపై కూడా పాయల శంకర్ తీవ్ర విమర్శలు చేశారు. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిపై రూ.32 వేల కోట్ల బకాయిలు మోపిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరో రూ.22 వేల కోట్ల బకాయిలు పెట్టిందని అన్నారు. మొత్తం రూ.55 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ పరిస్థితికి బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని వ్యాఖ్యానించారు. సింగరేణి కార్మికులు ఈ రెండు పార్టీల నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయిలను ఎప్పుడు, ఎలా చెల్లిస్తుందో స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతామని తెలిపారు. సింగరేణిలో కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉందని, సంస్థ వ్యవహారాల్లో కేంద్రం మరింత చురుకుగా వ్యవహరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తన 51 శాతం వాటా పేరుతో సింగరేణి నిధులను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. బంగారు గనిలాంటి సింగరేణిని చీకట్లోకి నెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాసి కేంద్రం పూర్తి స్థాయిలో జోక్యం చేసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. అదే సమయంలో దేశంలోని ఇతర రాష్ట్రాల తో పోలిస్తే తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తోందని, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అన్ని విధాలా సహకరిస్తోందని పాయల్ శంకర్ పేర్కొన్నారు.

## కళాకారుల ఆరోగ్యం, సంక్షేమం కూడా ముఖ్యమే

తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవం సందర్భంగా హస్తకళాకారులు, చేనేత కార్మికులతో మాట్లాడిన సమయంలో వారు ఎదుర్కొంటున్న వృత్తి సంబంధిత ఆరోగ్య సమస్యలు తన దృష్టికి వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. హస్తకళా మహోత్సవం సందర్భంగా హస్తకళాకారులు, చేనేత కార్మికులతో ఆత్మీయంగా మమేకమయ్యే అవకాశం లభించిందన్నారు. వారి అసాధారణ నైపుణ్యం, అపారమైన ఓర్పు, వృత్తిపట్ల ఉన్న అంకితభావం ఎంతో ఆకట్టుకున్నాయన్నారు. ఏళ్ల తరబడి కష్టపడి పనిచేస్తున్న కళాకారులు వెన్ను, మెడ, కీళ్ల నొప్పులు, కంటి సమస్యలు, శ్వాస సంబంధిత ఇబ్బందులు వంటి అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను తమ చేతుల మీద మోస్తున్న కళాకారుల ఆరోగ్యాన్ని కాపాడటం కూటమి ప్రభుత్వ బాధ్యత అని బలంగా విశ్వసిస్తున్నట్లు చెప్పారు. కళాకారుల సమస్యలను తెలుసుకున్న వెంటనే సంబంధిత అధికారులను ఆదేశించి రాష్ట్రంలోని వివిధ హస్తకళా, చేనేత కళాకారుల క్లస్టర్లలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని డిప్యూటీ సీఎం వెల్లడించారు. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి కలంకారీ కళాకారులు, పశ్చిమ గోదావరి జిల్లాలోని సీతారాంపురం క్రోషే లేస్ కళాకారుల కోసం నిన్న(జులై 8న) వైద్య శిబిరాలు విజయవంతంగా నిర్వహించినట్లు పవన్ చెప్పారు. ఈరోజు(గురువారం)జులై 9న ఎన్టీఆర్ జిల్లాలోని కొండపల్లి బొమ్మల కళాకారులు, కాకినాడ జిల్లాలోని ఉప్పాడ చేనేత కార్మికులు, కడప జిల్లాలోని మాధవరం చేనేత కార్మికులు, అనంతపురం జిల్లాలోని యాడికి చేనేత కార్మికుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ÷ులై 10న విజయనగరం జిల్లాలోని బొబ్బిలి వీణ కళాకారులు, అనకాపల్లి జిల్లాలోని ఎటికొప్పాక కళాకారులు, ఏలూరు జిల్లాలోని హ్యాండ్ నాటెడ్ వూలెన్ పైల్ కార్పెట్ కళాకారులు, మదనపల్లె చేనేత కార్మికుల కోసం వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే, జులై 11న సత్యసాయి జిల్లాలోని ధర్మవరం చేనేత కార్మికులు, శ్రీకాకుళం జిల్లాలోని బుడితి ఇత్తడి కళాకారులు, కృష్ణా జిల్లాలోని పెడన బ్లాక్ కలంకారీ కళాకారులు, తిరుపతి జిల్లాలోని చెక్క శిల్ప కళాకారుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఏపీలోని మరిన్ని హస్తకళా, చేనేత కళాకారుల క్లస్టర్లలో ఇదే తరహాలో వైద్య శిబిరాలను దశలవారీగా కొనసాగిస్తామని పవన్ చెప్పారు. ఈ శిబిరాల ద్వారా సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు అవసరమైన చోట నిపుణుల వైద్య సేవలు, నిర్ధారణ పరీక్షలు, తదుపరి చికిత్సకు అవసరమైన మార్గదర్శకత్వం అందించనున్నట్లు తెలిపారు.

ప్రతి హస్తకళాకారుడు, ప్రతి చేనేత కార్మికుడు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 'కళను గౌరవించడం అంటే కళాకారుడి శ్రమను గౌరవించడం. కళాకారుడి శ్రమను గౌరవించడం అంటే ఆయన ఆరోగ్యాన్ని కాపాడటం. కళాకారులు ఆరోగ్యంగా ఉంటేనే మన సంప్రదాయాలు, వారసత్వం భావితరాలకు సజీవంగా నిలుస్తాయి. కళను కాపాడాలంటే.. ముందు కళాకారుడిని కాపాడాలి' అని ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# సంపాదకీయం

## గందరగోళంలో వ్యవసాయం

ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఆందోళన మరింత ఎక్కువయ్యింది. తాగు,సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడబోతున్నాయి. ఈయేడు సాగు సాగడమెలా అన్న ఆందోళనలో రైతులు ఉన్నారు. జులై మధ్యలోకి వచ్చినగా గట్టి వర్షాలు లేవు. దీంతో వరిసాగు సాగదని రైతులే చెబుతున్నారు. నారు ఎండిపోతోంది. మహారాష్ట్రలో కురిసిన వర్షాలకు గోదావరిలో కొత్తో గొప్పో నీళ్లు వస్తున్నాయి తప్ప, కృష్ణా పివాహక పూర్తిగా ఎండిపోయినట్లే. ఇప్పటికే వ్యవసాయ రంగం ఎన్నో సవాళ్లతో సతమతమవుతోంది. దేశానికి అన్నం పెట్టే రైతు అనేక సమస్యలమధ్య జీవన పోరాటం సాగిస్తున్నాడు. ప్రకృతి వైపరీత్యాలు, పెరు గుతున్న పెట్టుబడులు, నకిలీ విత్తనాల మోసం, ఎరువుల కొరత, పంటలకు మద్దతు దక్కకపోవడం వంటి సమస్యలు రైతుల ఆర్థిక స్థితిని మరింత దెబ్బతీస్తున్నాయి. రైతుకు ప్రకృతి శాపంగా మారుతోంది. ఒకవైపు కరవు, మరోవైపు ఆకాల వర్షాలు, వరదలు, వడగండ్ల వానల కారణంగా పంటలు నాశనమవుతున్నాయని అనుకుంటే ఇప్పుడు ఎల్‌నినో వాతావరణ మార్పుల ప్రభావంతో పంటల సాగు అనిశ్చితంగా మారింది. రైతు ఎంత కష్టపడి పంట పండించినా ప్రకృతి వైపరీత్యాలు అతని ఆశలను ఆవిరి చేస్తున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభ మైన వ్యవసాయరంగం ప్రస్తుతం అనేక సవాళ్లతో కొట్టు మిట్టాడుతోంది. ప్రకృతి వైపరీత్యాల నుండి మొదలై మార్కెట్ మాయాజాలం వరకు ప్రతి ఒక్కటి రైతును అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. రైతు పెట్టుబడి పెట్టే కాలం నుండి పంట చేతికి వచ్చే వరకు అంతా ప్రకృతి చేతుల్లోనే ఉంటుంది. వాతావరణ మార్పుల వల్ల ఒక ఏడాది తీవ్రమైన కరువు ఏర్పడితే, మరో ఏడాది అకాల వర్షాలు, తు ఫానులు, వరదలు పంటలను ముంచెత్తుతున్నాయి. చేతికి వచ్చిన పంట కళ్లముందే నీటిపాలు కావడం తో రైతులకు కోలుకోలేని దెబ్బతగులుతోంది. ఎల్‌కనినో తట్టుకునేలా రైతులకు అత్యవసర సాయానికి ప్రభుత్వాలు రంగంలోకి దిగాలి. ఇకపోతే వ్యవసాయంలో పెట్టు బడులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు భారీగా పెరిగాయి. పంటదిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోవడం, మార్కెట్లో గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదు. దీంతో అప్పులు చేయడం తప్ప రైతుకు మరో మార్గం కనిపించడం లేదు. పంటించిన పంటలకు గిట్టుబాటు ధరలు రావడం లేదు. ధాన్యం కొంటారన్న గ్యారెంటీ లేదు. దీనికితోడు నకిలీ విత్తనాల సమస్య రైతులను తీవ్రంగా వేధిస్తోంది. అధిక దిగుబడి వస్తుందని నమ్మించి విక్రయించే నకిలీ విత్త నాల వల్ల మొలక శాతం తగ్గిపోవడం, పంటలు దెబ్బతిన డంతో రైతు కుదేలవుతున్నాడు. మరోవైపు ఎరువుల కొరత రైతులకు తలనొప్పిగా మారింది. సీజన్ సమయంలో ఎరు వుల కోసం గంటల తరబడి క్యూలలో నిలబడాల్సిన పరి స్థితి ఏర్పడుతోంది. అవసరమైన సమయంలో ఎరువులు అందకపోవడంతో పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. నేడు వ్యవసాయం అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారింది. కూలీల ఖర్చులు, ట్రాక్టర్ల అద్దెలు, డీజిల్ ధరలు, విత్తనాలు, ఎరువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పెట్టుబడి రెట్టింపవుతున్నా దానికి తగ్గట్టుగా పంటకు మద్దతుధర లభించడం లేదు. మార్కెట్ల లో దళారుల వ్యవస్థ, సిండికేట్లుగా మారిన వ్యాపారులు రైతు శ్రమను దోచుకుంటున్నారు. ఎంతో కష్టపడి పండించిన పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి రైతుది. పెట్టుబడులు పెరిగి, పంట చేతికిరాక, వచ్చిన పంటకు సరైన ధర దక్కకపోయేసరికి రైతు పూర్తిగా అప్పుల్లో మునిగిపోతాడు. బ్యాంకుల నుండి రుణాలు దొరకని చిన్న, సన్న కారు రైతులు గ్రామీణ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తారు. వారు విధించే చక్రవడ్డీలు చెల్లించలేక, తెచ్చిన అప్పులు తీరే మార్గం కనిపించక సమాజంలో గౌరవం కోల్పోతామనే భయంతో ఎంతో మంది రైతులు పురుగుల మందుతాగి తనువు చాలిస్తున్నారు. ఇంకొందరు ఉరివేసుకుని బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. రుణాల విధానం సక్రమంగా లేకపోవడంతో బ్యాంకులతో పాటు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులు తీసుకుంటున్నారు. వంట నష్టాలు, ఆదాయం లేక పోవడం వల్ల అప్పులు తీర్చలేక మానసిక ఒత్తిడికి గురవు తున్నారు. మనోవేదనతో కొంతమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతూ వారి కుటుంబాలను రోడ్డు పాల్జేస్తున్నారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభంనుంచి గట్టెక్కించా లంటే ప్రభుత్వాలు రైతు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి. న కిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకో వాలి. ఎరువుల సరఫరాను సకాలంలో అందుబాటులో ఉంచాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలి. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధానాలు అమలు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకైన వ్యవ సాయరంగం బలోపేతం కావాలంటే రైతు బాగుండాలి. రైతు సంక్షేమమే దేశాభివృద్ధికి మూలాధారం అనే విషయాన్ని పాలకులు గుర్తించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎల్‌నినో నుంచి గట్టెక్కేందుకు తగన వ్యవసాయ ప్రణాళికలు అమలు చేయాలి.

# భూ రీ సర్వేను సాంకేతిక పరిజ్ఞానంతో పకడ్బందీగా నిర్వహించాలి

### రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 9 (విజన్ ఆంధ్ర)జిల్లాల్లో భూముల రీ సర్వే ప్రక్రియను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. భూ రీ సర్వే ప్రక్రియ, భూ భారతి కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై గురువారం సీసీఎల్ఏ లోకేష్ కుమార్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూముల రీ సర్వేను దశలవారీగా చేపడుతోందని తెలిపారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లోరీ సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సర్వేతో ప్రతి సర్వే నంబర్‌కు స్పష్టమైన యాజమాన్య హక్కులు నిర్ధారించడంతో పాటు ప్రతి భూమికి ప్రత్యేక భూధార్ యూనిక్ నంబర్ కేటాయించనున్నట్లు వెల్లడించారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రీ సర్వే చేపట్టాలని ఆదేశించారు. రీ సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, ఆయా గ్రామసభల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రులను భాగస్వాములను చేయాలని సూచించారు.రీ సర్వేలో రెగ్యులర్ సర్వేయర్లతో పాటు లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. సోమవారం నుంచి సర్వేయర్లు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందికి బ్యాచ్‌ల వారీగా సమగ్ర శిక్షణ నిర్వహించి అనంతరం అన్ని గ్రామాల్లో రీ సర్వే కార్యక్రమాలు ప్రారంభించాలని ఆదేశించారు.రీ సర్వే పూర్తయ్యే వరకు రెగ్యులర్ సర్వేయర్లలో 25 శాతం మందిని రొటేషన్ పద్ధతిలో విధుల్లో వినియోగించాలని, లైసెన్స్‌డ్ సర్వేయర్ల పనితీరును శాఖ సర్వేయర్లు నిరంతరం పర్యవేక్షించాలని, డిప్యూటీ తహసీల్దార్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పనులను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. భూ భారతి పెండింగ్ దరఖాస్తులు 60 రోజులకు మించి ఉండకూడదని, వాటిని అత్యంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సర్వే సంబంధిత ప్రతి దరఖాస్తును సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. భూ రీ సర్వే పనులు, భూ భారతి పెండింగ్ ఫైళ్ల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఏవో భాను ప్రకాష్, సర్వే ఏడి శ్రీనివాసులు, రెవెన్యూ సెక్షన్స్ సూపర్డెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# నవోదయ 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

### వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 9 (విజన్ ఆంధ్ర) జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో 2027-28 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశాలకు సంబంధించిన జీఈఎస్ట్-2027 పరీక్షకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులని పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ జూలై 31, 2026 అని, అభ్యర్థులు https://navodaya.gov.in` ýñ<' http://cbseitms.rcil.gov.in/nvs/` వెబ్‌సైట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష నవంబర్ 28, 2026న నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు విస్తృత ప్రచారం చేసి ఎక్కువ మంది విద్యార్థులు దరఖాస్తు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ప్రభుత్వం ఆశలు చూపి ఆత్మహత్యలకు కారణమవుతోంది

### బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 9 (విజన్ ఆంధ్ర)కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు ఆనందంగా లేరని, ఇందిరమ్మ ఇళ్ల పేరుతో లబ్ధిదారులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ విమర్శించారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి స్వగృహంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నిన్న వనపర్తిలో మంత్రుల పర్యటన ఆత్మస్తుతి, పరనిందగా సాగిందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన పనులకే మళ్లీ శంకుస్థాపనలు చేయడం వారి అసమర్థతకు నిదర్శనమని దుయ్యబట్టారు.ఖిల్లా ఘనపూర్ మండలం వెంకటాంపల్లికి చెందిన ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుడు సిద్ధి రాము సకాలంలో బిల్లులు రాక అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రభుత్వం చేసిన హత్యగానే భావించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించడంతో పాటు బాధిత కుటుంబానికి 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇచ్చే 5 లక్షల నిధులు చాలడం లేదని, దీనిని 10 లక్షలకు పెంచకపోతే మరిన్ని ఆత్మహత్యలు జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు.కె.సి.ఆర్ పాలనలో కాళేశ్వరం, సచివాలయం, కలెక్టరేట్లు, మెడికల్ కాలేజీలు, గురుకులాలు, వైకుంఠ ధామాలు, రైతు బంధు, ఆసరా పింఛన్లు వంటి సంక్షేమం జరిగిందని, రెండున్నరేళ్లలో 3 లక్షల కోట్లు అప్పు చేసిన రేవంత్ ప్రభుత్వం ఏమి అభివృద్ధి చేసిందో చెప్పాలని సవాల్ విసిరారు. ప్రకటనలు, దూషణలు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో గంధం పరంజ్యోతి, హేమంత్ ముదిరాజ్, జోహెబ్ హుస్సేన్, సునీల్ వాల్మీకి తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ కరపత్రాలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్




కామారెడ్డి బ్యూరో జులై 9(విజన్ఆంధ్ర) కలెక్టరేట్ కలెక్టరేట్ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వికసిత్ భారత్ కరపత్రాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతి యువకుల కోసం మై భారత్ పోర్టల్ ద్వారా యువకులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాల వివరాలు పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా అటవీ శాఖ అధికారి, ఇతర జిల్లా శాఖ అధికారులు పాల్గొన్నారు.

# 25 ఏళ్ల రైతుల కలను సాకారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం!

### ఉమ్మడి గోపాల్‌పేట, రేవల్లి, ఏదుల మార్కెట్ యార్డుల పాలకవర్గాల ప్రమాణ స్వీకారం

### నూతన కమిటీని శాలువాలతో సత్కరించిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 9 (విజన్ ఆంధ్ర) గోపాల్పేట మండలం బుద్ధారం గండి ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం ఉమ్మడి గోపాల్పేట, రేవల్లి, ఏదుల మండలాల నూతన వ్యవసాయ మార్కెట్ యార్డుల పాలకవర్గాల ప్రమాణ స్వీకార కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన పాలకవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాదాపు 25 సంవత్సరాలుగా మార్కెట్ యార్డులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే రైతుల అవసరాన్ని గుర్తించి రెండు నూతన వ్యవసాయ మార్కెట్ యార్డులను ఏర్పాటు చేసి వారి కలను నిజం చేసిందన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల గురించి గొప్పలు చెప్పుకున్నప్పటికీ, వనపర్తి నియోజకవర్గంలో ఒక్క కొత్త మార్కెట్ యార్డును కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. రైతుల కష్టాలు పట్టించుకోని వారు ఇప్పుడు రైతుల గురించి మాట్లాడడం విడ్డూరమని అన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని చారిత్రాత్మక నిర్ణయాలు అమలు చేస్తోందని తెలిపారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి పథకం, ఉచిత బస్సు, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, సాగునీటి ప్రాజెక్టుల పూర్తి వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందని, అభివృద్ధి ▪ సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.నూతన పాలకవర్గ వివరాలు:అధ్యక్షుడిగా వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా సత్యశిలా రెడ్డి, డైరెక్టర్లుగా బోటుక చంద్రయ్య, ఠాకూర్ సంతోష్, సురేందర్, సిరిమల్లేష్, తిరుపతయ్య, శ్రీనివాసులు, బాలపీరు జానమ్మ, వేమారెడ్డి దేవేందర్, తేజశ్రీ, రఘు, బంగారి తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు.నూతన మార్కెట్ యార్డుల ద్వారా రైతులు సమీపంలోనే ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశం లభిస్తుందని, రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు మెరుగైన ధరలు పొందేందుకు వీలు కలుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ జిల్లా అధికారిణి పుష్పలత పాలకవర్గంతా ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ అధికారులు, ఉమ్మడి మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జోనల్ పోలీస్ డ్యూటీ మీట్‌లో వనపర్తి పోలీసుల హవా

### 11 పతకాలతో రాష్ట్ర స్థాయికి అర్హత

### విజేతలను ఘనంగా సన్మానించిన జిల్లా ఎస్పీ సునిత రెడ్డి





వనపర్తి జిల్లా ప్రతినిధి,జూలై 09 (విజన్ ఆంధ్ర)మహబూబ్‌నగర్‌లో జూలై 6 నుండి 8 వరకు జరిగిన 'జోగులాంబ జోన్-7 జోనల్ పోలీస్ డ్యూటీ మీట్ ▪ 2026'లో వనపర్తి జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది అసాధారణ ప్రతిభ కనబరిచారు. శాస్త్రీయ దర్యాప్తు, సాంకేతిక పోలీసింగ్ విభాగాల్లో జరిగిన వివిధ పోటీల్లో వనపర్తి జిల్లా మొత్తం 11 పతకాలు (5 బంగారు, 5 రజత, 1 కాంస్య) సాధించి జోన్‌లోనే అత్యుత్తమంగా నిలిచింది.ఈ సందర్భంగా గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విజేతలను జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ప్రశంసా పత్రాలతో ఘనంగా సన్మానించారు.ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ డ్యూటీ మీట్‌లు సిబ్బందిలో వృత్తి నైపుణ్యాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని పదును పెట్టే అద్భుతమైన వేదికలు. జోన్ స్థాయిలో ప్రతిభ చాటినట్లే, ఇదే స్ఫూర్తితో కఠినంగా సాధన చేసి రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ వనపర్తి జిల్లా పేరు నిలబెట్టాలన్నారు.విజేతల వివరాలు:క్రైమ్ సీన్ ఫోటోగ్రఫీ: ఎస్సై అంజద్ (ప్రథమ స్థానం - బంగారం)పోర్ట్రేట్ పార్లి: పీసీ వి. రాజశేఖర్ (ప్రథమ స్థానం - బంగారం)కంప్యూటర్ అవేర్‌నెస్: పీసీ సతీష్ (ప్రథమ స్థానం - బంగారం)బాంబు డిస్పోజల్ (రూమ్ సెర్చ్): పీసీ జుబేర్, మునీంద్రమ్మ (ప్రథమ స్థానం - బంగారం)బాంబు డిస్పోజల్ (వెహికల్ సెర్చ్): పీసీ గంగాధర్, జుబేర్ (ద్వితీయ స్థానం - రజతం)బాంబు ఎక్స్‌ప్లోజివ్ విభాగం: పోలీస్ జాగిలం "మెస్సి", హ్యాండ్లర్ పీసీ ప్రవీణ్ (ద్వితీయ స్థానం - రజతం)ఈ సన్మాన కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సీసీ రోడ్లు మంజూరు చేయండి : విజయేందర్ రెడ్డి



హైదరాబాద్, జులై 09 (విజన్ ఆంధ్ర) : రామంతపూర్ భగాయత్ పరిధిలోని వెంకట సాయి నగర్ కాలనీ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను తక్షణమే మంజూరు చేయాలని కోరుతూ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్టు విజయేందర్ రెడ్డి మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, ఐఏఎస్ కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ సీసీ రోడ్ల మంజూరు కోసం కమిషనర్‌కు అందించిన సిఫార్సు లేఖలను కూడా కమిషనర్‌కు అందజేశారు. కాలనీలో తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, ప్రస్తుతం సీసీ రోడ్ల నిర్మాణమే అత్యవసర అవసరంగా మారిందని వివరించారు. వర్షాకాలంలో బురద, దుమ్ము కారణంగా కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విద్యార్థులు, వృద్ధులు, మహిళలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, ఐఏఎస్ సానుకూలంగా స్పందిస్తూ, ప్రతిపాదనలను పరిశీలించి అవసరమైన పరిపాలనా చర్యలు చేపట్టి వెంకట సాయి నగర్ కాలనీ అంతటా సీసీ రోడ్ల మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రాధిక గుప్త ఐఏఎస్ మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు , వెంకట సాయి నగర్ కాలనీ అధ్యక్షులు విజయేందర్ రెడ్డి కాలనీ కమిటీ సభ్యులు , కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రతిష్ఠాత్మక కంప్యూటర్ సైన్స్ పాఠ్యపుస్తకాల ఆవిష్కరణ మహోత్సవం

## -ఎన్ఐటీ రాయ్‌పూర్‌లో వైభవంగా జరిగిన కార్యక్రమం



తెలంగాణ వెబ్ డెస్క్, జూలై 09 (విజన్ ఆంధ్ర): జాతీయ సాంకేతిక సంస్థ, రాయ్‌పూర్‌లో రెండు ప్రతిష్ఠాత్మక కంప్యూటర్ సైన్స్ పాఠ్యపుస్తకాలు ఘనంగా ఆవిష్కరించబడ్డాయి. "మెషీన్ లెర్నింగ్ ఎ స్ట్రక్చర్డ్ అప్రోచ్ ▪ కాన్సెప్ట్స్, ఆల్గోరిథమ్స్ అండ్ అప్లికేషన్స్", "డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ ఎ స్ట్రక్చర్డ్ అప్రోచ్ థియరీ, డిజైన్, ఎస్క్యూఎల్ అండ్ అప్లికేషన్స్" పేర్లతో వెలువడిన ఈ గ్రంథాలను ప్రముఖ విద్యావేత్తలు ఆవిష్కరించారు. ఈ పుస్తకాలను ప్రపంచ ప్రఖ్యాత కంప్యూటర్ శాస్త్రవేత్త రాజ్‌కుమార్ బుయ్యా, ఎన్ఐటీ రాయ్‌పూర్‌కు చెందిన చంద్రశేఖర్ జతోత్, గోవింద్ పి.గుప్తా ఆవిష్కరించారు. ఈ గ్రంథాల రచయితలైనటువంటి ప్రముఖ ప్రొఫెసర్ హెచ్. బాలాజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం, శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, జోగు సారిత, సమాచార సాంకేతికత విభాగం, శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, బి. పల్లవి, సమాచార సాంకేతికత విభాగం, శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాలలో ఎంతో ప్రాచుర్యం పొందారు.
ఈ రెండు పాఠ్యపుస్తకాలు మెషీన్ లెర్నింగ్, డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్‌లోని ప్రాథమిక అంశాల నుంచి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వరకు సమగ్రంగా రూపొందించబడ్డాయి. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు, ఐటీ రంగ నిపుణులకు ఇవి ఎంతో ఉపయోగకరమైన అకాడమిక్ గ్రంథాలుగా నిలుస్తాయని ఆవిష్కరణ సందర్భంగా ప్రముఖులు పేర్కొన్నారు. ఈ పుస్తకాలను లర్నెక్సా పబ్లికేషన్స్ ప్రచురించింది. ఈ సందర్భంగా సంస్థ సీఈఓ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ.. ఈ ప్రచురణలు ఉన్నత విద్యా రంగంలో నాణ్యమైన అకాడమిక్ గ్రంథాల అభివృద్ధికి ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తాయని తెలిపారు. ఎన్ఐటీ రాయ్‌పూర్‌లో జరిగిన ఈ ఆవిష్కరణ కార్యక్రమం దేశ, విదేశాల ప్రముఖ విద్యావేత్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, కంప్యూటర్ సైన్స్ విద్య, పరిశోధన, సాంకేతిక అభివృద్ధికి కొత్త దిశను చూపిందని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. ఈ మహోత్సవ కార్యక్రమంలో వివిధ విభాగాలకు అతిరథ మహారధులు హాజరయ్యారు.

# నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు

## ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి



ఆదిలాబాద్, జూలై 09 (విజన్ ఆంధ్ర): వాహనాలకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించి నంబర్ ప్లేట్లు లేకుండా రహదారులపై వాహనాలు నడిపితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేసి, వాహనాలను స్వాధీనం చేసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై కె. గంగాప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక వాహన తనిఖీలలో నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న రెండు ద్విచక్ర వాహనాలను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో నిబంధనలు పాటించని వాహన యజమానులపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో స్వయంప్రేరిత కేసులు నమోదు చేసి, సదరు వాహనాలను కోర్టులో డిపాజిట్ చేశారు. పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన వారిలో రాణదివెనగర్ కాలనీకి చెందిన ఇంగ్లే మాధవ్ (52) నంబర్ ప్లేట్ లేకుండా టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని నడుపుతూ పట్టుబడగా.. అదే కాలనీలో నివాసముంటున్న చౌహాన్ వంశీ (23) నంబర్ ప్లేట్ లేని హోండా యాక్టివా స్కూటీతో పోలీసులకు చిక్కాడు. వీరిద్దరిపై పోలీసులు సుమోటో కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడపడం వల్ల ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించబడటమే కాకుండా, వాహనాల గుర్తింపును తప్పించుకునే అవకాశం ఏర్పడి చట్టపరమైన సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. ప్రతి వాహన యజమాని ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా హెచ్ఎస్ఆర్పీ లేదా చెల్లుబాటు అయ్యే రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లను ఖచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.

# ప్రభుత్వ పాఠశాలలో షీ టీంభరోసా సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

భూపాలపల్లి జిల్లా :9 జులై (విజన్ ఆంధ్ర) భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా షీ టీం ఎస్సై ఫజల్ ఖాన్ ఆధ్వర్యంలో, భరోసా బృందంతో కలిసి కాటారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినుల కోసం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఫజల్ ఖాన్ మాట్లాడుతూ విద్యార్థినులకు గుడ్ టచ్ ▪ బ్యాడ్ టచ్, వీధి వేధింపులు (స్ట్రీట్ హరాస్‌మెంట్), మహిళల భద్రత, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వీడియో కాల్స్‌కు స్పందించవద్దని, వ్యక్తిగత వివరాలను ఎవరికీ పంచుకోవద్దని సూచించారు. విద్యార్థినులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని గుర్తించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మహిళలు, బాలికలపై ఎవరైనా అసభ్యంగా లేదా అనుచితంగా ప్రవర్తించినట్లయితే వెంటనే షీ టీంను 8712658162 నంబర్‌లో సంప్రదించాలని, ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాఠశాల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్-100 సేవలను వినియోగించాలని సూచించారు. అదేవిధంగా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో షీ టీం ఎస్సై ఫజల్ ఖాన్, భరోసా బృందం, షీ టీం సిబ్బంది పాల్గొన్నారు.

# అందుబాటు ధరల్లో వైద్య పరీక్షలు అభినందనీయ

## మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకటరెడ్డ లిరాంపల్లిలో పీపుల్స్ వెల్ఫేర్ డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభం..!



కాప్రా/జులై 09(విజన్ ఆంధ్ర ప్రతినిధి)ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్య నిర్ధారణ సేవలు అందించడం అభినందనీయమని నాగారం మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ మారెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లి ఎక్స్‌రోడ్ వద్ద పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'పీపుల్స్ వెల్ఫేర్ డయాగ్నస్టిక్ సెంటర్'ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతికతతో కూడిన వైద్య పరీక్షలు, ఆరోగ్య తనిఖీ ప్యాకేజీలు, ఇంటి వద్దే శాంపిల్స్ సేకరణ వంటి సేవలు ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. వ్యాధులను ముందస్తుగా గుర్తించడంలో డయాగ్నస్టిక్ కేంద్రాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యుడు జె.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. సామాన్య ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య పరీక్షలు అందించాలనే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రజలు కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ గాంధీనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు సత్యం సాగర్, కృష్ణారెడ్డి, సాయి, గోపి, జి.వెంకటేశ్వరరావు, బివి.సత్యనారాయణ, ఆనంద్, ఎం.శ్రీనివాస్, ఎం.ఎల్.చౌదరి, నాగరాజు, శేషగిరి రావు, శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 09,(విజన్ ఆంధ్ర)జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ప్రజలకు అందించిన ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు లతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 24వ తేదీ వరకు చేపట్టనున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీలు భాగస్వాములు కావాలని, బూత్ స్థాయి అధికారులు ఓటర్లకు అందించిన ఎన్యుమరేషన్ ఫారాల సేకరణలో అధికారులకు సహకరించాలని తెలిపారు. ఓటరు ఎన్యువరేషన్ ఫారం నింపడంలో రాజకీయ పార్టీలచే నియమించబడిన బూత్ స్థాయి ఏజెంట్లు సహకరించాలని, నింపిన ఫారాలను సేకరించడంలో బూత్ స్థాయి అధికారులతో కలిసి పని చేయాలని తెలిపారు. నింపిన ఫారాలలోని వివరాలను బూత్ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు బి.ఎల్.ఓ. యాప్ లో నమోదు చేస్తారని తెలిపారు. అర్హత గల ఓటర్లు స్వయంగా ఆన్ లైన్ లో వివరాలు నమోదు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా బూత్ స్థాయి ఏజెంట్లు సహకరించాలని, తమ బూత్ స్థాయి ఏజెంట్లు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# విపత్తుల వేళ ఎస్డీఆర్ఎఫ్ సేవలు అమూల్యం

## ఎప్పుడైనా అప్రమత్తంగా ఉండి ప్రజలకు సేవలందించాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్ సర్దాపూర్ 17వ బెటాలియన్‌లో విపత్తు నిర్వహణ పరికరాల ప్రదర్శన



రాజన్న సిరిసిల్ల, జూలై 9 (విజన్ ఆంధ్ర బ్యూరో):విపత్తులు, వరదలు వంటి అత్యవసర పరిస్థితుల్లో స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్డీఆర్ఎఫ్) పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్దాపూర్‌లో ఉన్న 17వ బెటాలియన్‌లో గురువారం నిర్వహించిన విపత్తు నిర్వహణ యంత్రాలు, రక్షణ పరికరాల ప్రదర్శన కార్యక్రమానికి కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్డీఆర్ఎఫ్ అధికారులు విపత్తుల సమయంలో వినియోగించే ఆధునిక పరికరాలను ప్రదర్శించారు. బాధితులను గుర్తించే కెమెరా, రిమోట్ కంట్రోల్ లైఫ్ బోయ్, లైట్ మాస్ట్, రోటరీ కట్టింగ్ మెషీన్, లిఫ్టింగ్ బ్యాగ్, పీవీసీ రక్షణ దుస్తులు, హైడ్రాలిక్ స్ప్రెడర్ కట్టర్ తదితర పరికరాల పనితీరు, వినియోగ విధానాన్ని కలెక్టర్, ఎస్పీతో పాటు అధికారులకు వివరించారు. గత ఏడాది వరదల సమయంలో కామారెడ్డి, వరంగల్ జిల్లాల్లో ఎస్డీఆర్ఎఫ్ అందించిన సేవలకు సంబంధించిన వీడియోలను కూడా ప్రదర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ జిల్లాలో ఎగువ మానేరు, మధ్య మానేరు, అన్నపూర్ణ, మల్కపేట రిజర్వాయర్లు ఉన్న నేపథ్యంలో వర్షాకాలం, ముఖ్యంగా సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో భారీ వరదల ప్రమాదం ఉంటుందని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను సమర్థవంతంగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. విపత్తుల సమయంలో ప్రతి నిమిషం విలువైనదని, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, ఎస్డీఆర్ఎఫ్ శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు తక్షణ సహాయం అందించాలని సూచించారు. గత ఏడాది వరదల సమయంలో విశేష సేవలు అందించిన ఎస్డీఆర్ఎఫ్ బృందాలను, అధికారులను అభినందిస్తూ ఎప్పుడూ సేవలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ వర్షాకాలంలో ధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గతంలో వరదలు ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని, విపత్తు సమయంలో వినియోగించే పరికరాలతో తరచూ మాక్ డ్రిల్స్ నిర్వహించాలని ఆదేశించారు. అవసరమైన అదనపు యంత్రాలు, పరికరాలను ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలని సూచిస్తూ ఉత్తమ సేవలు అందిస్తున్న అధికారులను అభినందించారు.
కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, కమాండెంట్ పీ.జె.పీ.సి. ఛటర్జీ, అడిషనల్ కమాండెంట్ ఎం.ఐ. సురేష్, అసిస్టెంట్ కమాండెంట్ సురేష్, ఎస్డీఆర్ఎఫ్ ఆర్ఐ బండి శ్రీనివాస్, తహసీల్దార్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రత్యేక దృష్టి సారించాం

## జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప,జూలై 9 (విజన్ ఆంధ్ర) ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)-2026 కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. గురువారం దేశ రాజధాని నుంచి భారత ఎన్నికల సంఘం సీనియర్ ఉప ఎన్నికల కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్‌తో పాటు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ కార్యక్రమం నిర్వహణ, పురోగతిపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కడప కలెక్టరేట్ బోర్డు సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, సంయుక్త కలెక్టర్ డా. నిధీ మీనా, జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు, కడప ఆర్డీవో మురళి సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని జిల్లా కలెక్టర్ భారత ఎన్నికల సంఘం అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలో ఎస్ఐఆర్ పురోగతిని తెలుపుతూ. జిల్లాలో 18,96,231 మంది ఓటర్లు, 2,251 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, గణన పత్రాల పంపిణీ 99.76 శాతం, డిజిటలీకరణ 71.42 శాతానికి చేరుకుందన్నారు. ప్రక్రియ వేగవంతానికి 54 మంది అదనపు సహాయ ఎన్నికల నమోదు అధికారులను నియమించి, గ్రామ, వార్డు సచివాలయాల్లో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వలసలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఆన్‌లైన్ ద్వారా గణన పత్రాల సమర్పణకు అవగాహన కల్పిస్తున్నామని, ప్రత్యేక పర్యవేక్షణతో నిర్దేశిత గడువులోగా నాణ్యమైన ఓటరు జాబితా రూపొందించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# గురుకుల లకు మటన్, చికెన్,గుడ్లు, పండ్లు, కూరగాయల సరఫరాకు సీల్డ్ టెండర్లకు ఆహ్వానం


## జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి సయ్యద్ అక్బర్ పాషా

గద్వాల జూలై 09 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లాలోని మైనారిటీస్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలకు మటన్, చికెన్,గుడ్లు,పండ్లు,కూరగాయల సరఫరాకు సీల్డ్ టెండర్ల ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి సయ్యద్ అక్బర్ పాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026▪27 విద్యా సంవత్సరానికి తెలంగాణ మైనారిటీస్ సంక్షేమ శాఖ పరిధిలోని తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు మటన్,చికెన్, గుడ్లు, పండ్లు, కూరగాయల సరఫరా కోసం అర్హత కలిగిన సరఫరాదారుల నుండి సీల్డ్ టెండర్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. టెండర్‌లో పాల్గొనే వారు సంబంధిత వస్తువుల సరఫరాకు చెల్లుబాటు అయ్యే లైసెన్స్ కలిగి ఉండటంతో పాటు కనీసం మూడు సంవత్సరాల సరఫరా అనుభవం కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు టెండర్ దరఖాస్తులను జోగులాంబ గద్వాల జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని

జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ కార్యాలయంలో పొందవచ్చని తెలిపారు. దరఖాస్తుల జారీ 10.07.2026 నుంచి ప్రారంభమవుతుందని,పూర్తి చేసిన సీల్డ్ దరఖాస్తులను 16.07.2026 సాయంత్రం వరకు కార్యాలయంలో సమర్పించాలన్నారు. అందిన టెండర్లను 17.07.2026న సంబంధిత నిబంధనల ప్రకారం తెరవనున్నట్లు వెల్లడించారు. టెండర్‌కు సంబంధించిన పూర్తి వివరాల కోసం 7013032567 నంబర్‌ను సంప్రదించాలని జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి సయ్యద్ అక్బర్ పాషా సూచించారు.

# ఉన్నత చదువులతో రాణించాలి

## విద్యార్థికి సూచించిన కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కులాంతర వివాహం చేసుకున్న జంటకు ప్రోత్సాహకం





గద్వాల జూలై 09 (విజన్ ఆంధ్ర బ్యూరో)అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, విద్యార్థులకు సైతం సహకారం అందిస్తున్నందున ఉన్నత చదువులు అభ్యసించి రాణించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఇటిక్యాల మండలం వావిలాల గ్రామానికి చెందిన విద్యార్థి లెవిన్ కుమార్ కు గురువారం జిల్లా కలెక్టర్ తన ఛాంబర్ లో ఎస్సీ అభివృద్ధి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉన్నత చదువులకు సహాయంగా ల్యాప్‌టాప్ ను అందజేశారు. అలాగే ఐజ మండలం చిన్న తాండ్రపాడు గ్రామానికి చెందిన రమేష్ సురేఖ దంపతులు కులాంతర వివాహం చేసుకోవడంతో ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రోత్సాహకంగా రూ.2.50 లక్షల విలువైన ఎఫ్ డి(ఫిక్స్ డిపాజిట్) పత్రాన్ని కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత,ఏఎస్సిడబ్ల్యూఓ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రత్యేక దృష్టి సారించాం

## జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప,జూలై 9 (విజన్ ఆంధ్ర) ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)-2026 కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. గురువారం దేశ రాజధాని నుంచి భారత ఎన్నికల సంఘం సీనియర్ ఉప ఎన్నికల కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్‌తో పాటు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ కార్యక్రమం నిర్వహణ, పురోగతిపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కడప కలెక్టరేట్ బోర్డు సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, సంయుక్త కలెక్టర్ డా. నిధీ మీనా, జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు, కడప ఆర్డీవో మురళి సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని జిల్లా కలెక్టర్ భారత ఎన్నికల సంఘం అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలో ఎస్ఐఆర్ పురోగతిని తెలుపుతూ. జిల్లాలో 18,96,231 మంది ఓటర్లు, 2,251 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, గణన పత్రాల పంపిణీ 99.76 శాతం, డిజిటలీకరణ 71.42 శాతానికి చేరుకుందన్నారు. ప్రక్రియ వేగవంతానికి 54 మంది అదనపు సహాయ ఎన్నికల నమోదు అధికారులను నియమించి, గ్రామ, వార్డు సచివాలయాల్లో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వలసలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఆన్‌లైన్ ద్వారా గణన పత్రాల సమర్పణకు అవగాహన కల్పిస్తున్నామని, ప్రత్యేక పర్యవేక్షణతో నిర్దేశిత గడువులోగా నాణ్యమైన ఓటరు జాబితా రూపొందించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# టీయూడబ్ల్యూజే అధ్యక్షుడిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన బండారు యాదగిరి





సంగారెడ్డి బ్యూరో, జూలై :09(విజన్ ఆంధ్ర)టి యుడబ్ల్యూజే( ఐజేయు) సంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షుడిగా బండారు యాదగిరి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు సంగారెడ్డిలోని టీఎన్జీవో భవన్ లో గురువారం జిల్లా మహాసభను నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ ప్రధాన కార్యదర్శి రామనారాయణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైసల్ అహ్మద్ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సలీం ఇతర ముఖ్య నేతలు ఈ మహాసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బండారు యాదగిరి ఏకగ్రీవంగా రెండోసారి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా రు మాండ్ల అనిల్, ఉపాధ్యక్షులుగా శ్రీనాథ్ మతీన్,ఆర్ సత్యనారాయణ రెడ్డి,కిషోర్ , కోశాధికారిగా అన్వర్,జాయింట్ సెక్రటరీలుగా ఉల్లిగడ్డల శివకుమార్ , శ్రీనివాసరెడ్డి ,డి సుమన్, వెంకటేష్ ,ఎంఏ రవూఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా విలాస్ (విల్సన్) ,అంజయ్య ,ఉల్వాల రాజు, రఫీఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా సంగమేశ్వర్ ,హాసిల్, శివన్న జైన్,సత్తార్ ఖాన్ ,హబీబ్ ఉద్దీన్ ,ఆర్ విజయ రాజు, బాలయ్య, శ్రీనివాస్ ,సత్యం, ఇర్షాన్, ప్రభాకర్ వెంకటేశం, మాజిద్ అలీ, మహబూబ్ ఘోరీ, ముజాహిద్, అబ్దుల్ హై లను ఎన్నుకున్నారు. జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా విభాగం అధ్యక్షునిగా ఆసిఫ్, ప్రధాన కార్యదర్శిగా బసవేశ్వర్, కోశాధికారిగా శ్రీధర్ జైన్, జాయింట్ సెక్రటరీగా భూపాల్ రెడ్డి ఎన్నికయ్యారు. చిన్న , మధ్య తరహా పత్రికల సంఘం అధ్యక్షుడిగా సిద్ధిక్ అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా జవాన్ ఈశ్వర్, కోశాధికారిగా లక్ష్మణ్ , ఉపాధ్యక్షుడిగా నజీర్ ఎన్నికయ్యారు.

# సమర్థతకు నిదర్శనమే తెలంగాణ పోలీస్

**-విధినిర్వాహణలో క్రీడలతోనే క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సంపూర్ణ ఆరోగ్యం**
**-తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్**
**-సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్**
**- ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించిన మల్కాజిగిరి, హైదరాబాద్ సీపీలు బి.సుమతి, వీసీ సజ్జనార్, సినీ నటుడు పోలిశెట్టి నవీన్**



ఎల్బీనగర్, జులై (విజన్ ఆంధ్ర): పోలీస్ విధినిర్వహణలో సమర్థతకు నిదర్శనమే తెలంగాణ పోలీస్ అని, క్రీడా పోటీలతో పోలీసులల్లో వృత్తి క్రమశిక్షణతోపాటు ఐక్యతాభావం, ఆరోగ్యం పెంపొందుతుందని తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో 8, 9వ తేదీల్లో నిర్వహిస్తున్న 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ̈2026 ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడా మహోత్సవాన్ని డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు. ఈ క్రీడా జ్యోతి కార్యక్రమం ఐక్యత, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. క్రీడా పోటీలను మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వీసీ.సజ్జనార్, ఐజీ డాక్టర్ గజారావు భూపాల్, సినీ నటుడు నవీన్ పోలిశెట్టి, మల్కాజిగిరి కమిషనరేట్‌కు చెందిన డీసీపీలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు. రిజర్వ్ ఇన్ స్పెక్టర్ ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ పరేడ్ నిర్వహించారు. అనంతరంతెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభోపన్యాసంలో భాగంగా.. పోలీస్ క్రీడలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ అధికారులను డిజిపి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సంవత్సరం నుంచి తెలంగాణ పోలీస్ గేమ్స్‌ను ఆలిండియా పోలీస్ గేమ్స్ తరహాలో క్లస్టర్ల వారీగా క్రీడాకారులను గ్రూపులుగా విభజించి, పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. బుధవారం క్లస్టర్ – ఏ గ్రూపులో 14 ఇండోర్ పోటీలలో వ్రెస్టిలింగ్, బాక్సింగ్, బాడీ బిల్డింగ్, ఆర్మ్ వ్రెస్టిలింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, యోగా, జుడో, వుస్, త్వైక్వాండ్, కరాటే, ఫెన్సింగ్, జిమ్నాస్టిక్స్, పెన్ కాక్ సిలాట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. మిగిలిన క్లస్టర్ పోటీలను రాష్ట్రంలోని వివిధ పోలీస్ యూనిట్లు నిర్వహించనున్నాయని, ఈ ఏడాది చివరలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ముగింపు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. క్రీడల ప్రాముఖ్యతను వివరిస్తూ... స్పోర్ట్స్ ఆర్ లైక్ మెడిటేషన్“ అని పేర్కొన్నారు. క్రీడలు పోలీస్ సిబ్బందిలో ఒత్తిడిని తగ్గించి, మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం, విధి నిర్వహణలో సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. క్రీడా పోటీలు పోలీస్ సిబ్బందిలో పరస్పర స్నేహభావాన్ని పెంపొందించడమే కాకుండా, ప్రజలతో మరింత సన్నిహిత సంబంధాలను ఏర్పరచుకునేందుకు ఒక ఉత్తమ వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి సీపీ సుమతి మాట్లాడుతూ.. తెలంగాణ పోలీస్ గేమ్స్ అనేవి క్రమశిక్షణ, బృంద నిర్మాణం (టీమ్ బిల్డింగ్), శారీరక దృఢత్వంతో పాటు వృత్తి నైపుణ్యానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. ప్రతిష్టాత్మక పోలీస్ క్రీడలను విజయవంతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఐజీ (ఇన్ స్పెక్టర్ ఆఫ్ జనరల్ ఆఫ్ పోలీస్) డాక్టర్ గజారావు భూపాల్ మాట్లాడుతూ.. క్రీడలు పోలీసుల మధ్యన స్నేహబంధాలు పెంపొందించడంతోపాటు ఐక్యతను పెంచుతాయన్నారు. ఈ ఏడాది నిర్వహిస్తున్న క్రీడా పోటీలను వివరించారు. క్లస్టర్ ఏ పోటీల్లో రాష్ట్రంలోని 21 పోలీస్ యూనిట్ల నుంచి మొత్తం 831 మంది పోలీస్ క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ పోటీల్లో 683 మంది పురుషులు, 148 మంది మహిళలు, పాల్గొంటున్నారని వివరించారు. మొత్తం 14 ఇండోర్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నాయని వివరించారు. హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ... క్రీడలు ప్రతి పోలీస్ అధికారికి అవసరమైన క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, టీమ్ వర్క్, నాయకత్వ లక్షణాలు, ఫిజికల్ ఫిట్ నెస్ తదితర విలువలను పెంపొందిస్తాయన్నారు. ప్రతి క్రీడాకారుడు అత్యున్నత క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ప్రముఖ సినీ నటుడు నవీన్ పోలిశెట్టి మాట్లాడుతూ.. నేటి సమాజంలో నిజమైన హీరోలు పోలీసులే“, వారు ప్రజల భద్రత కోసం నిరంతరం సేవలందిస్తున్నారన్నారు. మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించినటువంటి బి సుమతి చేసినటువంటి స్పెషల్ ఆపరేషన్ మహిళా పోలీస్ అధికారులలో స్ఫూర్తినింపిందని ఆయన కొనియాడారు. అర్ధరాత్రి వేళ భారీ ఆపరేషన్ నిర్వహించి, భారతదేశంలోనే సమర్థవంతమైన మహిళా పోలీస్ అధికారి విధులు నిర్వహిస్తే ఏ విధంగా ఉంటుందో సొసైటీకి చేసి చూపించిన ఘనత మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ సుమతికే దక్కుతుందని ఆయన ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి పోలీస్ అధికారి శారీరక దృఢత్వాన్ని కాపాడుకుంటూ క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. తెలంగాణ పోలీస్ అధికారులు, సిబ్బంది సమాజ భద్రత కోసం చేస్తున్న త్యాగాలు, సేవలను కొనియాడారు. క్రీడలు వ్యక్తిత్వ వికాసం, ఆత్మవిశ్వాసం, సహనం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలో వివిధ శాఖల పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను జాగ్రత్తగా పూర్తి వివరాలు నింపాలి

**సిద్దులూరులో మొత్తం దరఖాస్తు ఫారాలు 2365**
**ఇప్పటివరకు పూర్తి వివరాలు నింపిన దరఖాస్తు ఫారాలు సుమారు 100**
**బిఎల్ఓలు విజయలక్ష్మి, మోహన్**
**గ్రామ సర్పంచ్ ఎం.శ్రీనివాస్**
**కార్యదర్శి మధుకర్ రెడ్డి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జులై 09 (విజన్ ఆంధ్ర) : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( ఎస్ఐఆర్ ) ప్రక్రియలో భాగంగా దరఖాస్తు ఫారాలను తప్పులు లేకుండా పూర్తి వివరాలు రాయాలని సిద్దులూరు గ్రామ సర్పంచ్ ఎం శ్రీనివాస్ సూచించారు. 2365 దరఖాస్తు ఫారాలను ఓటర్లకు 100% అందజేశామని ఆయన స్పష్టం చేశారు. గురువారం వికారాబాద్ మండల పరిధిలోగల సిద్దులూరు గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా దరఖాస్తు ఫారాలలో వివరాలు ఎలా పూర్తి చేయాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎం శ్రీనివాస్ విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి మాచన్నగారి గైబులు ముదిరాజ్ తో మాట్లాడారు. 2002 ఓటర్ జాబితాలో ఓటరు పేరు ఉంటే దరఖాస్తు ఫారానికి ఎడమవైపు పూర్తి వివరాలు రాయాలని సూచించారు. 2002 ఓటరు జాబితాలో ఓటరు పేరు లేకుంటే అతని / ఆమె బంధువు పేరు రాయాలని ఆయన పేర్కొన్నారు. మూడవ భాగంలో ఓటరు ప్రస్తుత వివరాలు రాయాలని సూచించారు. దరఖాస్తు ఫారాలలో పూర్తి వివరాలు రాసిన అనంతరం బి ఎల్ ఓ లకు ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బి ఎల్ ఓ లు విజయలక్ష్మి మోహన్ పంచాయతీ కార్యదర్శి మధుకర్ రెడ్డి ఉపసర్పంచ్ వెంకటేష్ గౌడ్ ఎర్ర ప్రభాకర్ అశోక్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## భరోసా కన్వర్జెన్స్ మీటింగ్ నీ లైన్ డిపార్ట్మెంట్ తోటి నిర్వహించిన జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ ఐపిఎస్




నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): జులై 09 బాలలపై లైంగిక వేధింపులను అరికడదాం సురక్షిత బాల్యాన్ని అందిద్దాం జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్. ఐపిఎసనాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ ఆఫీస్ మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లాలో ఉన్న లైన్ డిపార్ట్మెంట్స్ అందర్నీ పిలిపించి జిల్లా ఎస్పీ గారు మీటింగ్ నిర్వహించడం జరిగింది. బాలలపై జరుగుతున్న లైంగిక వేధింపులను అరికడదాం సురక్షిత బాల్యాన్ని అందిద్దాం అనే విషయంపై జిల్లాలో ఉన్న అన్ని డిపార్ట్మెంట్స్ అనగా ఎడ్యుకేషన్ , షి టీమ్ , భరోసా , చైల్డ్ అండ్ వెల్ఫేర్ , లేబర్ అందరినీ పిలిపించి మీటింగ్ నిర్వహించి వారికి తగిన సలహాలు మరియు సూచనలు ఇవ్వడం జరిగింది , అనంతరం మిషిన్ వాత్సల్యా పథకం జిల్లా బాలల పరిరక్షణ విభాగం పేరు మీద కర పత్రాలను జిల్లా ఎస్పీ గారి చేతుల మీదుగా విడుదల చేయడం జరిగింది ,మీకు ఏమైనా ఇబ్బంది లేదా ఆపదలో ఉన్నపుడు ఏం చేయాలి అనేది ఈ పోస్టర్ లో క్లుప్తంగా వివరంగా ఉన్నాయని తెలపడం జరిగింది, ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ డిఎస్పి శ్రీనివాస్ సిసిఎస్సిఐ శంకర్ డి సి ఆర్ బి ఎస్ ఐ రమేష్ భరోసా ఎస్సై రజిత తో పాటు వివిధ విభాగాలకు చెందిన ఆఫీసర్స్ పాల్గొనడం జరిగింది.

## భూముల రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్



కామారెడ్డి బ్యూరో జులై 9(విజన్‌ఆంధ్ర) మొదటి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్ సాంకేతికతతో పారదర్శక సర్వే 60 రోజులకు మించి భూ భారతి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండొద్దు రీ సర్వే గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలిభూముల రీ సర్వే, నక్ష భూములపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రెవెన్యూ శాఖ కార్యదర్శి భూముల రీ సర్వేను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అత్యంత పారదర్శకంగా నిర్వహించి ప్రతి భూమికి స్పష్టమైన యాజమాన్య హక్కులు కల్పించాలని రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.భూముల రీ సర్వే, నక్ష భూముల అంశాలపై రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కామారెడ్డి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్. అడిషనల్ కలెక్టర్ విక్టర్. ఏడి ల్యాండ్ సర్వే శ్రీనివాస్. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం భూముల రీ సర్వేను దశలవారీగా చేపడుతోందని తెలిపారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సర్వేతో ప్రతి సర్వే నంబర్‌కు స్పష్టమైన యాజమాన్య హక్కులు నిర్ధారించడంతో పాటు ప్రతి భూమికి ప్రత్యేక భూధార్ యూనిక్ నంబర్ కేటాయించనున్నట్లు తెలిపారు. డీజీపీఎస్ (డిజిపి యస్), రోవర్స్, జీఐఎస్ (జిఐయస్) వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రీ సర్వే చేపట్టాలని ఆదేశించారు. రీ సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, ఆయా గ్రామసభల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రులను భాగస్వాములను చేయాలని సూచించారు. రీ సర్వేలో రెగ్యులర్ సర్వేయర్లతో పాటు లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. సోమవారం నుంచి సర్వేయర్లు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందికి బ్యాచ్‌ల వారీగా సమగ్ర శిక్షణ నిర్వహించి అనంతరం అన్ని గ్రామాల్లో రీ సర్వే కార్యక్రమాలు ప్రారంభించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూజిల్లాలో రీసర్వే పనులపై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కీలక ఆదేశాలుడైలీ ప్రోగ్రెస్ అప్డేట్, లైసెన్స్ సర్వేయర్ల సమావేశం నిర్వహణ సి సి యేల్ ఎ హైదరాబాద్ ఆదేశాల మేరకు జిల్లాలో జరుగుతున్న రీసర్వే పనులను వేగవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పలు కీలక సూచనలు చేశారు. డైలీ ప్రోగ్రెస్ రిపోర్టు రీసర్వే పనుల పురోగతిని ప్రతిరోజు స్ప్రెడ్ షీట్ రూపంలో సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిని క్షుణ్ణంగా పర్యవేక్షించాలని సూచించారులైసెన్స్ సర్వేయర్ల సమావేశం ఈరోజు లైసెన్స్ సర్వేయర్లతో సమావేశం నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేశారు. రీసర్వే పనుల్లో వారి పాత్ర, బాధ్యతలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని తెలిపారు. రీసర్వే ప్రక్రియను నిర్ణీత గడువులోగా, నాణ్యతతో పూర్తి చేయాలని, అందులో ఎలాంటి జాప్యానికి తావు ఇవ్వొద్దని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## మేడిపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నుల పంపిణీ

**కమలానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా సేవా కార్యక్రమం**




బోడుప్పల్,జూలై 9(విజన్ ఆంధ్ర) :మేడిపల్లిలోని కమలానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మేడిపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడిపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ రాజోజు నరసింహా చారి అధ్యక్షత వహించారు. డిస్ట్రిక్ట్ 320ఖీ, రీజియన్ ̈6, జోనల్ చైర్‌పర్సన్ లయన్ వేముల నాదం గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,“విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, సమాజానికి ఆదర్శప్రాయులుగా ఎదగాలని“ ఆకాంక్షించారు. లయన్స్ క్లబ్ సమాజ సేవకు ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రధాన కార్యదర్శి లయన్ మేకల మల్లేశం ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా మేడిపల్లి లయన్స్ క్లబ్ తరఫున విద్య, వైద్యం, సేవా రంగాల్లో మరిన్ని ప్రజోపయోగ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి లయన్ మేకల మల్లేశం,లయన్ లావణ్య,లయన్ సోమేశ్వర్,లయన్ సావిత్రి,లయన్ దుర్గ,లయన్ పల్లె బాలరాజు,కోశాధికారి లయన్ మహేందర్ రావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కాలనీవాసులు మరియు లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాంను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి బ్యూరో జులై 9(విజన్‌ఆంధ్ర) జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాంను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం పరిశీలించారు. ప్రతి నెల నిర్వహించే సాధారణ తనిఖీల్లో భాగంగా ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేసి, నిరంతర పర్యవేక్షణ కొనసాగించేలా సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గోదాం పరిసర ప్రాంతాల భద్రత, రికార్డుల నిర్వహణ, సీలింగ్ ప్రక్రియ తదితర అంశాలను పరిశీలించారు.

## విద్యా హై స్కూల్స్ విద్యార్థులకు ఇస్రో ఎన్.ఆర్.ఎస్.సి.లో అంతరిక్ష పారిశ్రామిక విద్యా సందర్శన

శేరిలింగంపల్లి జూలై 9 విజన్ ఆంధ్ర హైదరాబాద్‌లోని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (xూ=ా) ఆధ్వర్యంలోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (చీ=ూజ) లో విద్యా హై స్కూల్స్ విద్యార్థులకు 2026 ̈27 విద్యా సంవత్సరానికి సంబంధించిన “స్పేస్ ఇండస్ట్రియల్ విజిట్“ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపగ్రహ సాంకేతికత, రిమోట్ సెన్సింగ్, భూ పరిశీలన వ్యవస్థలు, అంతరిక్ష పరిశోధనలు, భారత అంతరిక్ష విజయాలు మరియు ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం గురించి ప్రత్యక్ష అవగాహన పొందారు. ఈ సందర్భంగా xూ=ా/చీ=ూజ శాస్త్రవేత్తలు డా. శ్రీనివాస్ మరియు శివయ్య విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. భారత అంతరిక్ష కార్యక్రమాల విజయాలు, శాస్త్రీయ పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలు, భవిష్యత్ కెరీర్ అవకాశాలపై విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన సందేశాలను అందించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా మార్గనిర్దేశం చేశారు. ఈ విద్యా పర్యటనలో 8వ, 9వ, 10వ తరగతులకు చెందిన 100 మంది విద్యార్థులు పాల్గొని విశేషమైన అనుభవాన్ని పొందారు. ఈ పర్యటన విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించడమే కాకుండా, భవిష్యత్తులో విజ్ఞానశాస్త్రం, సాంకేతిక విద్య, ఇంజినీరింగ్ మరియు అంతరిక్ష పరిశోధనల వైపు అడుగులు వేయడానికి ప్రేరణనిచ్చింది. ఈ కార్యక్రమంలో విద్యా గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ లయన్ డా. త్రిమూర్తులు పొన్నాడ ఖ. ×. ఘఎం జజుూ కరీం ఇమాన్ అలాగే విద్యా హై స్కూల్స్ గచ్చిబౌలి మరియు ఇంద్రారెడ్డి నగర్ శాఖల ఉపాధ్యాయ బృందం పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా లయన్ డా. త్రిమూర్తులు పొన్నాడ మాట్లాడుతూ, పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవాన్ని అందించే ఇటువంటి విద్యా పర్యటనలు వారి భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించడంలో ఎంతో దోహదపడతాయని అన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు భవిష్యత్తులో మరిన్ని వినూత్న విద్యా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

## అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు


**- జిల్లా అధ్యక్షులు రజనీకాంత్**
**జర్నలిస్టుల సమస్యలపై పోరాటమే ధ్యేయం**
**టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు**



కామారెడ్డి బ్యూరో జులై 9 (విజన్‌ఆంధ్ర): కామారెడ్డి జిల్లాలోని అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు ఇప్పించేందుకు శాయశక్తులా కృషి చేస్తామని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే, ఐజేయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి. రజనీకాంత్, తోట రాజేష్‌లు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన టీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. క్షేత్రస్థాయిలో రాత్రింబవళ్లు శ్రమిస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి తమ యూనియన్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన ప్రతి ఒక్క జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు దక్కేలా అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా, జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డుల మంజూరు వంటి దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి రాబోయే రోజుల్లో యూనియన్ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని తీర్మానించారు. జిల్లాలోని జర్నలిస్టులందరూ ఐక్యంగా ఉండి, యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి వెంకటేష్, ఉపాధ్యక్షుడు ముధాం శంకర్ పటేల్, కార్యవర్గ సభ్యులు బాల ప్రకాష్, ముదాం శివశంకర్, చక్రధర్, వెంకటేష్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర కమిటి సభ్యుడు లతీష్, జర్నలిస్టుల దాడుల కమిటీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఇంద్రసేనారెడ్డి, జిల్లా కమిటి సభ్యులు జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలి

**టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్,**



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జూలై 9 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామివారి అనుగ్రహం ప్రజలందరిపైన ఉండాలని టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ఆకాంక్షించారు. గాయత్రినగర్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్‌లో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన ప్రాంగణంలో కొలువైన శ్రీశ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి 14వ వార్షిక బ్రహ్మోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ శ్రీ పులిగోళ్ల శ్రీనివాస్ యాదవ్ , ఆలయ పాలకవర్గ సభ్యుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా పాల్గొని స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మరియు తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, అనంతరం ఆలయ కమిటీ సభ్యులు బండి రమేష్ గారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో. గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, వేముల సత్యం, మస్తాన్ రెడ్డి, శ్రీనివాస యాదవ్,ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## హామీ నిలబెట్టుకున్న సర్పంచ్

**ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి**
**25,116 ఆర్థిక సాయం**
**సర్పంచ్ ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న కరణం కీర్తి రామకృష్ణ**

వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 09 (విజన్ ఆంధ్ర) : వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలంలోని కోలుకుంద గ్రామంలో గొల్ల కుమార్ ̈పద్మ దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, తెలంగాణ సర్పంచ్ సంఘం ప్రధాన కార్యదర్శి కరణం కీర్తి రామకృష్ణపాల్గొని, సర్పంచ్ ఎన్నికల సమయంలో గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ గృహప్రవేశం చేసుకున్న కుటుంబానికి రూ. 25,116 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కరణం కీర్తి రామకృష్ణమాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడం తన బాధ్యత అని అన్నారు. గ్రామ అభివృద్ధితో పాటు ప్రజల సంతోషం, సంక్షేమమే తన లక్ష్యమని పేర్కొన్నారు. నిరుపేద కుటుంబాలు సొంత ఇంటిలో సంతోషంగా జీవించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. సర్పంచ్ అందించిన ఆర్థిక సహాయానికి లబ్ధిదారుల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ, ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నందుకు కరణం కీర్తి రామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరణం భుజంగం, గందె సంగమేశ్వర్, గొల్ల రాజమణి, మోహన్, రవీందర్ రెడ్డి, వినయతో పాటు గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యార్థులే భారత భవిష్యత్తు నిర్మాణ శిల్పులు

## లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



హనుమకొండ జిల్లా ప్రతినిధి జూలై 09 (విజన్ ఆంధ్ర)గిరిజన విద్యార్థులు తమలోని అపారమైన ప్రతిభను వెలికితీసి, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేస్తే దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే నాయకులుగా, సమాజానికి ఆదర్శంగా ఎదగగలరని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. గురువారం హనుమకొండ నగరంలోని పెద్దమ్మగడ్డలో గల తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ఆఫ్ ఎక్సలెన్స్‌ను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి & మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)తో కలిసి సందర్శించిన గవర్నర్, విద్యార్థులను ఉద్దేశించి ప్రేరణాత్మకంగా ప్రసంగించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థిలో అసాధారణ ప్రతిభ, అపారమైన సామర్థ్యం దాగి ఉంటుందని, దానిని క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నిరంతర శ్రమతో వికసింపజేసుకోవాలని సూచించారు. “మీ వ్యక్తిత్వం, మీ ప్రవర్తన, మీ మాటలు ఇతరులకు స్ఫూర్తినిచ్చేలా ఉండాలి. మీ ప్రతిభ చూసి సమాజం మీ వెంట నడిచే స్థాయికి ఎదగాలి“ అని అన్నారు. విజయం యాదృచ్ఛికంగా రాదని, స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించే వరకు అంకితభావంతో కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా లక్ష్యసాధనే ధ్యేయంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గిరిజన విద్యార్థులు విద్య ద్వారానే తమ కుటుంబాల భవిష్యత్తును మార్చడమే కాకుండా, సమాజ అభ్యున్నతికి మార్గదర్శకులుగా నిలవగలరని గవర్నర్ పేర్కొన్నారు. గిరిజన సమాజం నుంచి అత్యున్నత స్థానాలకు చేరుకొని దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే నాయకులు, శాస్త్రవేత్తలు, వైద్యులు, పరిపాలనాధికారులు, ప్రజాప్రతినిధులు తయారవ్వాలని ఆకాంక్షించారు. “మీ విజయం మీ కుటుంబానికే కాదు... మొత్తం గిరిజన సమాజానికి స్ఫూర్తిగా నిలవాలి. మీరు భారత భవిష్యత్తు నిర్మాతలు. పెద్ద కలలు కనండి... వాటిని నిజం చేసుకునే వరకు ఆగకండి“ అని గవర్నర్ విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. ఈ సందర్భంగా కళాశాలలో చదివి ఐఐటీ కాన్పూర్‌లో సీటు సాధించిన విద్యార్థినిని రాష్ట్ర గవర్నర్ ప్రత్యేకంగా శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేసి అభినందించారు. ఆమె విజయాన్ని ఇతర విద్యార్థినులకు స్ఫూర్తిదాయకంగా అభివర్ణిస్తూ, ఇదే స్ఫూర్తితో మరెందరో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం గవర్నర్ విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించారు. వారి విద్యాభ్యాసం, లక్ష్యాలు, భవిష్యత్ ఆశయాలను అడిగి తెలుసుకుని, మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురుకుల విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచారని తెలిపారు. గురుకులాల్లో కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా నాణ్యమైన విద్య, అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని అన్నారు. బాలికల హాస్టళ్లలో వింటర్ సీజన్‌కు ముందే వేడి నీటి సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తుందని వెల్లడించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలతో చదివి ఐఏఎస్, ఐపీఎస్ వంటి అత్యున్నత స్థానాలను అధిరోహించాలని, వారి భవిష్యత్తుకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, మారుమూల గిరిజన ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. షెడ్యూల్డ్ ప్రాంతాల అభివృద్ధి, గిరిజన సంక్షేమంలో గవర్నర్‌కు రాజ్యాంగబద్ధమైన ప్రత్యేక బాధ్యత ఉందని పేర్కొంటూ, విద్యార్థులను ప్రోత్సహించేందుకు స్వయంగా విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మిని, అధ్యాపకులు, విద్యార్థులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీలు ఆర్థిక వనరులను పెంపొందించుకోవాలి

### జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు



గద్వాల జూలై 09 (విజన్ ఆంధ్ర బ్యూరో)ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని శాశ్వత అభివృద్ధికి దోహదపడే విధంగా మూడేళ్ల కార్యాచారణ సమగ్రాభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు అన్నారు. గురువారం ఐడీఓసీ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధి అనేది కేవలం నిర్మాణ పనులకు మాత్రమే పరిమితం కాకుండా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే సమగ్ర ప్రక్రియ అని అన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, గ్రామీణ రహదారులు, వీధి దీపాలు, విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, ఉపాధి, మహిళా సాధికారత, యువత అభివృద్ధి, వ్యవసాయాభివృద్ధి వంటి అన్ని రంగాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ గ్రామాభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజల సూచనలు, స్థానిక అవసరాలు, సమస్యలను గుర్తించి వాటికి ప్రాధాన్యత క్రమంలో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వీబీజీరాంజీ పథకం,16వ ఆర్థిక సంఘం నిధులు, స్వచ్ఛ భారత్ మిషన్, జల్ సిరి, తదితర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి పథకాలను సమన్వయం చేస్తూ గ్రామ అవసరాలకు అనుగుణంగా నిధులను సమీకరించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో నీటి సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చాలని, ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు, ప్రతి రైతు పొలంలో నీటి కుంటలు, చెక్‌డ్యాంలు, రీచార్జ్ నిర్మాణాలు, వర్షపు నీటి సంరక్షణ చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించాలంటే ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లో ఘన వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రతి ఇంటి వద్ద చెత్తను తడి, పొడి, శానిటరీ, ప్రత్యేక వ్యర్థాలుగా వేరు చేసే అలవాటు పెంపొందించాలని సూచించారు. పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమన్నారు. గ్రామ పంచాయతీల ఆర్థిక స్వావలంబన కోసం ఇంటి పన్ను వసూళ్లను మెరుగుపరచడం, డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడం, పంచాయతీ ఆస్తుల సమర్థ వినియోగం, పౌర సేవలను విస్తరించడం ద్వారా స్వంత ఆదాయ వనరులను పెంచాలని సూచించారు. ప్రతి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి గ్రామాభివృద్ధిని బాధ్యతగా స్వీకరించి సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ ఆదర్శ గ్రామాల నిర్మాణానికి కృషి చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్, డిఆర్డిఓ ముషాహిదా బేగం,డిఎల్పిఓ ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎంపీడీవోలు, గ్రామ పంచాయతీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు

# హనుమకొండ రెడ్ క్రాస్‌లో తలసీమియా పేరెంట్స్ లాంజ్ శిలాఫలకం ఆవిష్కరించిన గవర్నర్

### హనుమకొండ రెడ్ క్రాస్ సేవలు అభినందనీయం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



హనుమకొండ జిల్లా ప్రతినిధి జులై 9 ( విజన్ ఆంధ్ర ) : హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో తలసీమియా బాధితుల కుటుంబ సభ్యుల కోసం వరంగల్ మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న డైనింగ్ హాల్ పై నిర్మించనున్న తలసీమియా పేరెంట్స్ లాంజ్ శిలాఫలకాన్ని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు శివ ప్రతాప్ శుక్లా గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు చాహత్ బాజ్‌పాయ్, రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు గవర్నర్‌కు ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. జూనియర్ రెడ్ క్రాస్ విద్యార్థులు బ్యాండ్‌తో గౌరవ వందనం అందించారు. అనంతరం గవర్నర్ రెడ్ క్రాస్ ప్రాంగణంలోని తలసీమియా పేరెంట్స్ లాంజ్ శిలాఫలకాన్ని ఆవిష్కరించి, తలసీమియా సెంటర్‌ను సందర్శించి చిన్నారులు, వారి తల్లిదండ్రులతో ఆత్మీయంగా మాట్లాడి పండ్లు పంపిణీ చేశారు. తదుపరి రెడ్ క్రాస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చేపడుతున్న సేవా కార్యక్రమాలను పాలకవర్గం గవర్నర్‌కు వివరించింది. ఈ సందర్భంగా గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ, తలసీమియా బాధితుల తల్లిదండ్రుల సౌకర్యార్థం పేరెంట్స్ లాంజ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రక్తదాన సేవలతో పాటు ఆరోగ్యం, మానవతా సేవలలో హనుమకొండ రెడ్ క్రాస్ విశిష్ట సేవలు అందిస్తోందని ప్రశంసించారు. రెడ్ క్రాస్ అభివృద్ధికి ప్రభుత్వ పరంగా అవసరమైన సహాయ సహకారాలు అందించేలా చర్చిస్తానని తెలిపారు. తలసీమియా బాధితులకు అందిస్తున్న సేవలకు రెడ్ క్రాస్ పాలకవర్గాన్ని అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా అన్ని విధాలుగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రెడ్ క్రాస్ పాలకవర్గం గవర్నర్‌ను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం . దాన కిషోర్, కుడా మాజీ చైర్మన్ ఇనుగాల వెంకట్ రామ్ రెడ్డి, హనుమకొండ రెడ్ క్రాస్ చైర్మన్ డా. పి. విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, డా. ఎం. శేషుమాధవ్, డా. కె. సుధాకర్ రెడ్డి, డా. సీహెచ్. సంధ్యారాణి, బిళ్ల రమణారెడ్డి, జూనియర్ రెడ్ క్రాస్ విద్యార్థులు, రెడ్ క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాత నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం



అల్వాల్, జూలై 9,(విజన్ ఆంధ్ర): ఓల్డ్ అల్వాల్ శ్రీ లక్ష్మీ నగర్ కాలనీలోని దుర్గామాత నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయ పునర్ని ర్మాణ పనులు గురువారం కాలనీ అధ్యక్షుడు బి. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైనాయి. ఈ సందర్భంగా అనంతశర్మ పంతులు చే పూజ చేయించి ఈ పనులు ప్రారంభించారు. అనంతరం కాలనీ అధ్యక్షుడు బి. నాగేశ్వరరావు మాట్లాడుతూ...అమ్మవారి దయతో బోనాల పండుగ లోగా ఈ పనులు పూర్తి అవుతాయన్నారు. పైన టిన్స్ తో షెడ్డు, ఫ్లోరింగ్ చేయుటకు సుమారు ఐదు లక్షల వ్యయంతో గుడి పునర్ నిర్మాణం చేపట్టామన్నారు. దీనికి కాలనీలో ఉన్న వారుస్వచ్ఛందంగా విరాళం అందజేసి సహకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు భాస్కర్ గౌడ్, నాగన్న, శివరాజ్, శ్రీకాంత్ రావు, నారాయణ, అనిల్, శివశరణప్ప, రవి, లింగారెడ్డి, కాంట్రాక్టర్ సూర్య, అనంతశర్మ పంతులు, విశ్వసేనా చారి పంతులు పాల్గొన్నారు.

## రీసర్వే పనులు వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




గద్వాల జూలై 9 (విజన్ ఆంధ్ర బ్యూరో)ప్రభుత్వం మొదటి దశలో జిల్లాలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో రీసర్వే పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి రెవిన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, సర్వే కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు (రెవెన్యూ), సంబంధిత అధికారులతో రీసర్వేపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నోటిఫై చేసిన ప్రతి గ్రామంలో గ్రామ సభలను ఆలస్యం చేయకుండా నిర్వహించి, వెంటనే రీసర్వే పనులను ప్రారంభించాలని సూచించారు. గ్రామసభల నిర్వహణను వాయిదా వేయకుండా, ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. లైసెన్స్ సర్వేయర్లతో పాటు రెగ్యులర్ సర్వేయర్లను కూడా రీసర్వేలో వినియోగించాలని, లైసెన్స్ సర్వేయర్లు చేసే పనిని మండల సర్వేయర్లు తప్పనిసరిగా పర్యవేక్షించాలని సూచించారు. రెవెన్యూ సిబ్బందికి సర్వేపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, ప్రతి శిక్షణార్థికి కనీసం ఒక గ్రామంలో ప్రాక్టికల్ సర్వే పూర్తి చేసిన తర్వాతే శిక్షణ పూర్తయినట్లు పరిగణిస్తామని వెల్లడించారు. నవంబర్ నాటికి తొలి దశలో లక్ష్యంగా పెట్టుకున్న గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి, మిగిలిన గ్రామాలను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. జిల్లా స్థాయిలో నిరంతర పర్యవేక్షణ, సమన్వయంతో రీసర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ విసి అనంతరం మాట్లాడారు. రీసర్వేకు సంబంధించి త్వరలోనే లైసెన్స్ సర్వేయర్లతో సమన్వయ సమావేశం నిర్వహించి వారికి తగిన సూచనలు చేయాలన్నారు. రాజోలి, ఎర్రవల్లి మండల కేంద్రాల్లో తహసిల్దార్ కార్యాలయాలతో పాటు గద్వాల, అలంపూర్ లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల భవన నిర్మాణాలకు అవసరమైన స్థలాలను గుర్తించాలన్నారు. భూభారతి, సాదా బైనమా, తదితర దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, సర్వే ఏడి నూకరాజు పాల్గొన్నారు.

## కౌకూర్ జిల్లా పరిషత్ హై స్కూల్ సందర్శించిన జిల్లా కలెక్టర్ మనుచౌదరి

### విద్యార్థులతో అల్పాహారం రుచిచూసిన జిల్లా కలెక్టర్ మనుచౌదరి



అల్వాల్, జూలై 9,(విజన్ ఆంధ్ర): అల్వాల్ మండలం లోని కౌకూర్ జిల్లా పరిషత్ హై స్కూల్ ను గురువారంజిల్లా కలెక్టర్ మనుచౌదరి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి కలెక్టర్ అల్పాహారం రుచి చూసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులు ప్రతిరోజు తమ దినచర్యలో భాగంగా న్యూస్ పేపర్ చదవాలని, అదొక అలవాటుగా చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు స్టేజ్ ఫియర్ వదలి వేసి మీకొచ్చిన భాషలోనే స్టేజ్ పై మాట్లాడాలని,అప్పుడే మీలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. పాఠశాలలో మొత్తం ఎంత మంది విద్యార్థులు ఉన్నారని, సౌకర్యాలు సరిగా ఉన్నాయా అని కలెక్టర్, హెడ్ మాస్టర్ మురళీ కృష్ణ మూర్తిని అడిగారు. అదనపు తరగతి గదులు అవసరమని కలెక్టర్ కు తెలిపారు. అవసరమైన మౌళిక వసతులైన టాయిలెట్లు, తరగతి గదులు వంటి వాటి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలోని సైన్స్ ల్యాబ్, లైబ్రరీ తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు కోరిన స్పోర్ట్స్ సామాగ్రిని అందిస్తానని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈఓ రేణుకా దేవి, అల్వాల్ ఎంఆర్ఓ రాములు, హెడ్ మాస్టర్, టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 15వ డివిజన్ సమస్యలపై కమిషనర్‌కు వినతిపత్రం

### త్వరలో క్షేత్రస్థాయి పర్యటనకు హామీ

కొత్తగూడెం బ్యూరో జూలై 10(విజన్ ఆంధ్ర)కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్ కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ మున్సిపల్ కమిషనర్ సుజాతను కలిసి డివిజన్‌లో నెలకొన్న పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించడం, రామచంద్ర పార్కు అభివృద్ధి పనులు చేపట్టడం, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణను మెరుగుపరచడం, పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచడం, మిషన్ భగీరథకు సంబంధించిన పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. వినతిపత్రంపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ సుజాత, రెండు రోజుల్లో 15వ డివిజన్‌ను స్వయంగా సందర్శించి పరిస్థితులను పరిశీలిస్తానని తెలిపారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి సమస్యలను గుర్తించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డివిజన్ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ఈ అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ తెలిపారు.

# నిర్మాణదారులతో కుమ్మక్కై ప్రభుత్వ ఆదాయానికి పొంగనామాలు



మల్కాజిగిరి, జూలై 9, విజన్ ఆంధ్ర): మల్కాజిగిరి ,మౌలాలి డివిజన్ పరిధిలో అక్రమ నిర్మాణాలురోజురోజుకూ పుట్టగొడుగుల్లా పెరుగుతుండటం,అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహారించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా గ్రీన్ హిల్స్ కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా సెట్ బ్యాక్ లేకుండా, పర్మిషన్ లేకుండా లేకుండా బహుళ అంతస్థుల భారీ భవన నిర్మాణాలు ఊపందు కున్నాయి. ఈ కట్టడాలు నిర్మాణ దశలో ఉండగా. సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంపై స్థానికంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ భవన నిర్మాణాల నియంత్రణ, ప్రజల ఫిర్యాదుల పరిష్కారం వంటికీలక బాధ్యతలను నిర్వర్తించాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు అక్రమ నిర్మాణాల నియంత్రణలో ఘోరంగా విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ కట్టడాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయడం, నిబంధనలఉల్లంఘనలను గుర్తించి చర్యలు తీసుకోవడం,ఆక్రమణలను తొలగించడం వంటి బాధ్యతలు టౌన్‌ప్లానింగ్ అధికారులపై ఉన్నప్పటికీ మౌలాలి సర్కిల్‌పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికారులు పనితీరు భిన్నంగా ఉందని ప్రజలు మండిపడుతున్నారు. ప్రతిరోజూ ఏదో ఒక కాలనీలో అనుమతులు లేని నిర్మాణాలు, కమర్షియల్‌కాంప్లెక్సు నిర్మితమ వుతున్నా సంబంధిత అధికారులు వాటి గురించి తెలిసి కూడా పట్టించుకోక పోవడంతో వారి పని తీరుపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనికి ప్రధాన సూత్ర దారులు. చైన్ మేలు,టౌన్ ప్లానింగ్ శ్రీనివాస్ అని ఆయన కనుసల్లోనే అమ్యామ్యాలన్నీ నడుస్తున్నాయని బహిరంగ ఆరోపణలు వినవస్తు న్నాయి. ఇదంతా చూస్తుంటే అసలు మల్కాజ్గిరి జోనల్ ఆఫీస్ లో కమిషనర్ ఉన్నాడా.. లేడా..? అని ప్రజలు ముక్కున వేలు వేసుకుంటున్నారు.. సెక్షన్ ఆఫీసులో పనిచేస్తున్న చైనా మేన్ లు.. వసూల్ రాజాగా మారుతున్నారు.. లక్షల్లో వసూలు చేసుకుంటూ అందరిని మేమే చూసుకుంటామంటూ ఇంటి యజమాని నుండి లక్షల్లో వసూలు చేస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే నోటీసుల జారీ చేసి ఆ పేరుతో యజమానులు నుండి అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్నారు. నాక్ ఇంజనీర్ సెక్షన్ లో పని చేస్తున్న కొంతమంది అక్రమ కట్టడాలకు వత్తాసు పలుకుతున్నారని బహిరంగ ఆరోపణలు వినపడుతున్నాయి. ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన సందర్భాల్లో కూడా కేవలంనోటీసులు జారీ చేయడం వరకు మాత్రమే పరిమితమవుతున్నారని,



అనంతర చర్యలు లేకపోవడం వల్లనేనిర్మాణ దారులు అక్రమ కట్టడాలను పూర్తి చేస్తు న్నారని స్థానికులు ఆరోపి స్తు న్నారు. అక్రమ నిర్మాణాలు నిరాటంకంగా కొనసాగుతుండటం పలు అనుమా నాలకు తావిస్తోంది . క్షేత్రస్థాయిలో తనిఖీలు సక్రమంగా జరుగుతు న్నాయా.. లేదా.. అనే సందేహాలు వ్యక్తమవు తున్నాయి. అక్రమనిర్మాణాల కారణంగా ప్రభుత్వానికి అనుమతి రుసుములు, అభివృద్ధి ఛార్జీలు, ఇతర పన్నుల రూపంలో రావాల్సిన కోట్ల రూపాయలు దొడ్డిదారిన అధికారులు, సిబ్బంది జేబులలోకి వెళు తుందని స్థానికులుఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు నిర్మాణదారులు, అధికారుల సహకారంతో నిబంధనలను ధిక్కరించి నిర్మాణాలు చేపడుతున్నా రనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. అధికారుల అవినీతి కారణంగా కొంతమందికి అక్రమ నిర్మాణాలు కాసులుపంటగా మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, అడిషనల్ కమిషనర్ (ప్లానింగ్), చీఫ్ సిటీ ప్లానర్ తదితరఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి మౌలాలి సర్కిల్ పరిధిలో నిరాటంకంగా కొనసాగు తున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. (. టౌన్ ప్లానింగ్ శ్రీనివాస్ వివరణ కోరగా టౌన్ ప్లానింగ్ లో పని చేసేవారు ఎవరైనా సరే మా దృష్టికి వస్తే తక్షణమే చర్యలు తీసుకుంటాం..

# విద్యార్థులతో కలెక్టర్ అల్పాహారం

- పేపర్ చదవడం రోజువారీ అలవాటుగా మార్చుకోండి
- స్టేజ్ ఫియర్‌ను అధిగమిస్తే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది
- పాఠశాల మౌలిక వసతులపై సమీక్ష
- సైన్స్ ల్యాబ్, లైబ్రరీ పరిశీలన
- విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేస్తామని హామీ
- అవసరాల ప్రతిపాదనలు పంపాలని అధికారులకు ఆదేశం





కుత్బుల్లాపూర్, జూలై 9 (విజన్ ఆంధ్ర): విద్యార్థులు ప్రతిరోజూ వార్తాపత్రిక చదివే అలవాటు పెంపొందించుకోవాలని, అది వారి విజ్ఞానాన్ని విస్తరించడంతో పాటు సమకాలీన అంశాలపై అవగాహన పెంచుతుందని మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సూచించారు. గురువారం అల్వాల్ మండలంలోని కౌకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో కలిసి ఉదయం అల్పాహారం చేశారు. అనంతరం వారితో ఆత్మీయంగా ముచ్చటిస్తూ విద్య, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పలు సూచనలు చేశారు. విద్యార్థులు వేదికపై మాట్లాడేందుకు భయపడకుండా, తమకు సౌకర్యంగా ఉన్న భాషలోనే ధైర్యంగా ప్రసంగించాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా స్టేజ్ ఫియర్ తొలగి, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని చెప్పారు. చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసంపైనా దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, అందుబాటులో ఉన్న సౌకర్యాల గురించి ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణమూర్తిని అడిగి తెలుసుకున్నారు. అదనపు తరగతి గదులు అవసరమని ప్రధానోపాధ్యాయుడు వివరించగా, టాయిలెట్లు, తరగతి గదులు తదితర మౌలిక వసతులకు సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే పంపాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పాఠశాలలోని సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు కోరిన క్రీడా సామగ్రిని త్వరలో అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, అల్వాల్ ఎంఆర్వో రాములు, ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కొటాలగూడలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 09 ( విజన్ ఆంధ్ర ) : గ్రామ ఓటర్లకు మొత్తం 1013 స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( ఎస్ఐఆర్ ) దరఖాస్తు ఫారాలను బిఎల్ఓ సరిత 100% అందజేశారని వారు తెలిపారు. ఇప్పటివరకు పూర్తి వివరాలు నింపిన దరఖాస్తు ఫారాలు సుమారు 100 వరకు బిఎల్ఓకు ఇచ్చారని వారు పేర్కొన్నారు. గురువారం వికారాబాద్ మండల పరిధిలోగల కొటాలగూడ గ్రామంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి మాచన్నగారి గైబులు ముదిరాజ్ తో మాట్లాడారు. 2002 ఓటర్ జాబితాలో ఓటరు పేరు ఉంటే దరఖాస్తు ఫారానికి ఎడమవైపు పూర్తి వివరాలు రాయాలని సూచించారు. 2002 ఓటరు జాబితాలో ఓటరు పేరు లేకుంటే అతని / ఆమె బంధువు పేరు రాయాలని ఆయన పేర్కొన్నారు. మూడవ భాగంలో ఓటరు ప్రస్తుత వివరాలు రాయాలని తెలిపారు. దరఖాస్తు ఫారాలలో పూర్తి వివరాలు రాసిన అనంతరం క్షుణ్ణంగా పరిశీలించి బిఎల్ఓ తీసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ పీలారం మల్లేశం, మాజీ ఎంపిటిసి మల్లేశం గౌడ్, పులుసుమామిడి మహిపాల్ రెడ్డి, కామారెడ్డిగూడ కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ సీనియర్ నాయకుడు అమరం కృష్ణారెడ్డి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన బండి రమేష్



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జూలై 9 ( విజన్ ఆంధ్ర ప్రతినిధి): బేగంపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అమరం కృష్ణారెడ్డి, గురువారం పరమపదించారు. ఈ విషాద వార్త తెలుసుకున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్, స్థానిక నాయకులతో కలిసి కృష్ణారెడ్డి నివాసానికి వెళ్లి ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కృష్ణారెడ్డి తనయుడు శ్రీనివాస్ రెడ్డిని కలిసి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా బండి రమేష్ గారు మాట్లాడుతూ, అమరం కృష్ణారెడ్డి పార్టీ పట్ల అంకితభావంతో ఎంతోకాలం సేవలందించిన సీనియర్ నాయకుడని, ఆయన చేసిన సేవలను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని అన్నారు. దివంగత అమరం కృష్ణారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, రమేష్, కరుణాకర్, విశాల్, భరత్, ఆలీ, సుజిత్ గౌడ్, అరుణ్, సురేష్, రమాదేవి, సురేష్ బాబు, అభిషేక్ తదితరులు పాల్గొని అమరం కృష్ణారెడ్డి గారికి ఘన నివాళులు అర్పించారు.

## పొరపాటున వేరే వారికి డబ్బులు పంపారా కంగారు వద్దు:

- ఈ నంబర్లకు ఫిర్యాదు చేయండి,

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జూలై 9 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): ఆన్‌లైన్ పేమెంట్స్ వినియోగదారులకు ముఖ్య గమనిక... యూపీఐ యాప్స్ ద్వారా తప్పుగా వేరే నంబర్‌కు డబ్బులు పంపినట్లయితే వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలు. ప్రస్తుత రోజుల్లో ఆన్‌లైన్ పేమెంట్ల వినియోగం విపరీతంగా పెరిగింది. అయితే, పేమెంట్ యాప్స్ ద్వారా డబ్బులు పంపేటప్పుడు ఒక్కోసారి తెలియక తప్పుడు నంబర్‌కు ట్రాన్సాక్షన్ చేస్తుంటారు. ఇలాంటి సమయంలో కంగారు పడకుండా ఈ క్రింది జాగ్రత్తలు తీసుకుంటే మీ డబ్బులు తిరిగి పొందే అవకాశం ఉంది. డబ్బులు తప్పుగా వెళ్లిన వెంటనే,ఆ ట్రాన్సాక్షన్ ఐ డి కనిపించేలా పూర్తి వివరాలతో ఒక స్క్రీన్‌షాట్ తీసి పెట్టుకోండి. ఏ యాప్ ద్వారా అయితే డబ్బులు పంపారో, వెంటనే ఆ సంబంధిత యాప్ కస్టమర్ కేర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయండి. కస్టమర్ కేర్ నంబర్ల వివరాలు. (గూగుల్ పే): 1800 419 0157 (ఫోన్ పే): 080 6872 7374 లేదా 022 6872 7374 (భీమ్ యాప్): 1800 120 1740 (పేటీఎం): 1204 456 456 (టోల్ ఫ్రీ నంబర్) ప్రత్యామ్నాయ మార్గం: ఒకవేళ కస్టమర్ కేర్‌ను సంప్రదించినా ఎలాంటి ఫలితం లేకపోతే, వినియోగదారులు నేరుగా అజూఎఱ.శీతీస్త్ర.ఱఅ వెబ్‌సైట్ ద్వారా కూడా తమ ఫిర్యాదును నమోదు చేయవచ్చు.

# నిర్లక్ష్యపు నీడలో ప్రభుత్వ వసతి గృహం

-రామవరం ప్రభుత్వ బాలుర వసతి గృహంలో గాలికొదిలిన పర్యవేక్షణ
-పేద విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం?
-రాత్రివేళల్లో హాస్టల్ దాటి బయటకు వెళ్తున్న విద్యార్థులు.
-ప్రహరీ గోడ లేక భద్రత ప్రశ్నార్థకం..
-తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన..
-సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి.




కొత్తగూడెం, జూలై 9 (విజన్ ఆంధ్ర): తెలంగాణ ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల రామవరం బాలుర వసతి గృహంలో నెలకొన్న పరిస్థితులు పేద విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని తల్లిదండ్రులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన వసతి, భద్రత, క్రమశిక్షణతో కూడిన వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నప్పటికీ, రామవరం వసతి గృహంలో మాత్రం సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల పరిస్థితులు అదుపు తప్పుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుదూర గ్రామాల నుంచి వచ్చిన నిరుపేద కుటుంబాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో స్థిరపడాలనే ఆశతో తల్లిదండ్రులు ప్రభుత్వ కళాశాలలో చేర్పించి, ప్రభుత్వ వసతి గృహంలో ఉంచుతున్నారు. రోజువారీ కూలీ పనులు, వ్యవసాయ పనులు చేస్తూ తమ పిల్లలు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలలు కంటున్న తల్లిదండ్రులకు ఇక్కడి పరిస్థితులు తీవ్ర నిరాశను కలిగిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. వసతి గృహంలో పూర్తిస్థాయి వార్డెన్ అందుబాటులో ఉండడం లేదని, ఉదయం వచ్చి కొంతసేపటికే వెళ్లిపోతున్నారని, అనంతరం రాత్రి వరకు హాస్టల్‌లో పర్యవేక్షించే బాధ్యత కలిగిన అధికారి ఎవరూ ఉండడం లేదని ఆరోపిస్తున్నారు. ఇదే సమయంలో వాచ్‌మన్ కూడా లేకపోవడంతో రాత్రి వేళల్లో హాస్టల్‌లోకి ఎవరైనా రావడం, బయటకు వెళ్లడం సులభంగా మారిందని చెబుతున్నారు. దీంతో కొంతమంది విద్యార్థులు రాత్రివేళల్లో హాస్టల్ నుంచి బయటకు వెళ్లి ఆలస్యంగా తిరిగి వస్తున్నారని, సమీపంలోని బెల్ట్ షాపులు, ఇతర ప్రాంతాల్లో రాత్రి 11 గంటల వరకు గడుపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరికొందరు మద్యం సేవించి తిరిగి వస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు ఇతర విద్యార్థుల చదువుపై, క్రమశిక్షణపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తోటి విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వసతి గృహానికి సరైన ప్రహరీ గోడ లేకపోవడం భద్రతాపరంగా మరో పెద్ద సమస్యగా మారింది. హాస్టల్ ప్రాంగణంలోకి ఎవరైనా సులభంగా ప్రవేశించే అవకాశం ఉండటంతో విద్యార్థుల భద్రతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల సమీప ప్రాంతాల్లో గోడలు దూకి దొంగతనాలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులు కూడా వచ్చిన నేపథ్యంలో హాస్టల్ భద్రతను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ, "మా పిల్లలు చదువుకుని మంచి భవిష్యత్తు సాధించాలని ప్రభుత్వ హాస్టల్‌లో చేర్పించాం. కానీ అక్కడ క్రమశిక్షణ, భద్రత లేకపోతే వారి భవిష్యత్తు ఏమవుతుంది? ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నా వాటిని అమలు చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించడం బాధాకరం" అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ వసతి గృహాల్లో 24 గంటల పర్యవేక్షణ ఉండాల్సిన అవసరం



ఉందని స్థానికులు సూచిస్తున్నారు. పూర్తిస్థాయి వార్డెన్, వాచ్‌మన్‌ను నియమించడం, విద్యార్థుల హాజరును క్రమం తప్పకుండా నమోదు చేయడం, రాత్రివేళ ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం, సందర్శకుల నియంత్రణ, సీసీ కెమెరాల ఏర్పాటు, ప్రహరీ గోడ నిర్మాణం వంటి చర్యలను వెంటనే చేపట్టాలని కోరుతున్నారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ ఈ అంశంపై తక్షణమే దృష్టి సారించి వాస్తవ పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, లోపాలను సరిదిద్దడంతో పాటు విద్యార్థులకు సురక్షితమైన, క్రమశిక్షణతో కూడిన విద్యా వాతావరణాన్ని కల్పించాలని తల్లిదండ్రులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# జూలై 13న ఆల్బెండజోల్ మాత్రాల పంపిణీ

- నులిపురుగులను నిర్మూలిద్దాం. పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుదాం.
- జిల్లా వైద్య ఆరోగ్య అధికారి సంధ్య కిరణ్మై



గద్వాల జూలై 09 (విజన్ ఆంధ్ర బ్యూరో) : డిఎంహెచ్ఓ.సంధ్య కిరణ్మై నేతృత్వంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అస్గర్ అలీ, ప్రోగ్రాం అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల అర్హులైన 1,71354 మంది పిల్లలందరికీ ఈనెల 13వ తేదీ సోమవారం రోజున సామూహిక ఉధృత మాత్రల పంపిణీ,ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు కళాశాలలు అంగన్వాడి కేంద్రాలలో ఆల్బెండజోల్ మాత్రాలను పంపిణీ చేయడం జరుగుతుంది. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 13వ తేది సోమవారం రోజున పిల్లలందరికి ఆల్బెండజోల్ మాత్రలు వేయడం జరుగుతుందని, ఆరోజు వేసుకోలేని పిల్లలకు ఈనెల 20వ తేదీ సోమవారం రోజున నిర్వహించే(ఎంయుడి) మాప్ అప్ డే రోజున వేయడం జరుగుతుంది. ఒక సంవత్సరం నుంచి రెండు సంవత్సరాల వయస్సు గల పిల్లలకు సగం టాబ్లెట్ రెండు సంవత్సరాల నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఒక టాబ్లెట్ వేస్తారు. ఈ మాత్రల వలన ఎటువంటి హానికరమైన దుష్ప్రభావాలు ఉండవని తల్లిదండ్రులు ఎలాంటి అపోహలకు గురికాకుండ తమ పిల్లలకు తప్పనిసరిగ మాత్రలు వేయించాలని కోరడం జరిగింది. విద్యాశాఖ మహిళా , శిశు సంక్షేమ శాఖ పంచాయత్ రాజ్ మున్సిపల్ , ఇతర అనుబంధాల శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి మాత్రలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నులిపురుగులు ఏ విధంగ సంక్రమిస్తాయి.. నులిపురుగులు సోకిన పిల్లలు బహిరంగ ప్రదేశంలో మలవిసర్జన చేయడం వలన అట్టి ప్రాంతంలో పాదరక్షలు ధరించకుండ తిరగడం వలన ఆరోగ్యకరమైన పిల్లలకు సంక్రమించడం జరుగుతుంది.నులిపురుగుల సంక్రమణ వల్ల రక్తహీనత పోషకాహార లోపం ఆకలి మందగించడం కడుపునొప్పి బలహీనత చదువుపై ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. నులిపురుగుల నివారణకు చేతులను సబ్బుతో శుభ్రంగ కడుక్కోవడం గోర్లు కత్తిరించుకోవడం పరిశుభ్రమైన నీరును త్రాగడం పాదరక్షలు ధరించడం బహిరంగ మలవిసర్జనకు బదులుగ మరుగుదొడ్లను వినియోగించడం వంటి పరిశుభ్రత చర్యలు పాటించడం వలన నులిపురుగులను నివారించవచ్చని తెలిపారు.

# న్యాయవాదే న్యాయ పోరాటమా...!!

- మహిళా న్యాయవాదిపై దాడి..
- అధికార పార్టీ అనుచరులని పోలీసులు కాపాడుతున్నారా..?
- హైకోర్టు ఆదేశాలు ఉన్న స్పందించరా....
- మేడిపల్లి పోలీసుల తీరుపై అభ్యంతరం వ్యక్తం చేసిన బాధితురాలు..




బోడుప్పల్, జూలై 9 (విజన్ ఆంధ్ర): మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళా న్యాయవాదిపై జరిగిన దాడి ఘటనలో అధికార పార్టీకి చెందిన వారని పోలీసులు కాపాడే ప్రయత్నం చేస్తున్నారని బాధిత న్యాయవాది మల్లుల శిరీష ఆరోపించారు. గురువారం మేడిపల్లి పోలీస్ స్టేషన్ వద్ద ఆమె విలేకరులతో మాట్లాడుతూ పోలీసుల సమక్షంలోనే తనపై దాడి జరిగినప్పటికీ నిందితులపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వారు స్వేచ్ఛగా తిరుగుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయస్థానాలు జారీ చేసిన ఉత్తర్వులను సైతం అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆమె విమర్శించారు.స్థానికంగా అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు, వారి అనుచరులు అలేటి మోహన్ రెడ్డి, వెంకటేష్ నారోజి, ప్రవీణ్ నారోజి, ప్రవీణ్ భార్య, తల్లి, మేఘనాథ్ తదితరులతో కలిసి తన కార్యాలయంలో ఉన్న తనపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ ఘటనలో తన క్లయింట్లకు సంబంధించిన కీలక కేసు ఫైళ్లు, పత్రాలు, ఇతర ముఖ్యమైన మెటీరియల్‌ను బలవంతంగా తీసుకెళ్లారని తెలిపారు. ఈ వ్యవహారంలో సీనియర్ సివిల్ జడ్జి మధ్యంతర నిషేధాజ్ఞ (ఇంటరిమ్ ఇంజంక్షన్) జారీ చేసినప్పటికీ పోలీసులు దానిని పట్టించుకోలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుల వద్ద ఉన్న మెటీరియల్‌ను స్వాధీనం చేసి బాధితురాలికి రక్షణ కల్పించాలని హైకోర్టు సూచించినప్పటికీ, స్థానిక పోలీసులు ఇప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు.అక్రమ ప్రవేశం, దొంగతనం వంటి తీవ్ర ఆరోపణలు ఉన్నప్పటికీ కేసును సాధారణ ఫిర్యాదుగా నమోదు చేసి కంటితుడుపు చర్యలకే పరిమితమయ్యారని ఆమె విమర్శించారు. అధికార పార్టీ నాయకుల ప్రమేయం ఉండటంతోనే పోలీసులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని బాధితురాలు ఆరోపించారు. ఒక మహిళా న్యాయవాదికే కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ న్యాయం జరగకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ఆమె ప్రశ్నించారు. న్యాయస్థానాల ఆదేశాలను వెంటనే అమలు చేసి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తనకు, తన కుటుంబానికి భద్రత కల్పించాలని ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులను కోరారు. ఈ సందర్భంగా పలువురు సహచర న్యాయవాదులు ఆమెకు మద్దతు ప్రకటించారు.

# సూపర్ ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించాలి

- సాగునీటి లభ్యత లేని ప్రాంతాల్లో వరి సాగు చేయ వద్దు
- తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను విస్తృతంగా ప్రోత్సహించాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై-09(విజన్ ఆంధ్ర) : సూపర్ ఎల్‌నినో ప్రభావం, రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, జలాశయాల్లో నీటి నిల్వలు, ఖరీఫ్ సాగు ప్రణాళికపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొన్నారు. పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, జూలై 9 నాటికి రాష్ట్రంలో 15 శాతం వర్షపాతం లోటు నమోదైందని తెలిపారు. కృష్ణా, గోదావరి బేసిన్లలో నీటి నిల్వలు గణనీయంగా తగ్గాయని, సాగునీటి లభ్యత దృష్ట్యా ఈ ఖరీఫ్‌లో నీటి విడుదలకు ప్రణాళికలు లేవని స్పష్టం చేశారు. సాగునీటి సౌకర్యం లేని ప్రాంతాల్లో రైతులు వరి సాగుకు దూరంగా ఉండాలని, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు. రైతు వేదికలు, ప్యాక్స్‌ల ద్వారా సూపర్ ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం అంచనాలు, నీటి లభ్యతపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల ప్రణాళిక రూపొందించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నీటి లభ్యతకు అనుగుణంగా విత్తనాల సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, జూలై 15 తర్వాత పరిస్థితిని సమీక్షించి ప్రత్యామ్నాయ పంటలపై స్పష్టమైన సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో వరద పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు తక్కువ నీటితో సాగయ్యే పంటలను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి శ్రీమాల, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బడిబాట నమోదులో కామారెడ్డి జిల్లా ప్రథమ స్థానంలో నిలవాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి బ్యూరో జులై 9(విజన్ఆంధ్ర) : బడిబాట నమోదులో కామారెడ్డి జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచే విధంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అధికారులు అందరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీ ఆశిష్ సంగ్వాన్ గారు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో మన కామారెడ్డి జిల్లా నాలుగవ స్థానంలో నిలిచింది.గత సంవత్సరం కంటే అదనంగా 10 శాతం విద్యార్థుల నమోదు లక్ష్యాన్ని అధిగమించిన మాచారెడ్డి మండల విద్యాధికారి సురభి దేవేందర్ రావు, తాడ్వాయి మండల విద్యాధికారి రామస్వామి, కల్వరాల కాంప్లెక్స్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విష్ణు వర్ధన్ రెడ్డి, ఎర్రాపహాడ్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సంగారెడ్డి గారిని కలెక్టర్ సన్మానించారు.బడిబాటలో విద్యార్థులను నమోదు పెంపు కార్యక్రమాన్ని ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రతిష్టాత్మకంగా స్వీకరించి తమకు నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా అధిగమించాలని గౌరవ కలెక్టర్ సార్ కోరడం జరిగింది.కామారెడ్డి జిల్లాను విద్యారంగంలో ఉన్నత స్థాయిలో ఉండే విధంగా కృషి చేయాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ శ్రీ గిరి జిల్లా విద్యాధికారి మల్లిఖార్జున్, సమగ్ర శిక్ష సమన్వయ కర్తలు నాగవేందర్, వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## శివాలయం ప్రధాన పూజారికి డాక్టరేట్



కొత్తగూడెం బ్యూరో జూలై 10(విజన్ ఆంధ్ర) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ప్రగతి నగర్ శివాలయం ప్రధాన అర్చకులు ప్రముఖ శాస్త్రీయ సంగీత విద్వాంసులు మద్దిరాల ముక్తేశ్వర రావు కు అమెరికన్ యునైటెడ్ యూనివర్సిటీ పూదుచ్చేరి లోని కంభన్, కలైరంగం ఆడిటరియం లో పౌశీడర్ మరియు డైరెక్టర్ కె. వెంకటేశం చేతులమీదుగా డాక్టరేట్ ను ప్రధానం చేశారు. నలుబది సంవత్సరాల అనుభవం కలిగి ఉండి భజన బృందాలను రెండు తెలుగు రాష్ట్రాలలో తయారుచేసి ఆధ్యాత్మికత వైపు నడిపిస్తున్నారని ప్రశంసించారు. ఈయనకు సంగీతంలో 48 గంటలు హార్మోనియం ప్రదర్శన ఇచ్చినందుకు "హార్మోనియం విధ్వన్వమని" బిరుదుతో సత్కరించారు. కాకినాడలో భజన పోటీలలో అద్భుతమైన న్యాయనిర్ణీతగా వ్యవహరించినందుకు కాకినాడ కమిటీ వారు " స్వర్ణ సింహ కంకణం" బహుకరించి సత్కరించారు "సువర్ణ సింహ తలాట సన్మాన" గ్రహీతగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమెరికన్ యునైటెడ్ యూనివర్షిటీ బాధ్యులకు ముక్తేశ్వర్ రావు ధన్యవాదములు తేలిపారు. ముక్తేశ్వర్ రావు ను కొత్తగూడెం అర్చకులు, పుర ప్రముఖులు, శివ భక్తులు అభినందించారు.

# రాష్ట్రస్థాయి అధికారుల ఆకస్మిక తనిఖీ

**- రామవరం అర్బన్ హెల్త్ సెంటర్ లో సేవల పరిశీలన**



కొత్తగూడెం బ్యూరో, జూలై 10(విజన్ ఆంధ్ర) : రామవరం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల బృందం గురువారం ఆకస్మికంగా సందర్శించి వైద్య సేవలు, మౌలిక వసతులు, రికార్డుల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించింది. హైదరాబాద్ రీజినల్ ఆఫీస్ ఫర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌కు చెందిన పబ్లిక్ హెల్త్ స్పెషలిస్ట్ డాక్టర్ వరుణ్ విజయ్ గైకి నేతృత్వంలోని బృందం ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని సందర్శించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీసింది. గర్భిణీ స్త్రీలకు ప్రతి వారం అందిస్తున్న వైద్య సేవలు, ఉచిత పరీక్షలు, ఏఎన్‌సీ నమోదు వివరాలు, ఈడీడీ రిజిస్టర్లు, ఇప్పటివరకు జరిగిన ప్రసవాల గణాంకాలను పరిశీలించింది. అలాగే క్షయ (టీబీ), కుష్టు (లెప్రసీ) వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న చికిత్స, ఉచిత మందుల పంపిణీ విధానాన్ని సమీక్షించారు. రోగులకు రక్తపోటు పరీక్షలు నిర్వహిస్తున్న తీరును ప్రత్యక్షంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ, బయో మెడికల్ వ్యర్థాల సురక్షిత నిర్వహణపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని, రికార్డుల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని డాక్టర్ వరుణ్ విజయ్ సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీల్లో క్వాలిటీ మేనేజర్ శృతి, హెల్త్ ఎడ్యుకేటర్ రాంప్రసాద్, ప్రోగ్రామ్ ఆఫీసర్ సలిత పాల్గొన్నారు. హెల్త్ సెంటర్ తరఫున నర్సింగ్ ఆఫీసర్ శంకరమ్మ, పీహెచ్ఎం శ్రీనివాసరావు, ల్యాబ్ టెక్నీషియన్ స్పందన, డీఈఓ స్ఫూర్తి, ఏఎన్ఎంలు రాజేశ్వరి, శ్రీలక్ష్మి తదితర వైద్య సిబ్బంది తనిఖీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎల్ నినో ప్రభావంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

**- రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి**




అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి. జూలై 9, (విజన్ ఆంధ్ర ) : ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న ఎల్ నినో ప్రభావం వల్ల లోటు వర్షపాతం నమోదు అవుతున్నందున వరి సాగు చేసే రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని, ఆ దిశగా రైతులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, రాష్ట్ర ఐ. టి. శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వ్యవసాయ, నీటిపారుదల, వాతావరణ శాఖల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ భారత వాతావరణ శాఖ వారు ఎల్ నినో ప్రభావంతో వర్షాకాలంలో లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున సాగునీటి ప్రాజెక్టులు, చెరువులలో పూర్తిస్థాయి నీరు రాకపోవచ్చు అని, వరి పంట సాగు చేసే రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించేలా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పప్పుధాన్యాలు, కూరగాయల పంటలు సాగు చేసుకునే విధంగా కృషి చేయాలని సూచించారు. నీటిపారుదల శాఖ అధికారులు రిజర్వాయర్లలో నీటిమట్టంపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలని, త్రాగునీటికి ఇబ్బంది రాకుండా పర్యవేక్షించాలని, నీటిపారుదల, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.

# వందే భారతం కార్యక్రమానికి విశేష స్పందన




హైదరాబాద్, జూలై 9 (విజన్ ఆంధ్ర) : అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ ప్రారంభించిన 'వందే భారతం' కార్యక్రమానికి దేశ, విదేశాల నుంచి విశేష స్పందన లభిస్తోంది. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో పాటు అమెరికా, యూకే, యూఏఈ, కెనడా తదితర దేశాల నుంచి దరఖాస్తులు అందినట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్నాలజీ, కృత్రిమ మేధ(ఏఐ), డీప్‌టెక్ విభాగాల్లో అత్యధిక దరఖాస్తులు నమోదైనట్లు చెప్పారు. మహిళా పారిశ్రామికవేత్తలు, గ్రామీణ ఆవిష్కర్తలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న యువత పెద్దఎత్తున పాల్గొన్నట్లు వెల్లడించారు. దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 19 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. 'వందే భారతం' ఒక పోటీ మాత్రమే కాదని, భారతదేశ భవిష్యత్తును మార్చే ఆలోచనలకు వేదిక అని గౌతమ్ అదానీ అన్నారు. దేశం నలుమూలలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా లభించిన స్పందన తమ విశ్వాసాన్ని మరింత బలపరిచిందని తెలిపారు. ప్రతి ఆవిష్కర్తకు సరైన అవకాశం, మార్గదర్శకత్వం అందించి వారి ఆలోచనలను విజయవంతమైన ఆవిష్కరణలుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు చివరి లబ్ధిదారుని వరకు చేరేలా సమర్థవంతంగా అమలు చేయాలి

**- ప్రతి రంగంలో నాణ్యత, పారదర్శకత, సాంకేతికతకు ప్రాధాన్యం ఇవ్వాలి: రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా**




హనుమకొండ జిల్లా ప్రతినిధి జూలై 09 ( విజన్ ఆంధ్ర ) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి వాటి ప్రయోజనాలు చివరి లబ్ధిదారుని వరకు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల అధికారులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రాష్ట్ర గవర్నర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం వందే మాతరం, తెలంగాణ రాష్ట్ర గీతం ఆలపించారు. ఈ సమావేశంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్. నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల చారిత్రక నేపథ్యం, అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, వైద్యఆరోగ్య సేవలు, వ్యవసాయం, మౌలిక వసతులు, ఇతర కీలక అంశాలపై జిల్లా కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్‌కు వివరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో చేపడుతున్న భద్రత తదితర చర్యలను పోలీస్ కమిషనర్ శ్వేత వివరించారు. సమీక్ష సందర్భంగా టీబీ ముక్త్ భారత్ కార్యక్రమం అమలు, టీబీ బాధితులకు అందిస్తున్న వైద్య సేవలు, స్క్రీనింగ్ క్యాంపులు, ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం, పల్స్ పోలియో కార్యక్రమం అమలు తీరుపై గవర్నర్ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ, టీబీ నిర్మూలనకు మరింత పటిష్ట చర్యలు చేపట్టాలని, విస్తృత స్థాయిలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి వ్యాధి నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. పల్స్ పోలియో కార్యక్రమం వంద శాతం లక్ష్యంతో అమలయ్యేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులు, వివిధ శాఖల అధికారులతో అన్ని అంశాలపై విస్తృతంగా చర్చించామని పేర్కొన్న గవర్నర్, పరిపాలనలో ఎదురయ్యే చిన్నచిన్న లోపాలను ఎప్పటికప్పుడు సరిదిద్దుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. జిల్లాల అభివృద్ధికి జిల్లా పరిపాలన, పోలీసు శాఖతో పాటు అన్ని శాఖల అధికారులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. సమీక్షలో సమర్పించిన వివరాలను పరిశీలిస్తే ప్రతి రంగంలో మరింత నాణ్యత, సామర్థ్యం పెంచుకునే అవకాశం ఉందని, అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజమైన లబ్ధిదారునికి చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్న గవర్నర్, ఈ ప్రాంతం పత్తి సాగుకు ప్రసిద్ధి చెందినందున రైతులను అధిక ఆదాయం వచ్చే పంటల సాగు, విలువ ఆధారిత వ్యవసాయం వైపు ప్రోత్సహించాలని సూచించారు. పాలనలో పారదర్శకత అత్యంత కీలకమని, పారదర్శక వ్యవస్థ వల్ల ప్రజలకు, రైతులకు, ప్రభుత్వానికి సమానంగా ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ప్రస్తుతం ప్రపంచం కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ – ఏఐ ) యుగంలోకి అడుగుపెట్టిందని పేర్కొంటూ, ఏఐ అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులకు దారి తీస్తోందన్నారు. భవిష్యత్తులో కొన్ని సవాళ్లు ఉన్నప్పటికీ, దానిని భయపడాల్సిన అవసరం లేదని, ఏఐని మనిషి సృష్టించాడనే విషయాన్ని గుర్తుంచుకొని, దానిని సమర్థవంతమైన సాధనంగా ఉపయోగించుకుని పరిపాలన, సేవల నాణ్యతను మరింత మెరుగుపరచుకోవాలని సూచించారు. ప్రతి శాఖ సమన్వయంతో, ప్రతి రంగానికి సమాన ప్రాధాన్యం ఇస్తూ పనిచేస్తే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని గవర్నర్ పేర్కొన్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా అమలు చేస్తున్న తీరును ఆయన అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో అధికారులు సమన్వయంతో పనిచేయడం అభినందనీయమని అన్నారు. వర్షాకాలంలో సంక్షేమ హాస్టళ్లలో నివసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. హాస్టళ్లలో అత్యవసర మౌలిక వసతులు, మరమ్మతులు, డ్రైనేజీ తదితర పనుల కోసం ప్రతి జిల్లాకు రూ. కోటి వరకు ప్రత్యేక నిధులు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి హాస్టల్‌లో స్వచ్ఛమైన తాగునీరు, పారిశుద్ధ్యం, వేడి నీటి సదుపాయం, డ్రైనేజీ నిర్వహణ, విద్యుత్ భద్రత, వంటశాలలు, మరుగుదొడ్ల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. పైకప్పుల లీకేజీలు, దెబ్బతిన్న భవనాలు, నీటి సరఫరా, డ్రైనేజీ తదితర పెండింగ్ మరమ్మతులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. హాస్టళ్లలో క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, సీజనల్ వ్యాధులు, నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. అవసరమైన మందులు, ప్రథమ చికిత్స సామగ్రి, అత్యవసర వైద్య సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. అత్యవసర నిధులను పారదర్శకంగా, అవసరాలకు అనుగుణంగా వినియోగించి, విద్యార్థులకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలని కలెక్టర్లను ఆదేశించిన మంత్రి, "హాస్టళ్లలో చదువుతున్న ప్రతి విద్యార్థి భద్రత, ఆరోగ్యం, విద్యా ప్రగతి ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం" అని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చివరి లబ్ధిదారునికి చేరేలా అధికారులు బాధ్యతతో పనిచేసి, హనుమకొండ, వరంగల్ జిల్లాలను అన్ని రంగాల్లో ఆదర్శ జిల్లాలుగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో హనుమకొండ జిల్లాల ఆదనవు కలెక్టర్లు రవి సంధ్యారాణి, వరంగల్ డీసీపీ ధారా కవిత, హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెందిన వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అవసరాలకు అనుగుణంగా సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి

**- ఇందిరమ్మ గృహాల అర్హుల జాబితాను గెజిటెడ్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలి**

**- ఎంపీడీవోలు సమన్వయంతో పారదర్శకంగా గృహాల ధృవీకరణ పూర్తి చేయాలి**

**- కలెక్టర్ కోయ శ్రీహర్ష**




పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై-09(విజన్ ఆంధ్ర) : గ్రామాల సమగ్రాభివృద్ధి గ్రామాల అవసరాలు, స్థానిక వనరులకు అనుగుణంగా ఉండేలా ప్రతి గ్రామపంచాయతీ మూడు సంవత్సరాల కాలానికి గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన అవగాహన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. గ్రామపంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులను సమర్థవంతంగా వినియోగించి, చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. పూర్తయిన పనులను వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. ప్రతి గ్రామపంచాయతీ తమ పరిధిలోని సహజ వనరులు, స్థానిక ఆదాయ మార్గాలను గుర్తించి పంచాయతీ ఆదాయాన్ని పెంచుకునేలా ప్రణాళికలు రూపొందించాలని, ఆర్థికంగా బలోపేతమైన గ్రామపంచాయతీలతోనే స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని, ప్రతి ఇంటి నుంచే ఘన వ్యర్థాల నిర్వహణ ప్రారంభం కావాలని సూచించారు. తడి, పొడి, ప్లాస్టిక్ వ్యర్థాలను వేర్వేరుగా సేకరించే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించి, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు కలిగిన ప్రతి గ్రామీణ పేద కుటుంబానికి 125 రోజుల ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే మహిళా సంఘాల అవసరాల కోసం నిర్మిస్తున్న వీఓ భవనాల పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రాబోయే మూడు సంవత్సరాల కోసం రూపొందించే గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు కేవలం పత్రాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలయ్యేలా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ కమిటీ ప్రతిపాదించిన గృహాల అర్హుల జాబితాను గెజిటెడ్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ధృవీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ప్రక్రియలో మండల అభివృద్ధి అధికారులు సమన్వయ బాధ్యతలు చేపట్టి, గృహాల ధృవీకరణను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పి సీఈఓ నరేందర్, జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రాజేశ్వర్, సంబంధిత అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు, పాల్గొన్నారు.

# వరికి ప్రత్యామ్నాయ పంటలపై రైతులను ప్రోత్సహించాలి

**- లోటు వర్షపాతంలో కరీంనగర్ జిల్లా**

**- ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలి**

**- రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలి**

**- వ్యవసాయ అధికారులు నిత్యం క్షేత్రస్థాయిలో ఉండాలి**

**- జిల్లా కలెక్టర్**



కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) జూలై 09..జిల్లాలో లోటు వర్షపాతం నమోదవుతున్నందున, ఎల్ నినో ప్రభావం చూపే అవకాశం ఉన్నందున వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం, వానాకాలం సాగు, తదుపరి కార్యాచరణ అంశంపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వ్యవసాయ, నీటిపారుదల తదితర శాఖల అధికారులతో మాట్లాడారు. కరీంనగర్ జిల్లాలో ఇప్పటివరకు లోటు వర్షపాతం ఉందని, ఎల్ నినో ప్రభావం కూడా కనిపిస్తున్నందున రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని అన్నారు. రైతు వేదికల్లో వ్యవసాయ అధికారులు సమావేశాలు నిర్వహించి రైతులకు సూచనలు అందించాలన్నారు. ఆరుతడి పంటలు, పప్పు ధాన్యాలు, తృణ ధాన్యాలు, నూనె గింజలు, కూరగాయలు వంటి పంటల సాగు ఆవశ్యకత తెలియజేయాలని ఆదేశించారు. దీనివల్ల ఎల్ నినో ప్రభావాన్ని కొంతమేర అధిగమించవచ్చని, రైతులకు నష్టం జరగకుండా ఉంటుందని సూచించారు. జిల్లాలో బావులు, బోరుబావుల ద్వారా కూడా ఎక్కువ మొత్తంలో పంటలు సాగు అవుతున్నందున, ఆరుతడి పంటలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, తక్కువ నీటితో పంట చేతికి వస్తుందని అన్నారు. ఆన్లైన్ ద్వారా యూరియా అమ్మకాల ప్రక్రియ కొనసాగుతున్నందున జిల్లాలో ఎరువుల పంపిణీకి ఎలాంటి ఇబ్బందులూ ఉండబోవని అన్నారు. యూరియా అమ్మకాల ప్రక్రియను వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వం సూచించిన ఏడు రకాల సన్న వడ్లను మాత్రమే సాగు చేయాలని, తద్వారా బోనస్ పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ రకాలను ప్రతి రైతుకు తెలియజేయాలని అన్నారు. ప్రతి రైతు వేదికను ఉపయోగించుకొని స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో రైతులకు వానాకాలం వ్యవసాయానికి సంబంధించిన ప్రతి సూచన తెలియజేయాలన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు నీటి లభ్యత, విడుదల తదితర అంశాలపై పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని, వ్యవసాయ, నీటిపారుదల శాఖలు సమన్వయంతో రైతు శ్రేయస్సు కోసం పనిచేయాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా ప్రతి రైతుకు సాంకేతిక సలహాలు, వాతావరణ సూచన, పంటల ఎంపికపై మార్గదర్శకాలు ఇవ్వాలన్నారు. జిల్లాలో పరిస్థితిని ఎప్పటికప్పుడు మండలాల వారీగా సమీక్షిస్తానని తెలిపారు. అధికారుల సూచనలు రైతులు పాటించాలని, ఎలాంటి వదంతులను నమ్మవద్దని కోరారు. ఎల్ నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు నిత్యం అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. వీబిజిరామ్ జి పథకం అమలుకు సరైన ప్రణాళిక రూపొందించి కూలీలకు వీలైనన్ని ఎక్కువ పని దినాలు కల్పించాలని తెలిపారు.

# ప్రెస్‌క్లబ్ నూతన కమిటీకి డీఎస్పీ అభినందనలు

**- పత్రికా రంగం ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభం..**

**- బాధ్యతాయుత జర్నలిజంతో ప్రజలకు సేవ చేయాలి**

**- డీఎస్పీ శ్రీనివాస్**



వేములవాడ రాజన్న సిరిసిల్ల, జూలై 9 (విజన్ ఆంధ్ర బ్యూరో): టీయూడబ్ల్యూజే (హెచ్-143) వేములవాడ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని వేములవాడ డీఎస్పీ శ్రీనివాస్, టౌన్ సీఐ వీరప్రసాద్ ఘనంగా సన్మానించి అభినందించారు. గురువారం రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ సభ్యులు డీఎస్పీ, సీఐలను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి, శ్రీ వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐ వీరప్రసాద్ నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కొలిపాక నరసయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీతో పాటు కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ వారి పదవీకాలం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా రంగం నాలుగో స్థంభంగా కీలక బాధ్యతను నిర్వర్తిస్తోందన్నారు. ప్రజలకు వాస్తవాలను నిష్పాక్షికంగా, బాధ్యతాయుతంగా చేరవేయడంలో పాత్రికేయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ, చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, సామాజిక సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పోలీసు శాఖ, మీడియా పరస్పర సహకారం ఎంతో అవసరమని అన్నారు. వాస్తవాధారిత వార్తలతో మీడియాపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించిన ఆయన, ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు పాత్రికేయుల సంక్షేమం కోసం కూడా నూతన కార్యవర్గం కృషి



చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రేగుల రాంప్రసాద్, జిల్లా క్రమశిక్షణ కమిటీ సభ్యుడు సయ్యద్ రసూల్, ప్రెస్‌క్లబ్ ముఖ్య సలహాదారులు కొత్వాల్ శ్రీనివాస్, జితేందర్ రావు, ఉపాధ్యక్షులు సీహెచ్ దేవరాజ్, విష్ణు, కోశాధికారి పంపరి నాగరాజు, ఫాహద్, జింక శ్రీధర్, కమటాల విజయ్, దెబ్బేటి ప్రవీణ్, శ్రీరామోజు వేణు, సంటి రాజేందర్, షబ్బీర్, గంగాధర్, పండుగ స్వామి, నవీన్, ఆసీమ్, లక్ష్మీనారాయణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలి

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**




వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 9 ( విజన్ ఆంధ్ర ) : గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఆదర్శ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై ఎంపీడీఓ, ఎంపీఓ, ఏపీఓ, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ... జిల్లాలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు మూడు సంవత్సరాల సమగ్ర అభివృద్ధి ప్రణాళికను రూపొందించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లోని జనాభా, ప్రాథమిక ఆరోగ్య, అంగన్వాడి కేంద్రాల వివరాలను సాఫ్ట్ వేర్ లో నమోదు చేయవలసి ఉంటుంది అని ఆయన అన్నారు. గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధికి 6 మంది మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇవ్వడం జరిగిందని, వీరి సూచనల మేరకు గ్రామాల అభివృద్ధి పై అవగాహన కల్పించుకోవాలని ఆయన సూచించారు. గ్రామాల్లో కుక్కల బెడదతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని దీన్ని దృష్టిలో పెట్టుకొని జంతు జనన నియంత కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోతున్న క్రమంలో జలసిరి పథకం ద్వారా ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంట కుంట, ప్రతి ఊరిలో ఊట కుంటలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్నందున రైతులు వర్షాభావ పంటలు, తక్కువ నీటితో సాగు చేసే పంటలు వేసే విధంగా గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి పంటల సాగుపై అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. రైతులు ఆయిల్ ఫామ్ ను సాగుచేసేందుకు ప్రోత్సహించాలని ఇట్టి పంటకు ప్రభుత్వం పెద్ద మొత్తంలో సబ్సిడీ ఇస్తుందనే విషయాన్ని రైతులకు తెలియచేయాలని కలెక్టర్ తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా ముందుగా అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు) ఉమా శంకర్ ప్రసాద్ మాట్లాడుతూ... జిల్లాలో గ్రామపంచాయతీ ఆదాయ వనరులను సమకూర్చుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలకు కేటాయించిన నిధుల కంటే అధికంగా ఖర్చు చేయకూడదని ఆయన సూచించారు. గ్రామాల్లో వీధి దీపాలు సమకూర్చుకోవాల్సి ఉందని ఆయన తెలిపారు. గ్రామ పంచాయతీలలో విద్యుత్తు బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని, వీటిని అధిగమించేందుకు సోలార్ సిస్టంను వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ, వ్యర్థాలను వేరుచేసి ఇద్దాం.. మన గ్రామాలను స్వచ్ఛందంగా మార్చుకుందాం అనే గోడ ప్రతిని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో , జడ్పీ సీఈఓ సుధీర్, డిపిఓ జయసుధ, డీఆర్డిఓ శ్రీనివాస్, అడిషనల్ డిఆర్డిఓ సత్తయ్య, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సులు మీటింగ్స్ కు పంపకండి



నారాయణపేట, జూలై 9 ( విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ కార్యక్రమాలకు మరియు రాజకీయ నాయకుల మీటింగ్స్ కు ఆర్టీసీ బస్ లు వాడుకోవద్దని సామాజిక కార్యకర్త హెచ్. నర్సింహా గురువారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత రాజకీయ మీటింగులు, ప్రభుత్వ మీటింగులకు జనాలను తీసుకొని పోవడానికి ఆర్టీసీ బస్ లు ఉపయోగించడం మంచి పద్ధతి కాదు అని తెలిపారు.వారం రోజులలో వ్యవది లోనే జడ్చర్ల మరియు రేపు ఖమ్మం మీటింగులకు పేట డిపో నుండి 23 బస్ లు పంపడం వలన ప్రయాణికులకు మరియు విద్యార్థులకు రెండు, మూడు రోజులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల నుండి నిరుపేద విద్యార్థులు పట్టణాలలో చదువులు కొనసాగిస్తున్నారని వారి కోసం ప్రతినిత్యం ఆర్టీసీ బస్సులను నడిపించాలని వారి భవిష్యత్తు కోసం ప్రభుత్వం కృషి చేయాల్సిందిగా కోరారు . పేద ప్రజలు పట్టణాలలో ఆర్టీసీ బస్సులలో ప్రయాణించి తమ విద్యను కొనసాగిస్తున్నారని ఈ ఆర్టీసీ బస్సులను ప్రభుత్వ మీటింగ్లకు రాజకీయ నాయకుల మీటింగ్లకు తరలిస్తే ఆ విద్యార్థులు చదువుకు దూరమయ్యే అవకాశం ఉందని అన్నారు.అంతేకాకుండా పేద ప్రజల కోసమే ప్రభుత్వం ఆర్టీసీని నడిపిస్తుందని ఈ ప్రభుత్వం గుర్తించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మాదిరిగా మీటింగులకు ఆర్టీసీ బస్ లు పంపకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రతినిధులు కూడా ప్రైవేట్ వాహనాలను మీటింగ్స్ కు ఏర్పాటు చేసుకొని ప్రయాణికులకు, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా సహకరించాలని పేర్కొన్నారు.

# బాధితులెవరైనా సమాన గౌరవం..

**- స్వీపర్, స్కావేంజర్ కు గౌరవం..**

**- సూర్యాపేట జిల్లా ఎస్పి కె నరసింహ**



సూర్యాపేట జూలై 09:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చే ప్రతి బాధిత ఫిర్యాదుదారుడికి చట్టం ముందు సమాన గౌరవం, మర్యాద దక్కుతుందని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ మరోసారి నిరూపించారు.తన కార్యాలయంలోనే తాత్కాలిక ప్రాతిపదికన రోజువారీ కూలీలుగా పనిచేస్తున్న స్వీపర్, స్కావెంజర్ దంపతులు గురువారం బాధితులుగా ప్రజావాణికి రాగా, వారికి అంతే గౌరవం ఇచ్చి సమస్యను అడిగి తెలుసుకున్నారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో షకీరా బేగం, షేక్ షఫీ దంపతులు ఇద్దరూ స్వీపర్, స్కావెంజర్ గా తాత్కాలిక ప్రాతిపదికన రోజు కూలీగా విధులు నిర్వహిస్తున్నారు.సూర్యాపేట పట్టణంలో ఒక ప్లాట్ కొనుగోలు విషయంలో తీవ్రంగా మోసపోయామని,లేని ప్లాట్ ను ఉన్నట్లు చూపించి డబ్బులు తీసుకున్నారని,మేము మోసపోయం న్యాయం చేయాలంటూ జిల్లా పోలీస్ ప్రజావాణిలో ఎస్పీ నరసింహకి ఫిర్యాదు చేశారు.సాధారణంగా ఎస్పీ కార్యాలయానికి వచ్చే బాధితులను ఎస్పీ ఎంతో మర్యాదగా తన ముందు కూర్చోబెట్టుకుని,వారి సమస్యలను ఓపిగ్గా వింటారు. ఇదే క్రమంలో తన కార్యాలయంలో పనిచేసే సిబ్బంది బాధితులుగా వచ్చిన వేళ, వారికి కూడా అదే గౌరవాన్ని ఇస్తూ ఎదురుగా కూర్చోబెట్టి వారి బాధను విన్నారు. వారికి పూర్తి ధైర్యాన్ని, భరోసాని ఇస్తూ... ఈ మోసంపై తక్షణమే విచారణ జరిపి బాధితులకు భరోసా కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అండగా నిలిచిన ఎస్పీ స్పందన పట్ల బాధితులు సంతోషం వ్యక్తం చేశారు.

# స్థానిక ఎమ్మెల్యేను కలిసిన మాలోతు శ్రీదేవి బాలు నాయక్



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జులై 9 ( విజన్ ఆంధ్ర): మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 26వ వార్డు ఉన్న, వివిధ కాలనీలకు, గత 30 సంవత్సరాల నుండి దాదాపుగా 80 శాతానికి పైగా సైడ్ డ్రైనేజీలు అందుబాటులో లేవు వార్డ్ కౌన్సిలర్ మాలోత్ శ్రీదేవి బాలు నాయక్ వర్షాకాలం వస్తే, సిగ్నల్ కాలనీ, విక్రమ్ నగర్ కాలనీ, భగత్ సింగ్ కాలనీ, ఆదర్శనగర్ కాలనీ, బ్యాంక్ కాలనీలో, రోడ్డు మీద ఉన్న మురికి నీరు ఇంట్లోకి వచ్చే పరిస్థితి నెలకొని ఉన్నది ఆమె అన్నారు.గత ప్రభుత్వాలు కూడా సైడ్ కాలువల మీద దృష్టి పెట్టకపోవడం వల్ల, కాలనీ ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు, వర్షాకాలంలో అనేక రకాలైన రోగాల బారిన పడుతున్నారు. కనుక ఇట్టి పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని రాబోయేది వర్షాకాలం కనుక, 26వ వార్డుకి మిషన్ జల్ పథకం కింద సైడ్ కాలువలను మంజూరు చేయవలసిందిగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ ని కలిసి, చెప్పడం జరిగిందని ఆమె అన్నారు. 26వ వార్డుకు సంబంధించిన వివిధ కాలనీలలో సైడ్ కాలువల కోసం ఎస్టిమేట్ అందివ్వడం జరిగింది. ఎమ్మెల్యే ఎస్టిమేట్ అంతా చూసి కచ్చితంగా మీ వార్డుకి సైడ్ కాలువలు మంజూరు చేయించడానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాలోతు బాలునాయక్, అజ్మీర శ్రీకాంత్, చుక్క శ్యాంప్రసాద్, సూర్నేని రాము, పోడకంటి వెంకటేష్, తేలూరి రమేష్, శిరసాని అనిల్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు నాణ్యమైన సేవలే లక్ష్యం

**- డీసీహెచ్ఎస్, టీ-హబ్‌లో ఆకస్మిక తనిఖీ చేసి పలు సూచనలు**

**- పరిశుభ్రత, సేవల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. వై. పవిత్ర**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై -09(విజన్ ఆంధ్ర) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డా. వై. పవిత్ర గురువారం పెద్దపల్లిలోని డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ హాస్పిటల్ సర్వీసెస్ (డీసీహెచ్ఎస్) ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో దంత వైద్య పరీక్ష చేయించుకున్న అనంతరం వైద్య సూపరింటెండెంట్ డా. కె. శ్రీధర్‌ను కలిసి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ఆరోగ్య సేవల నాణ్యతపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రోగి కేంద్రిత సేవలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, సేవల నాణ్యతను నిరంతరం మెరుగుపరచాలని ఆదేశించారు. అనంతరం డీఎంహెచ్‌వో డా. వై. పవిత్ర పెద్దపల్లిలోని టీ-హబ్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని అన్ని ల్యాబ్ గదులను పరిశీలించి, అందుతున్న సేవలు, పరికరాల వినియోగం, పరిశుభ్రత, నిర్వహణ విధానాలను సమీక్షించారు. ల్యాబ్ సిబ్బందితో మాట్లాడి వారి పనితీరు, సేవల నాణ్యత, ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ల్యాబ్‌లలో పరిశుభ్రతను కచ్చితంగా పాటిస్తూ పరికరాలను సక్రమంగా నిర్వహించాలని, అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. రోగులకు సకాలంలో ఖచ్చితమైన పరీక్షా ఫలితాలు అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ తనిఖీలలో వైద్యాధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

**- గ్రామ పంచాయతీల ఆదాయ వనరులను పెంచుకోవాలి**

**- గ్రామ పంచాయతీ, సమగ్ర అభివృద్ధి ప్రణాళికతో మూడేళ్ల అభివృద్ధికి కార్యాచరణ రూపొందించాలి**

**- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



సూర్యాపేట జూలై 09:(విజన్ ఆంధ్ర) : గ్రామ పంచాయతీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గ్రామ పంచాయతీ,సమగ్ర అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం, రవి మహల్ సూర్యాపేట జిల్లాకు చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటివరకు జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు మంజూరైన నిధులతో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

**గ్రామ వనరులను వినియోగించుకుని ఆదాయాన్ని పెంచుకోవాలి**

ప్రతి గ్రామ పంచాయతీ తమ పరిధిలో ఉన్న సహజ వనరులు, స్థానిక ఆదాయ మార్గాలను గుర్తించి పంచాయతీ ఆదాయాన్ని పెంచుకునే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. గ్రామ పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం అయితేనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

**పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత**

గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలని ఆదేశించారు. గ్రామ సభల్లో ప్రజల నుంచి వచ్చిన ప్రధాన సమస్యలను ప్రతి గ్రామ పంచాయతీ గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ రాబోయే మూడు సంవత్సరాల కాలానికి గ్రామ పంచాయతీ,సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) ను రూపొందించుకోవాలని సూచించారు. ప్రణాళిక తయారీలో ప్రధానంగా ఏడు అంశాలపై వివిధ శాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించుకోవాలని తెలిపారు.

**ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి**

ఘన వ్యర్థాల నిర్వహణ ప్రతి ఇంటి నుంచి ప్రారంభం కావాలన్నారు. ఇంటి వద్దనే చెత్తను వేరు చేసే విధానాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. చెత్త సేకరణ సమయంలో తడి చెత్త, పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, తదితరాలను వేర్వేరుగా సేకరించి శాస్త్రీయ పద్ధతిలో పారవేయాలని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి ఇంటిలో మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు.స్వచ్ఛ భారత్ మిషన్ క్రింద మరుగువదొడ్లు , సామజిక ఇంకుడు గుంటలు , కమ్యూనిటీ సానిటరీ కంప్లీక్స్ మరియు ప్లాస్టిక్ వేస్ట్ మానేజ్మెంట్ యూనిట్స్ నిర్మించాలని సూచించారు.

**జీ రామ్ జీ పథకం ద్వారా ఉపాధి కల్పన**

జీ రామ్ జీ పథకంలో భాగంగా జాబ్ కార్డు కలిగిన ప్రతి గ్రామీణ పేద కుటుంబానికి 125 రోజుల పని దినాలు తప్పనిసరిగా కల్పించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే గ్రామాల్లో మహిళా సంఘాల కార్యకలాపాలకు ఉపయోగపడే వీఓ భవనాల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక కేవలం పత్రాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, జడ్పీ సీఈఓ శిరీష, డీఆర్డీఓ సన్యాసయ్య , డీపీఓ యాదగిరి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యలు పరిష్కరిస్తేనే రాజకీయ మైత్రి

**- పేదలకు పట్టాలిచ్చి ప్రజాపాలనగా నిరూపించుకోండి**

**- ప్రభుత్వానికి సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి హితవు**

**- గుండ్ల సింగారం సందర్శించిన పల్లా, తక్కళ్ళపల్లి, నెల్లికంటి**



హనుమకొండ జిల్లా ప్రతినిధి జులై 9 ( విజన్ ఆంధ్ర ) : రాష్ట్రంలో ప్రజాసమస్యలు పరిష్కరిస్తేనే కాంగ్రెస్ తో కమ్యూనిస్టుల రాజకీయ మైత్రి కొనసాగుతుందని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా పరిధిలోని గుండ్ల సింగారంలోని సురవరం సుధాకర్ రెడ్డి నగర్ లో ఇండ్ల కూల్చివేత జరిగిన ప్రాంతాన్ని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి పల్లా వెంకట్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీలో కాల్చివేయబడిన సురవరం సుధాకర్ రెడ్డి భవన్ తో పాటు వందలాది పేదల గుడిసెలను పరిశీలించి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. సిఎం రేవంత్ రెడ్డి గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి లాగా ప్రజల మనసుల్లో నిలిచి పోవాలంటే పేదల గురించి ఆలోచించాలని సూచించారు.పేదలకు ఇందిరమ్మ రాజ్యం తెస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి రాగానే వారి గూడును కూల్చివేయడం దుర్మార్గమని అన్నారు. ఐదేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గుడిసెలు వేసుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి కూల్చి వేయడమేమిటని ప్రశ్నించారు. కమ్యూనిస్టులు ఎప్పుడూ ప్రజల పక్షమే ఉంటారని, కాంగ్రెస్ మిత్రుత్వం కొనసాగాలంటే పేదల సమస్యలు పరిష్కరించాల్సిందేనని స్పష్టం చేశారు. కమ్యూనిస్టులు పోరాటం చేస్తే మేం అమలు చేస్తున్నామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల తరుపున తాము చేస్తున్న పోరాటంలో పట్టాలు ఇచ్చి మాట నిలబెట్టుకోవాలని సూచించారు. గుండ్ల సింగారంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలందరికీ పట్టాలు ఇచ్చి తమది ప్రజాపాలనగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరూపించుకోవాలని అన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ దశాబ్దాలుగా పేదలకు భూములు, గృహ వసతి కోసం కమ్యూనిస్టులే నిరంతరం పోరాడుతున్నారని గుర్తుచేశారు. నిరుపేదలు ఎంతో ఆశతో కాంగ్రెస్‌కు ఓట్లేసి గెలిపిస్తే, నేడు వారి ఇండ్లను కూల్చి రోడ్డున పడేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు. నిరుపేదలు నిర్మించుకున్న ఇండ్ల కూల్చివేతలను ప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలని అన్నారు.హనుమకొండ గుండ్ల సింగారంలో సర్వే నెంబర్లు 174,175లలో నేడు చెరువు శిఖం భూమి లేనే లేదని, గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పేదలకు 1360 మందికి ఇంటి స్థలాలు ఇచ్చారని అన్నారు. గత ఐదేళ్ళుగా అక్కడ పేదలు సిపిఐ ఆధ్వర్యంలో భూ పోరాటం నిర్వహించి గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని అన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ పేదలకు గూడు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, దానిని నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.గుండ్ల సింగారంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇండ్ల స్థలాలు కేటాయించి, పట్టాలు ఇవ్వాలనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని, శాసన సభలో సైతం ఒత్తిడి తెస్తామని అన్నారు.పేదల పోరాటం వృధా కాదని, పట్టాలు సాధించుకునేంత వరకూ ఐక్యంగా ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాషుమియా, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, నల్లు సుధాకర్ రెడ్డి, వలి ఉల్లా ఖాద్రీ, మండల కార్యదర్శి ఎన్ అశోక్ స్టాలిన్, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు వుట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, బత్తిని సదానందం, మునిగాల బిక్షపతి, బాషబోయిన సంతోష్, కొట్టేపాక రవి, జిల్లా నాయకులు రాజ్ కుమార్, మాలోత్ శంకర్ నాయక్, గుంటీ రాజేందర్, అలువాల రాజు, పూజారి అమృతయ్య, కోడెపాక బాబు, మామునూరి దామోదర్, పూజారి నరేందర్, కేతపాక ప్రసాద్, తాటికొండ ప్రశాంత్, మాలోత్ మంగ, నలువాల సంధ్య, తాటికంటి మమత, గుంటీ రజిత, గిన్నారపు రోహిత్, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో భూపోరాట కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత

**- 'నషా ముక్త్ భారత్ అభియాన్'కు శ్రీకారం చుట్టిన రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా**

**- డ్రగ్స్ వ్యతిరేక పోస్టర్ల ఆవిష్కరణ విద్యార్థులు, యువతతో ప్రతిజ్ఞ అవగాహన ర్యాలీ ప్రారంభం**



హనుమకొండ జిల్లా ప్రతినిధి జూలై 09 ( విజన్ ఆంధ్ర ) : మత్తు పదార్థాల నిర్మూలనను ప్రజా ఉద్యమంగా మార్చి, డ్రగ్స్ రహిత భారత్ డ్రగ్స్ రహిత తెలంగాణ సాధనకు ప్రతి పౌరుడు బాధ్యతగా కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ ఐడీఓసీ (కలెక్టరేట్)కు చేరుకున్న గవర్నర్‌కు ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "నషా ముక్త్ భారత్ అభియాన్ డ్రగ్స్ రహిత తెలంగాణ" కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల దుష్పరిణామాలను వివరిస్తూ రూపొందించిన అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యులు కావాలని చేపట్టిన సంతకాల సేకరణలో గవర్నర్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే లు సంతకాలు చేశారు. అనంతరం విద్యార్థులు, యువత, అధికారులు, ప్రజలతో కలిసి "నషా ముక్త్ భారత్" ప్రతిజ్ఞ చేయించి, డ్రగ్స్ నిర్మూలనకు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా ఈ సందర్భంగా తెలంగాణ ఎక్సైజ్, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, పోలీస్, జిల్లా మహికా శిశు దివ్యాంగుల సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నాషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ నుండి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వరకూ నిర్వహించిన ర్యాలీని రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా మత్తు పదార్థాల నిర్మూలన కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన "నషా ముక్త్ భారత్ అభియాన్" సామాజిక చైతన్య ఉద్యమంగా మారాలని అన్నారు. మత్తు రహిత సమాజ నిర్మాణం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి కుటుంబం, ప్రతి సమాజం, ప్రతి వ్యక్తి బాధ్యత అని స్పష్టం చేశారు."మా ఇంట్లో మత్తు పదార్థాలకు చోటు లేదు" అనే సంకల్పాన్ని ప్రతి కుటుంబం చేసుకుంటే సమాజం మొత్తం మత్తు రహితంగా మారుతుందని గవర్నర్ పేర్కొన్నారు. మార్పు ఎప్పుడూ మన నుంచే ప్రారంభం కావాలని, ప్రతి ఒక్కరూ ముందుగా తాము మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజాన్ని కూడా ఆ దిశగా నడిపించాలని సూచించారు.దేశ భవిష్యత్తు అయిన యువత అత్యధిక సంఖ్యలో ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చిన గవర్నర్, యువతను క్రీడల వైపు ప్రోత్సహించడం ద్వారా మత్తు వ్యసనాలకు దూరంగా ఉంచవచ్చని అన్నారు. "ఆటలు ఆడించండి... మత్తును పారదోలండి" అనే సందేశాన్ని ప్రతి ఇంటికీ చేరవేయాలని సూచించారు.

తాను గవర్నర్‌గా ఉన్న హిమాచల్ ప్రదేశ్‌లో "ఆటలు ఆడించండి మత్తును తరిమికొట్టండి హిమాచల్‌ను కాపాడండి" అనే నినాదంతో విజయవంతంగా ప్రజా చైతన్యం కల్పించామని గుర్తుచేసిన ఆయన, అదే స్ఫూర్తితో తెలంగాణలోనూ ప్రతి జిల్లాలో ఈ ఉద్యమాన్ని విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో చొరవ చూపుతున్న గౌరవ ముఖ్యమంత్రి నేను అభినందనలు తెలియజేస్తున్నాను. మన జిల్లా మత్తు రహిత జిల్లాగా, తెలంగాణ మత్తు రహిత రాష్ట్రంగా, భారత్ మత్తు రహిత దేశంగా అవతరించేందుకు ప్రతి ఒక్కరూ తమ శక్తి మేరకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. "నా దేశాన్ని మత్తు రహిత దేశంగా తీర్చిదిద్దేందుకు నా శక్తి మేరకు సాధ్యమైన ప్రతి ప్రయత్నం చేస్తాను" అనే ప్రతిజ్ఞతో ముందుకు సాగాలని గవర్నర్ కోరారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లి మాట్లాడుతూ, దేశాన్ని మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశయానికి అనుగుణంగా "నషా ముక్త్ భారత్ అభియాన్" దేశవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతోందని అన్నారు.అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని తెలిపారు.

డ్రగ్స్ నిర్మూలనలో కేవలం ప్రభుత్వ యంత్రాంగమే కాకుండా విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.వరంగల్‌లో నిర్వహించిన "నషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా విచ్చేసి యువతకు స్ఫూర్తిదాయక సందేశం ఇవ్వడం ఆనందదాయకమని పేర్కొన్నారు. గవర్నర్ సందేశం మత్తు పదార్థాల నిర్మూలన ఉద్యమానికి మరింత బలాన్ని చేకూరుస్తుందని, తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి గవర్నర్ నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయించి, మత్తు రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం దాన కిషోర్, వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత, హనుమకొండ వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, జిడబ్లుఎంసి కమిషనర్ వెంకన్న, ప్రజాప్రతినిధులు, అదనపు కలెక్టర్లు రవి, సంధ్యారాణి, వై వి గణేష్, డిసిపి ధార కవిత, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు రాష్ట్ర గవర్నర్ ప్రశంసలు

**- స్టాళ్లను సందర్శించి ఉత్పత్తులను కొనుగోలు చేసిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా**



హనుమకొండ జిల్లా ప్రతినిధి జూలై 09 ( విజన్ ఆంధ్ర ) : హనుమకొండ కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన స్టాళ్లను రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గురువారం సందర్శించి, మహిళల కృషిని అభినందించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ( ఎస్ ఇ ఆర్ పి ), పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా ), వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లలో ప్రదర్శించిన వివిధ ఉత్పత్తులను గవర్నర్ ఆసక్తిగా పరిశీలించారు. మహిళలు స్వయంగా తయారు చేసిన ప్రతి ఉత్పత్తి గురించి అడిగి తెలుసుకుంటూ, వాటి తయారీ విధానం, నాణ్యత, మార్కెటింగ్ అవకాశాలపై వారితో ముచ్చటించారు. ఈ సందర్భంగా మిల్లెట్లతో (చిరుధాన్యాలు) తయారు చేసిన ఆహార ఉత్పత్తులు, చేతితో నేసిన వస్త్రాలు, స్వచ్ఛమైన నెయ్యి, వంట నూనెలు, ఇతర విలువ ఆధారిత ఆహార ఉత్పత్తులను పరిశీలించి ప్రశంసించారు. మహిళల శ్రమకు ప్రోత్సాహంగా పలు ఉత్పత్తులను స్వయంగా కొనుగోలు చేశారు. అలాగే ప్రసిద్ధ వరంగల్ దరీ స్టాల్‌ను సందర్శించి, దరీల ప్రత్యేకత, తయారీ ప్రక్రియ, వాటి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ అవకాశాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. దరీ ఉత్పత్తుల నాణ్యతను కొనియాడుతూ వాటిని కూడా కొనుగోలు చేసి మహిళా కళాకారులను ప్రోత్సహించారు.స్వయం సహాయక సంఘాల ద్వారా తయారవుతున్న నాణ్యమైన ఉత్పత్తులకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందని, ఇలాంటి ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించడం ద్వారా మహిళలు ఆర్థికంగా మరింత బలోపేతం అవుతారని గవర్నర్ అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, గవర్నర్ కార్యదర్శి దాన కిషోర్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, సిపి శ్వేతా,,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలి

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 9,(విజన్ ఆంధ్ర ) : ప్రభుత్వ పాఠశాలలను విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని జిల్లా కలెక్టర్ కెహరిత అన్నారు. గురువారం జిల్లాలోని కెరమెరి మండలం పెద్దపట్నాపూర్ లో గల గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల హాజరు పట్టిక, వంటగది, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు అవసరమైన సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో డ్రాప్ అవుట్ విద్యార్థులను గుర్తించి సోమవారంలోగా పాఠశాలలో ఉండేలా ఉపాధ్యాయులకు కృషి చేయాలని, ప్రతి విద్యార్థి ఆపార్ కార్డు కలిగి ఉండేలా చూడాలని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీరు అందించాలని తెలిపారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: ఎమ్మెల్యే



భూపాలపల్లి జిల్లా : 9 జులై ( విజన్ ఆంధ్ర ) భూపాలపల్లి మండలంలో అటవీ గ్రామాల అభివృద్ధి కోసం రూ.48 లక్షల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఈరోజు గురువారం భూపాలపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సుమారు రూ.48 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. పంబపూర్‌లో రూ.9 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనం, గొల్లబుద్ధారంలో రూ.9 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను, శ్యామ్‌నగర్‌లో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, మొరంచపల్లి గ్రామంలో లో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభోత్సవం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో రవాణా సౌకర్యాల మెరుగుదలతో పాటు రైతులు తమ పొలాలకు సులభంగా చేరుకునేలా నాణ్యమైన రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామాల అభివృద్ధి, పరిశుభ్రతే రాష్ట్ర అభివృద్ధికి పునాదులని పేర్కొంటూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పారదర్శకంగా, నాణ్యతతో అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, సంబంధిత శాఖల అధికారులు, జిల్లా అధికారులు గ్రామస్థులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ



భూపాలపల్లి జిల్లా :9 జులై ( విజన్ ఆంధ్ర ) : భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీ జే. జీవన్ కుమార్ గారిని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయవ్యవస్థ, పోలీసు శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు వేగవంతమైన, సమర్థవంతమైన న్యాయ, భద్రతా సేవలు అందించేందుకు పరస్పర సహకారంతో పనిచేయాలని ఆకాంక్షించారు.

## నగరంలో ఆయుర్వేద చికిత్సకు పెరుగుతున్న ఆదరణ



హైదరాబాద్, జూలై 09 (విజన్ ఆంధ్ర) : నగరంలో ఆసుపత్రి ఆధారిత సమగ్ర ఆయుర్వేద చికిత్సకు ప్రాధాన్యం పెరుగుతోందని, కేపీహెచ్ బీలోని ఎన్ఎబిహెచ్ గుర్తింపు పొందిన సాయి ఆయుష్ ఆయుర్వేద ఆసుపత్రి ఆయుర్వేదం, పంచకర్మ, ప్రకృతి వైద్యం, ఫిజియోథెరపీ సేవలను ఒకే చోట అందిస్తోందని ఆసుపత్రి వ్యవస్థాపకురాలు డా.సునీత ముంద్రా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీర్ఘకాలిక నడుము, మెడ నొప్పి, కీళ్లవాపు, సయాటికా, వెన్నెముక, క్రీడా గాయాలు, పక్షవాతం, పార్కిన్సన్స్ తదితర సమస్యలకు చికిత్సతో పాటు మదీనాగూడలో ఔట్‌పేషెంట్ పంచకర్మ కేంద్రం కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనోరెక్టల్ విభాగంలో మొలలు, ఫిస్టులా, ఫిషర్‌లకు డా.అక్షయ్, డా.హరీష్, డా.రేవతి సేవలందిస్తుండగా, మహిళల ఆరోగ్య విభాగానికి డా.వాగ్దేవి నేతృత్వం వహిస్తున్నారని తెలిపారు. జూలై నెల పొడవునా ఉచిత మహిళా ఆరోగ్య సంప్రదింపులు, ప్రతి గురువారం వయోవృద్ధులకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

## రైతు ఆశీర్వాద సభకు రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలి.

**- మండల పరిషత్ అభివృద్ధి అధికారి తాళ్లూరి రవి.**



జూలూరుపాడు జూలై 10 (విజన్ ఆంధ్ర ) జూలై 10 న వైరా నియోజకవర్గం చింతకాని మండలం జగహన్నాధపురం లో నిర్వహించనున్న రైతు ఆశీర్వాద సభ విజయవంతం చేయడానికి గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి తాళ్లూరి రవి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించన . ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామం నుంచి రైతులు రైతు ఆశ్వీర్యాద సభ కు సౌకర్యవంతంగా సభకు చేరుకునేందుకు ఒక్కో గ్రామానికి ఒక బస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని రైతులు, ప్రజలు అందరూ పెద్ద సంఖ్యలో రైతు ఆశీర్వాద సభకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశం లో తహసీల్దార్ శ్రీనివాసు, వ్యవసాయ శాఖ అధికారి, ఐకేపీ ఏపీఎం రామకృష్ణ , సీసీలు మధు , రామారావు , నాగేశ్వరరావు తదితర అధికారులు పాల్గొన్నారు. రైతు సంక్షేమం కోసం నిర్వహిస్తున్న ఈ రైతు ఆశీర్వాద సభకు మండలంలోని రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# కొత్తగూడెంలో టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు

**- నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌లోకి వెళ్లను**

**- సింగరేణి, కాళేశ్వరం, రైతులు, బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు**



కొత్తగూడెం బ్యూరో జూలై 10(విజన్ ఆంధ్ర) : తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గురువారం కొత్తగూడెంలో నిర్వహించిన పార్టీ రెండో విడత "బాయిబాట" కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలు రాజకీయ, ప్రజా సమస్యలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తాను తిరిగి బీఆర్ఎస్‌లో చేరే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. "నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌లోకి వెళ్లను. నేను తిరిగి ఆ పార్టీలోకి వెళ్తానంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవం" అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఖాతాలో ఉన్న రూ.1,400 కోట్ల నిధులు అవినీతి ద్వారా సమకూరినవేనని ఆరోపిస్తూ, ఆ మొత్తాన్ని తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. తమ పార్టీపై భయం లేదని చెబుతూనే, ఎన్నికల సంఘానికి వెయ్యికి పైగా ఫిర్యాదులు చేశారని ఆరోపించారు. టీఆర్ఎస్ పేరును రాకుండా అడ్డుకునేందుకు కుట్రలు జరుగుతున్నాయని కూడా విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై విమర్శలు గుప్పించిన కవిత, ప్రజా సమస్యలపై తాము చేస్తున్న పోరాటాలను అడ్డుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్‌లో నీతి, నియమాలు కనిపించడం లేదని, సోషల్ మీడియాలో అసభ్యకర వ్యాఖ్యలు చేస్తున్న వారిపై తీవ్రంగా స్పందించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై మాట్లాడుతూ, ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరగాలని కోరారు. సాంకేతికంగా నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ, రాజకీయ కారణాలతో రైతులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. రైతు భరోసా, యూరియా పంపిణీ, బోనస్ చెల్లింపుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను పూర్తిగా అమలు చేయడం లేదని విమర్శించారు.సింగరేణి అంశంపై మాట్లాడుతూ, సంస్థకు రావాల్సిన నిధులు విడుదల కాకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. తాడిచర్ల2 గనిని పూర్తిగా సింగరేణికే అప్పగించాలని, మిగిలిన 16 బొగ్గు గనులను కూడా టెండర్లు లేకుండా సింగరేణికి కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగాల భర్తీ కోసం క్రమం తప్పకుండా మెడికల్ బోర్డులు నిర్వహించాలని, లేకపోతే నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు. కార్మికుల భద్రత, అలియాస్ పేర్ల సమస్య, స్థానికులకు ఉద్యోగాల కల్పన, లేబర్ చట్టాల అమలు వంటి అంశాలపై కూడా ఆమె ప్రభుత్వాలను ప్రశ్నించారు. సింగరేణి కార్మికుల హక్కుల కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# జాతీయ పునర్నిర్మాణం ఏబీవీపీ లక్ష్యం

**- ABVP స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ సావుల ఆదిత్య**





దుబ్బాక విజన్ ఆంధ్ర రిపోర్టర్ : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దుబ్బాక నగర శాఖ ఆధ్వర్యంలో జూలై 9 జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా నగరంలో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించటం. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎబివిపి స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ సావుల ఆదిత్య మాట్లాడుతూ దేశ నిర్మాణంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకుందని 5 మంది విద్యార్థులతో ప్రారంభమై కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అటాక్ నుంచి కటక్ వరకు 78 లక్షల విద్యార్థుల సభ్యత్వం తో ప్రపంచములోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా నిలిచిందని ఎబివిపి నినాదాలు నేడు దేశానికి విధానాలుగా మారాయిఅని, కాశ్మీర్ ఆర్టికల్ 360 రద్దు కై నినదించి ఉద్యమించి విజయం సాధించిన ఘనత ఎబివిపి దని, అక్రమ వలసదారుల ఏరివేతకు సేవ్ అస్సాం టుడే సేవ్ ఇండియా టుమారో అని అక్రమ వలసదారుల వల్ల ఏర్పడే జాతీయ భద్రత విషయంలో ఎబివిపి చేసిన ఉద్యమాలు నేడు ఈశాన్య రాష్ట్రాలు భారత్ తో బలంగా నిలుచుటకు ఆధారం అయిందని, తెలంగాణ, బెంగాల్, కేరళ మరియు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో వామపక్ష విదేశీ కుట్రలను, నరహంతక నక్సలైట్ల తూటాలకు ఎదురించి, జాతీయ వాదాన్ని పెంపొందించటానికి భారత్ మాతాకి జై అంటూ అనేక మంది ఎబివిపి కార్యకర్తలు ప్రాణత్యాగాలు సైతం చేశారని, అటువంటి మహా వీరులు పుట్టిన గడ్డ తెలంగాణ. జాతీయ వాదాన్ని దేశభక్తిని విద్యార్థులను తెలియచేయడంలో ఎబివిపి కార్యకర్తలు నిరంతరం పనిచేస్తూ వస్తున్నారు. నేడు దుబ్బాక లో ఇక్కడ కాగడా జండా పట్టుకొని భారత్ మాతాకి జై అని నినదిస్తున్న ఈ వేలాదిగా విచ్చేసిన విద్యార్థుల సంఖ్య వారి ఉచ్చాహం సాక్ష్యం అని వామపక్ష వాదుల వ్యక్తి నిర్మూల సిద్ధతం నేడు భారత పటంలో శాశ్వతంగా నిర్మూలింపబడిందని, జాతీయవాద వ్యక్తి నిర్మాణ సిద్ధాంతం పల్లె పల్లెలో ప్రతి ఇంటిలో విస్తరించిందని అన్నారు, భారత దేశంను ప్రపంచంలోనే విశ్వ గురువుగా నిలుపుటకు ఎబివిపి 78 సంవత్సరాలుగా చేస్తున్న ఈ ప్రయాణంలో ప్రతి విద్యార్థి భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి శేర్ల జశ్వంత్ నగర ఉప అదెక్షులు కుమార్,పవన్ నగర కార్యవర్గ సభ్యులు అఖిల్,భరత్ విద్యార్థులు పూర్వ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బదిలీ పై వెళ్తున్న రాజంపేట ఎఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డేకు ఆత్మీయ వీడ్కోలు పలికిన కర్నూలు రేంజ్ డీఐజీ

**- కోయ ప్రవీణ్, కడప జిల్లా ఎస్పి సెల్కే నచ్చికేతే విశ్వనాథ్, అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి**




కడప, జూలై 9 (విజన్ ఆంధ్ర) జిల్లాలోని రాజంపేట సబ్ డివిజనల్ ఏఎస్పీగా విధులు నిర్వహిస్తూ పదోన్నతి పై అమరావతి ఓ ఎస్ డి (లా అండ్ ఆర్డర్) గా బదిలీపై వెళుతున్న శ్రీ మనోజ్ రామనాథ్ హెగ్డే కు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయం పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం రాత్రి ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు ఈ ముఖ్య అతిథులుగా కర్నూలు రేంజ్ డీఐజీ శ్రీ కోయ ప్రవీణ్, కడప జిల్లాఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, అన్నమయ్య జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి పాల్గొని ఘనంగా పూల మాల, శాలువ తో సన్మానించి, జ్ఞాపిక అందచేసి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా డీఐజీ శ్రీ డా. కోయ ప్రవీణ్ మాట్లాడుతూ మనోజ్ రామనాథ్ హెగ్డే మృదు స్వభావి, నేర్చుకోవాలనే తపన ఉన్న పోలీస్ అధికారి అని, పోలీస్ శాఖలో అందరి మనసులను గెలుచుకున్న అధికారిగా నిలిచారని అభినందించారు. కడప జిల్లా ఎస్.పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మాట్లాడుతూ గత ఆరు నెలల కాలంగా మనోజ్ రామనాథ్ హెగ్డే తో కలిసి పనిచేస్తున్నానని, అన్ని విషయాలపై లోతుగా అవగాహన కలిగిన పోలీస్ ఉన్నతాధికారి అని పేర్కొన్నారు. ఛాలెంజింగ్ సబ్ డివిజన్ లో విజయవంతంగా విధులు నిర్వర్తించారని, ఎర్ర చందనం స్మగ్లింగ్ ను నిరోధించేందుకు స్వయంగా అడవిలోకి వెళ్లి స్మగ్లింగ్ కేసులను ఛేదించాడన్నారు. మానవతాదృక్పథంతో విధులు నిర్వర్తించిన పోలీస్ అధికారిగా మనోజ్ రామనాథ్ హెగ్డే నిలిచారన్నారు. మత్స్య కారులను నిర్బంధించి పని చేయించుకుంటున్న వారి నుండి విముక్తి కల్పించి ప్రజల మనసులో చిరస్థాయిగా ఉండిపోయాడన్నారు. ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రణాళికా బద్ధంగా విధులు నిర్వర్తించారన్నారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ ప్రజలతో స్నేహపూర్వకంగా మెలిగే అధికారిగా మన్ననలు పొందారన్నారు. సబ్ డివిజన్ లో నేరాల శాతం గణనీయంగా తగ్గిందన్నారు. నిక్కచ్చిగా వ్యవహరిస్తూ విధులు నిర్వర్తించారన్నారు. పదోన్నతిపై వెళుతున్న రాజంపేట ఎ.ఎస్పీ శ్రీ మనోజ్ రామనాథ్ హెగ్డే మాట్లాడుతూ తనకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించడం, నాకు చాలా సంతోషంగా ఉందని వీడ్కోలు కార్యక్రమం నిర్వహించడం ఎంతో ఉత్సాహంగా ఉందన్నారు. తనపై బాధ్యతను మరింతగా పెంచిందన్నారు. తన విధి నిర్వహణ కాలంలో ముగ్గురు జిల్లా ఎస్.పీ ల వద్ద పనిచేయడం మంచి అనుభవమని పేర్కొన్నారు. తన తో పాటు ఉన్న హోమ్ గార్డు నుండి పోలీస్ అధికారుల వరకూ సమష్టిగా కృషి చేయడం వల్లనే తాను విజయవంతంగా విధులు నిర్వహించగలిగానని రామనాథ్ హెగ్డే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ.ఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీ బి రమణయ్య, ప్రొద్దుటూరు ఎ.ఎస్పీ విబు కృష్ణ, జిల్లా లోని డీఎస్పీలు, సిఐ లు, ఆర్ ఐ లు, ఎస్సైలు పాల్గొన్నారు.

# కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీ ప్రతి బిడ్డ కష్టానికి ఫలితాన్ని అందిస్తుంది

**- జిల్లా ఎస్గ సీ సెల్ అధ్యక్షులు గద్దల రమేష్**

**- ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడుగా మందా బాబు.**

**- జిల్లా సెల్ అధ్యక్షులు గద్దల రమేష్ కు కృతజ్ఞతలు తీయజేసిన మందా బాబు.**



జూలూరుపాడు జులై 10 (విజన్ ఆంధ్ర ) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గా కాంగ్రెస్ పార్టీ కీ అనేక సేవలు అందించిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మందా బాబు ను నియమించారు . భద్రాద్రి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు గద్దల రమేష్ గురువారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్బంగా మంద బాబు మాట్లాడుతూ. కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేశానని పార్టీ అధికారంలో లేనప్పుడు పార్టీని అంటిపెట్టుకొని బి.ఆర్.యస్ నాయకులతో పోరాడి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కాపాడుకుంటూ వచ్చానని. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల పట్ల కన్నతల్లి లా వ్యవహరిస్తుంది ప్రతి బిడ్డ కష్టాన్ని చూసి సమాన ప్రతిఫలాన్ని ఇస్తుంది అని అన్నారు.బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో వున్నప్పుడు నా మీద ఎన్నో కేసులు పెట్టింన నేను దేనికి అదర లేదు బెదరా లేదని. కన్న తల్లి లాంటి కాంగ్రెస్ పార్టీ నీ నమ్ముకొని ముందుకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ ప్రతి ఒక్క కార్యక్రమములో పాల్గొని పార్టీ బలోపేతానికి నావంతు కృషి చేసి సభ్యత్వ నమోదు కార్యక్రమములో పాల్గొని వేల సభ్యత్వాలు నమోదు చేయించాను, అనేక బందులు, రాస్తా రోకోలో పాల్గొన్నానని. కాంగ్రెస్ పార్టీ అంటే నాకు అభిమానం అంటూ నేను పడ్డ కష్టానికి నా మీద నమ్మకంతో ఎస్సీ సెల్ మండల అధ్యక్ష పదవి నాకు ఇచ్చినందుకు ఈ బాధ్యతను సక్రమముగా నిర్వర్తించి మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని నామీద నమ్మకంతో ఈ బాధ్యతను ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా డి సీ సీ కమిటీ వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ జూలూరుపాడు మండల నాయకత్వనికి నాకు పదవి రావడానికి పరోక్షంగా ప్రత్యేక్షంగా కారణమైన కాంగ్రెస్ పార్టీ నాయకులకు ముఖ్యనంగా , ఎస్సీ సెల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ గద్దల రమేష్ కి నా ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

## చెంగిచెర్లలో ఘనంగా విలేజ్ టీ స్టాల్ ప్రారంభం

**- ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన కొత్త కిషోర్ గౌడ్...**



బోడుప్పల్,జూలై 09(విజన్ ఆంధ్ర) : మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని చెంగిచెర్లలో నూతనంగా ఏర్పాటు చేసిన విలేజ్ టీ స్టాల్ ప్రారంభోత్సవం గురువారం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ హాజరై స్టాల్‌ను ప్రారంభించారు.ఈ సంధర్భంగా యజమాని బానోతు నరేందర్ నాయక్ తో పాటు ఆయన కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు కొత్త కిషోర్ గౌడ్ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన,రుచికరమైన, ఆరోగ్యకరమైన టీ అందిస్తూ వ్యాపారంలో విశేష విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. స్థానిక యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ నాయకులు, ప్రజాప్రతినిధులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వేగంగా నాణ్యతతో పనులు పూర్తి చేయాలి

**- నల్లచెరువు కట్ట అభివృద్ధి పనులను ప్రారంభించిన చైర్పర్సన్ మొరిశెట్టి నివేదిత**



సూర్యాపేట, జూలై 9 : (విజన్ ఆంధ్ర) : నల్ల చెరువు కట్ట అభివృద్ధి పనులను ప్రజలకు ఇబ్బంది కలుగకుండా నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సూర్యాపేట మున్సిపల్ చైర్పర్సన్ మొరిశెట్టి నివేదిత అన్నారు. అమ్రుత్ 2.0 పథకంలో బాగంగా రూ 3.14కోట్లతో 8, 9వార్డుల్లో చేపట్టిన నల్లచెరువు కట్ట అభివృద్ధి పనులను ఆమె గురువారం ప్రారంభించి మాట్లాడారు. నల్లచెరువు కట్ట అబివృద్ధిలో బాగంగా గ్రీనరీ, రేలింగ్ ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. పట్టణ ప్రజల సమస్యలు పరిష్కరించడంతో పాటు వారికి ఆహ్లాదాన్ని అందించేందుకు మున్సిపల్ పాలకవర్గం విశేష కుషి చేస్తుందన్నారు. కాంట్రాక్టర్లు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అనుకున్న సమాయానికి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్ పోతురాజు ఇందుశ్రీ అనిల్, 9వ వార్డు కౌన్సిలర్ బండారు మంగమ్మ వెంకన్న, గంగ లింగారెడ్డి, సత్తిరెడ్డి, నాగేంద్రబాబు, కాంట్రాక్టర్లు సుజన్రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కమలాపురంలో రైళ్లు నిలుపుదల కోసం భారీ ర్యాలీ చేపట్టిన ప్రజలు




కమలాపురం, జూలై 9 (విజన్ ఆంధ్ర) నియోజకవర్గ కేంద్రమైన కమలాపురంలో ప్యాసింజర్ రైళ్లు నిలుపుదల కోసం నియోజకవర్గంలోని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తూ రైళ్ల నిలుపుదల సాధన కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం పట్టణంలోనీ స్థానిక నగర పంచాయతీ కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు ఈ ర్యాలీలో ప్రజలు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ సేవా సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు ఈ సందర్భంగా రైళ్ల నిలుపుదల సాధన సమితి నాయకులు మాట్లాడుతూ కమలాపురం రైల్వే స్టేషన్ లో రైలు నిలుపుదల లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు, సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు కమలాపురం పట్టణంలో రైళ్లు నిలుపుదల కల్పిస్తే పరిసర ప్రాంతాల ప్రజలకు ప్రయాణ సౌకర్యం ఎంతో మెరుగుపడుతుందని వారన్నారు అనంతరం రైల్వే స్టేషన్ కు చేరుకుని రైల్వే సిబ్బందికి పట్టణంలో రైళ్లు ఆపాలని వినతిపత్రం అందజేశారు వెంటనే రైల్వే శాఖ అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి ఈ యొక్క సమస్యను వెంటనే పరిష్కరించాలని వారిని కోరారు అదేవిధంగా తమ డిమాండ్ నెరవేరేవరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని వారు హెచ్చరించారు

## దేశంలోనే అగ్రగామి విద్యార్థి సంఘంగా ఏబివిపి

**- రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యురాలు మామిడి అక్షిత**

**- ఘనంగా ఎబివిపి 78 వ ఆవిర్భావదినోత్సవం**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 09,(విజన్ ఆంధ్ర ) : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 78 వ ఆవిర్భావదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) మంచిర్యాల నగర శాఖ ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వర థియేటర్ నుండి కాలేజీ రోడ్ లో గల స్వామి వివేకానంద విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం ఏబీవీపీ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈసందర్భంగా ఎబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ మామిడి అక్షిత మాట్లాడుతూ అఖిల భారత విద్యార్థి పరిషత్ 1949 జూలై 9న ప్రారంభించడం జరిగిందని, ఏబీవీపీ దేశంలోనే అగ్రగామి విద్యార్థి సంఘం గా ఉందన్నారు. అనేక విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎబివిపి నిరంతరం పోరాడుతుందని, తెలంగాణ రాష్ట్రంలో విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ఎనలేని పోరాటాలు చేసి, సమస్యలను పరిష్కరించిన ఘనత ఏబీవీపీ కే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా వ్యవస్థ ప్రముఖ్ చెట్టి శ్రీనివాస్, నగర సంఘటన కార్యదర్శి మహేష్, చరణ్, ఈశ్వర్, చరణ్ తేజ, వరుణ్ సందేశ్, తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# జీహెచ్ఎంసీ బోర్డుతోనే చక్కర్లు కొడుతున్న బోడుప్పల్ డీసీ..!

**- ప్రభుత్వ ఉత్తర్వులు ప్రజలకేనా... అధికారులకు కావా..?**




బోడుప్పల్, జూలై 9 (విజన్ ఆంధ్ర): ప్రభుత్వ నిర్ణయాలను ప్రజలు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ శాఖలు తప్పనిసరిగా అమలు చేయాలని చెప్పే అధికారులు, అదే నిబంధనలను తమ విషయంలో ఎంతవరకు పాటిస్తున్నారనే ప్రశ్న బోడుప్పల్‌లో తలెత్తుతోంది. దీనికి నిదర్శనంగా బోడుప్పల్ డిప్యూటీ కమిషనర్ అధికారిక వాహనంలో ఇప్పటికీ "డిప్యూటి కమిషనర్ బోడుప్పల్ సర్కిల్-జిహెచ్ఎంసీ" అని ఉన్న నేమ్‌బోర్డు కనిపించడం చర్చనీయాంశమైంది. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పడి దాదాపు ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ, డిప్యూటీ కమిషనర్ ఏ. శైలజ వినియోగిస్తున్న అధికారిక వాహనంలో మాత్రం ఇంకా జీహెచ్ఎంసీ పేరే కొనసాగుతుండటం అధికార యంత్రాంగం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రభుత్వం కొత్త కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన తర్వాత అన్ని అధికారిక రికార్డులు, నేమ్‌బోర్డులు, గుర్తింపులు, వాహనాలపై ఉన్న వివరాలు కూడా తాజా పరిపాలనా వ్యవస్థకు అనుగుణంగా మార్చాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదే. కానీ అత్యున్నత స్థానిక పరిపాలనా అధికారి వాహనంపైనే పాత జీహెచ్ఎంసీ గుర్తింపు కొనసాగుతుండటం నిర్లక్ష్యానికి నిదర్శనమనే విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణ ప్రజలు చిన్న పొరపాటు చేసినా నోటీసులు, జరిమానాలు, చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారులు, తమ అధికారిక వాహనంపై ఉన్న స్పష్టమైన లోపాన్ని ఎందుకు సరిదిద్దలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు ప్రజలకు మాత్రమేనా? అధికారులకు వర్తించవా? అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, అధికారిక వాహనంపై ఉన్న జీహెచ్ఎంసీ నేమ్‌బోర్డును తొలగించి, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పేరుతో కొత్త నేమ్‌బోర్డును ఏర్పాటు చేస్తారా? లేక ఇదే నిర్లక్ష్యం కొనసాగుతుందా? అనేది వేచి చూడాల్సి ఉంది.

# సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలి..

## - విద్యార్థులకు షీ టీమ్ సూచన

**- శ్రీ చైతన్య హైస్కూల్‌లో సైబర్ భద్రత, మహిళల రక్షణపై అవగాహన**




కొత్తగూడెం బ్యూరో జూలై 10(విజన్ ఆంధ్ర) : నేటి కాలంలో విద్యార్థులు సెల్‌ఫోన్‌కు అధికంగా అలవాటు పడటం వల్ల చదువుకు, ఆటలకు దూరమవుతున్నారని, సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడం వల్ల సైబర్ నేరాల బారిన పడే ప్రమాదం ఉందని షీ టీమ్ ఎస్ఐ లక్ష్మణ్ పేర్కొన్నారు. ఈ మేరకు శ్రీ చైతన్య హైస్కూల్‌లో షీ టీమ్ ఆధ్వర్యంలో సెల్‌ఫోన్ అధిక వినియోగం వల్ల కలిగే నష్టాలు, డయల్-112 అత్యవసర సేవలు, ౧-ఘుటవ యాప్, మహిళలు, బాలికలపై జరిగే నేరాలు మరియు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించి చదువు, క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా అమ్మాయిలు సమాజంలో జరిగే నేరాలపై అవగాహనతో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే పోలీసులను సంప్రదించాలని చెప్పారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఒక స్పష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని దాని సాధన కోసం కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. డయల్-112 ద్వారా పోలీస్, ఫైర్, అంబులెన్స్, మహిళలు మరియు చిన్నారులకు సంబంధించిన అత్యవసర సేవలను ఒకే నంబర్ ద్వారా పొందవచ్చని వివరించారు. అలాగే ౧-ఘుటవ యాప్ ద్వారా ప్రయాణాన్ని సురక్షితంగా ఉంచుకోవచ్చని, యాప్ ద్వారా పోలీసు శాఖ ప్రయాణాన్ని పర్యవేక్షించి అవసరమైన సమయంలో వెంటనే స్పందించే అవకాశం ఉంటుందని తెలిపారు. అమ్మాయిలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా భయపడకుండా షీ టీమ్‌ను 8712682131 నంబర్‌లో సంప్రదించాలని, ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరన్న, ఉపాధ్యాయులు, షీ టీమ్ ఏఎస్ఐ నాగయ్య, కానిస్టేబుల్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# స్మశాన వాటిక మట్టిని రాత్రి వేళలో ట్రాక్టర్లతో తరలించి అమ్ముకున్న వార్డ్ కౌన్సిలర్

**- మాజీ వార్డ్ కౌన్సిలర్ బానోత్ హరి సింగ్ నాయక్ ఆరోపణ**





మహబూబాబాద్ జూలై 10(విజన్ ఆంధ్ర) : మున్సిపాలిటీ పరిధిలోని తొమ్మిదవ వార్డు శనిగాపురం స్మశాన వాటిక నిర్మాణ విషయంలో మాజీ వార్డ్ కౌన్సిలర్ హరి సింగ్ నాయక్ మాట్లాడుతూ నేను వార్డ్ కౌన్సిలర్ గా ఉన్నప్పుడు ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాల నుండి మట్టి తెచ్చి చెరువు ప్రాంతంలో ఉన్న బొందలు పూడ్చడం జరిగింది. అట్టి చుట్టుపక్కల ప్రాంతంలో ఉన్న మట్టి ఇప్పటి వార్డు కౌన్సిలర్ కందుకూరి సుధా మోహన్ 8వ తారీఖు రాత్రివేళ సమయంలో సుమారు 10 గంటలకు ఎవరికి తెలియని సమయంలో మట్టిని జెసిపి ద్వారా తోడి ట్రాక్టర్ తో ఇతరప్రాంతాలకు తరలించి అమ్ముకున్నాడని ఆరోపించారు. మట్టి తరలించిన విషయంలో ఎమ్మార్వోకు వినతిపత్రం సమర్పించామని అన్నారు. ఇట్టి విషయంలో ఎమ్మార్వోని వివరణ అడగగా వారు మాట్లాడుతూ సిబ్బందితో దర్యాప్తు చేయిస్తానని అన్నారు. హరి సింగ్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లో మున్సిపాలిటీలో కూడా దరఖాస్తులు ఇచ్చామని అన్నారు. దొంగతనంగా శనిగాపురం 9వ వార్డు స్మశాన వాటికలో నుండి జెసిబి మరియు ట్రాక్టర్ల సహాయంతో 9వ వార్డు కౌన్సిలర్ కందుకూరి సుధా మోహన్ మరియు మాజీ సర్పంచ్ గుగులోతు రాజు ఇద్దరు నిలబడి మట్టిని తీసుకొని అమ్ముకోవడం జరిగిందని హరి సింగ్ ఆరోపించారూ సంవత్సరాల నుండి కష్టపడి సాధించిన స్మశాన వాటిక లో మట్టి పొయ్యాలి గాని తీసుకుపోవడం సిగ్గుచేటు అని అన్నారు. మట్టిని తరలించిన వారిపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను జెసిబిని సీజ్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బొమ్మరాజు కుమారస్వామి బొమ్మ రాజ్ కుమార్ స్వామి 9వ వార్డుకు పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి చుక్క వెంకటేష్ రామ్ శెట్టి ఉప్పలయ్య చుక్క బాబయ్య ఆరే దయాకర్ ఉస్మాన్ సురేష్ అంజిబాబు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్న కొత్తగూడెం 3 టౌన్ పోలీసులు



కొత్తగూడెం బ్యూరో జూలై 10( విజన్ ఆంధ్ర) : ప్రజల్లో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం, ముఖ్యంగా యువత గంజాయి వంటి మత్తు పదార్థాల బారిన పడకుండా రక్షించడం లక్ష్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పి రోహిత్ రాజు ఆదేశాల మేరకు జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో విశ్వసనీయ సమాచారం మేరకు కొత్తగూడెం పట్టణంలోని మెదరబస్తీ ప్రాంతంలో కొత్తగూడెం 3 టౌన్ పోలీసులు బుధవారం సాయంత్రం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ వెల్లడించారు. గంజాయి వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికి, కుటుంబానికి మరియు సమాజానికి తీవ్ర హానికరమని వారికి అవగాహన కల్పించి, భవిష్యత్తులో ఇటువంటి చర్యలకు పాల్పడవద్దని కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం వారిని న్యాయస్థానంలో హాజరుపరిచి డీ-అడిక్షన్ సెంటర్‌కు పంపించనున్నారు. ఈ సందర్భంగా కొత్తగూడెం డిఎస్పి మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసు శాఖ పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని, గంజాయి కొనుగోలు, విక్రయం, రవాణా, నిల్వ, వినియోగం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రజలు మాదకద్రవ్యాలకు సంబంధించిన అనుమానాస్పద సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-112 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# విద్యతోనే ఏదైనా సాధ్యం..

**- ప్రభుత్వ విద్య బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంది..**

**- పటేల్ రమేష్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్**



సూర్యాపేట టౌన్, జూలై 09:(విజన్ ఆంధ్ర) : విద్యతోనే ఏదైనా సాధ్యమని విద్యార్థులు కష్టపడి చదివి తామనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జెడ్పి బాలుర హైస్కూల్లో సూర్యాపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, 48 వ వార్డు కౌన్సిలర్ వెలుగు వెంకన్న ఆర్థిక సహకారంతో పాఠశాలకు ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు అందజేసే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలోని గురుకులాల్లో, వసతి గృహాల్లో నాణ్యమైన విద్యతోపాటు విద్యార్థులకు బలమైన పౌష్టికాహారాన్ని అందజేస్తుందన్నారు. రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని వివరించారు. విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకొని జిల్లాకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తేవాలన్నారు.ప్రపంచం అనేది ఒక గ్లోబల్ విలేజ్ గా మారిందని అవకాశాలను ఉపయోగించుకొని అద్భుతాలు సృష్టించాలన్నారు. ఇప్పటికే స్ప్రెడ్ ఇండియా సహకారంతో పాఠశాలల్లో విద్యార్థులకు కావలసిన అన్ని రకాల అవసరాలను తీర్చేలా సహకరిస్తున్నామని గుర్తు చేశారు. ప్రస్తుతం పాఠశాలకు అవసరమైన డిజిటల్ బోర్డులు, ఎలక్ట్రికల్ బెల్ తో పాటు అవసరమైన సహకారం తప్పకుండా అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, వల్లాస్ దేవేందర్, పిల్లల రమేష్ నాయుడు, తండు శ్రీనివాస్ గౌడ్, అరవింద్ రెడ్డి,కర్ణాకర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గోలి పద్మ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి..



సూర్యాపేట టౌన్, జూలై 09:(విజన్ ఆంధ్ర) : యువత ప్రభుత్వ ఉద్యోగాలు లక్ష్యం కాకుండా చుట్టూ ఉన్న అవకాశాలను అందించుకొని ఉన్నతంగా ఎదగాలని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని విద్యానగర్లో గణేష్ నాచురల్ చెక్క గానుగ నూనెల దుకాణాన్ని ప్రారంభించి మాట్లాడారు. సాంప్రదాయ పద్ధతిలో తయారుచేసిన చెక్క గానుగ నూనె ఆరోగ్యానికి ఎంతో మంచి జరుగుతుందని తెలిపారు. నేటి ఆధునిక యుగంలో ప్రతి ఆహారం కల్తీమయంగా మారిందని ఇలాంటి దుకాణాలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అన్నారు. స్వచ్ఛమైన నువ్వుల నూనె, వేరుశనగ నూనె,కొబ్బరి నూనె, పొద్దు తిరుగుడు నూనె వంటి నూనెలను తక్కువ ధరలకు ప్రజలకు అందించడం అభినందనీయం అన్నారు. నూనెలతో పాటు డ్రై ఫ్రూట్ సైతం డోర్ డెలివరీ చేయడం శుభ పరిణామం అన్నారు. కార్యక్రమంలో నిర్వాకులు గణేష్, దయాకర్,భిక్షం, రవిచంద్ర,మహేష్, వెంకటేశ్వర్లు, రాచకొండ శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.

# డిపో మేనేజర్ కు స్వాగతం పలికిన ఆర్టీసీ యూనియన్ నాయకులు

**- ఘనంగా సన్మానించిన ఉద్యోగులు, కార్మికులు**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 09,(విజన్ ఆంధ్ర ) టి జి ఎస్ ఆర్టీసీ మంచిర్యాల డిపోకు నూతనంగా విచ్చేసిన డిపో మేనేజర్ నరేష్ కుమార్ ని టీజీఎస్ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర , రీజినల్,డిపోస్థాయి కమిటీ సభ్యుల తరపున పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు డిపో మేనేజర్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కే. లక్ష్మయ్య, రీజనల్ కార్యదర్శి మామిడిపల్లి శ్రీనివాస్, డిపో ప్రెసిడెంట్ పోలు రాజేశం,డిపో సెక్రెటరీ గోలి శంకర్, గ్యారేజీ నాయకులు ఎల్ హెచ్ ఎండి.సాబీర్ పాష,మహిళా కండక్టర్లు ఉమారాణి,జ్యోతి,సుజాత తో పాటు ఇంకా ఎంప్లాయిస్ యూనియన్ అభిమాన ఆత్మీయ కార్మిక సోదరులు,తదితర గ్యారేజీ సిబ్బంది,డ్రైవర్లు,కండక్టర్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వంవెంటనే పిఅర్ సిని ప్రకటించాలి

**- పిఆర్ టియుటీఎస్ జిల్లా అధ్యక్షులుయాదగిరిజనార్దన్ రెడ్డి.**



నారాయణపేట, జూలై 9 ( విజన్ ఆంధ్ర) ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల పి.ఆర్.సిని ప్రకటించాలని నారాయణపేట పిఆర్టియు టిఎస్ జిల్లా అధ్యక్షులు యాదగిరి జనార్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఊట్కూర్ పి ఆర్ టి యు టీఎస్ మండల అధ్యక్షులు గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఊట్కూర్ మండలంలో పి ఆర్ టి యుసభ్యత్వం ముమ్మరంచేశారు. ఈ సందర్భంగా జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వము ఆర్థిక ప్రయోజనాలు కలిగించకుండా ఎన్ని మాటలు చెప్పినా వారి కుటుంబ అవసరాలు తీరవు కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పిఆర్సిని 51 శాతం ఫిట్మెంట్, తో మిగిలిన పెండింగ్ డీఏలను పిఆర్సి తో పాటు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు ఆరోగ్య కారులపై సందేహాలను వ్యక్తం చేయగా ట్రస్టు ద్వారా నాణ్యమైన వైద్య సదుపాయం అందుతాయని ఉపాధ్యాయులు ఎవరు హెల్త్ కార్డులపై అపోహాలు పెట్టుకోవద్దన్నారు. ప్రభుత్వం మేనిఫెస్టోలో కాంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీమును రద్దు చేస్తామని చెప్పి కాలయాపన చేయడం తగదనిఅన్నారు. ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమ బాట పట్టడానికి సంసిద్ధంగా ఉండాలని ఉపాధ్యాయులను కోరారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారిని మాధవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర ప్రధాన ఉపాధ్యాయురాలు కుసుమ మండల గౌరవ అధ్యక్షులు ఫజల్ జిల్లా బాధ్యులు భాస్కర్, వెంకటేష్ గౌడ్,ఆనంద్, సాయప్ప, మహేష్,రాములు, అబ్దుల్ సలాం, ఆంజనేయులు, గుర్నాథ్,పద్మావతి, నారాయణ, రామచంద్ర రెడ్డి ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషిచేయాలి

**- ఈనెల 12 న మంచిర్యాల కు ఎమ్మెల్సీ కోదండరామ్ రాక**

**- జే ఏ సి చైర్మన్ గోనె శ్యామ్ సుందర్ రావు**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 09,(విజన్ ఆంధ్ర ) : ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారి సంక్షేమం కోసం కృషి చేయాలని జిల్లా జేఏసీ చైర్మన్ గోనె శ్యాంసుందర్ రావు, కన్వీనర్ గురిజాల రవీందర్ రావు అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించడానికి వారి సంక్షేమం కొరకు పనిచేయడానికి సీనియర్ నాయకులు కేశవరావు నెత్రుత్వంలో ఏర్పాటు చేసిన కమిటీ పట్ల వారు ఆనందం వ్యక్త పరిచారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఉద్యమ కారులను విస్మరించిందని ఆరోపించారు. సుమారు 12 వందల మంది తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించ్చారని గుర్తు చేశారు. ఆనాడు ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన ఉద్యమ కారులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉద్యమ కారుల కమిటీలో సభ్యుడుగా ఉన్న ఎమ్మెల్సీ కోదండరాం ఈనెల 12 ఆదివారం రోజున మంచిర్యాలకు రానున్నారని తెలిపారు. కోదండరామ్ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగ ఉన్న సుచిత్ర హాల్ యందు ఉదయం 10 గంటలకు అప్పటి జిల్లా జేఏసీలో పనిచేసిన నాయకులతో మరియు జేఏసీలో బాధ్యతలు నిర్వహించిన వారితో సమీక్ష సమావేశం ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు.ఈ సమావేశంలో అప్పటి తెలంగాణ ఉద్యమం లో తూర్పు జిల్లా అయిన మంచిర్యాల మరియు ఆసిఫాబాద్ ప్రాంతాల నుండి జిల్లా జె ఏ సీ లో కీలకంగా బాధ్యతలు నిర్వహించిన మండల, జిల్లా కన్వీనర్లు, మరియు అనుబంధ సంఘాల జిల్లా నాయకులు పాల్గొనాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ బాబన్న, కోశాధికారి తొగరి సుధాకర్, కోకన్వీనర్ లు,టి. శ్రీనివాస్,ఖలీందర్ అలీ ఖాన్,పొడేటి సంజీవ్, అడ్డిచర్ల సాగర్, మల్లేష్ ,గజెల్లి వెంకటయ్య,లాల్ కుమార్, రామగిరి రాజన్న, కుమార స్వామి, లింగన్నపేట విజయ్ పాల్గొన్నవారు.

# 19నపేటలో జరిగేజనజాగరణ యాత్రనువిజయవంతంచేయండి




నారాయణపేట , జూలై 9 ( విజన్ ఆంధ) : నారాయణపేట జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ సంస్థ ప్రాంగణంలో జూలై 19న నారాయణపేట పట్టణంలో నిర్వహించనున్న సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల జనజాగరణ యాత్ర పోస్టర్‌ను వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు కలిసి గురువారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కృపాకర్ రెడ్డి మాట్లాడుతూ, 2004లో ప్రవేశపెట్టిన సీపీఎస్ విధానం వల్ల గత 22 సంవత్సరాలుగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని అన్నారు. పదవీ విరమణ అనంతరం సామాజిక భద్రత కల్పించడంలో సీపీఎస్ పూర్తిగా విఫలమైందని, ఉద్యోగులకు గౌరవప్రదమైన జీవన భరోసా కల్పించాలంటే పాత పెన్షన్ విధానం (ఒపీస్ )ను పునరుద్ధరించాల్సిందేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో జనజాగరణ యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ యాత్ర ముగింపు సందర్భంగా ఆగస్టు 23న "ఛలో హైదరాబాద్" కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.జూలై 19న నారాయణపేట నియోజకవర్గ కేంద్రంలో జరిగే జనజాగరణ యాత్రలో జిల్లాలోని సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు కృపాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మహదేవ్, రాష్ట్ర నాయకులు భాస్కర్ రెడ్డి,జిల్లా కోశాధికారి సత్యపాల్, అనంత రెడ్డి, శ్రీమతి.శ్రీలత, జనార్ధన్, ఖాజ పాష, రవి, రాహుల్, రఘు, అమరేశ్వర్ రావు, సంతోష్ కుమార్ , రాజ్ కుమార్, డా. షఫీక్ అహ్మద్ , డా. సి హెచ్,శంకర్, జైపాల్ రెడ్డి ,కోళ్ల శ్రీనివాసులు కమ్లా నాయక్ పాల్గొన్నారు.

# దుబ్బాక అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నాం

**- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి**




దుబ్బాక విజన్ ఆంధ్ర రిపోర్టర్ : ఆర్ ఎస్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొని నియోజకవర్గ అభివృద్ధి, పలు ప్రజా సమస్యలు, చేనేత సహకార సంఘం అంశాలపై మాట్లాడారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి దుబ్బాక నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో రోడ్లు, మున్సిపల్ అభివృద్ధి, విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం గౌరవ ముఖ్యమంత్రి గారిని కలిసి నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. దుబ్బాకకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి గారికి దుబ్బాక ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ పాఠశాల ద్వారా విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య అందేలా ప్రతి ఒక్కరి సహకారంతో ముందుకు సాగుతామని తెలిపారు. వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఇరిగేషన్ కాలువలు, తాగునీటి వనరులు, ఇతర అభివృద్ధి పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించినట్లు తెలిపారు. రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ వంటి ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, ఎక్కడైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రైతులను కోరారు. దుబ్బాక పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, మున్సిపల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి పరిశుభ్రతను మెరుగుపరిచేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే దుబ్బాక కేసీఆర్ స్కూల్‌లో డిగ్రీ కళాశాల తరలింపునకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గారు తెలిపారు. దుబ్బాక చేనేత సహకార సంఘం నూతన కార్యవర్గానికి అభినందనలు అనంతరం దుబ్బాక చేనేత సహకార సంఘం నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు అంకం మధు గారు మరియు సంఘ సభ్యులను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి , బక్కి వెంకటయ్య తో కలిసి తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

# సమాచార పౌర సంబంధాల శాఖ ఏడీగా బాధ్యతలు స్వీకరించిన రమేష్.

కడప,జులై 9 (విజన్ ఆంధ్ర) సమాచార పౌర సంబంధాల శాఖ వైఎస్ఆర్ కడప జిల్లా సహాయ సంచాలకులు (ఏ.డి.)గా ఏ.రమేష్ గురువారం బాధ్యతలను స్వీకరించారు.గతంలో ఒంగోలు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో డిపిఆర్వోగా భాద్యతలు నిర్వహించిన ఆయన.పదోన్నతి పొంది అదే శాఖలో కడప ఏడి గా అధికార బాధ్యతలను స్వీకరించారు.అనంతరం ఎడి రమేష్ మాట్లాడుతూ పదోన్నతిపై ఈ జిల్లాలో ఏ.డీ.గా బాధ్యతలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ వారి సలహాలు, సూచనలు పాటిస్తూ శాఖా పరంగా,జర్నలిస్టుల సంక్షేమానికి, ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని రకాల సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు,అధికార కార్యక్రమాలను మీడియా ద్వారా మరింత విస్తృతం చేస్తామన్నారు.కార్యాలయంలో ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సేవలో భాగస్వామ్యులే అని, ప్రభుత్వ ఆదేశాలు, ఆశయాలకు అనుగుణంగా, కార్యాలయ నియమ నిబంధనలకు గౌరవిస్తూ అందరూ కలిసికట్టుగా స్నేహపూర్వక వాతావరణంలో కర్తవ్య నిబద్ధతతో ఉద్యోగ ధర్మాన్ని నెరవేర్చాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా డీఇఇఇ శ్రీనివాసరావు,పిఆర్వో రవికుమార్,ఏవీఎస్ నాగయ్య,సీనియర్ అసిస్టెంట్ మహబూబ్ బాషా తదితరులు నూతన ఏడి కి పుష్ప గుచ్చాలు అందజేసి అభినందనలుతెలియజేశారుఈ కార్యక్రమంలో ఇన్ఫర్మేషన్ టెక్నీషియన్లు సదాశివయ్య, కృపాకర్, ఫోటోగ్రాఫర్ సొహైల్, టైపిస్టులు శ్రీవాణి, వర్ధిని,రికార్డ్ అసిస్టెంట్ లక్ష్మీపతి, అజ్మతుల్లా,టీఏ హరిబాబు,వీరారెడ్డి, విజయ కుమారి,షాహీనా బేగం, ముంతాజ్ బేగం, సునీత, సుభాషిణి,జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్, మంత్రికి ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే నాయిని



హనుమకొండ జిల్లా ప్రతినిధి జూలై 9 ( విజన్ ఆంధ్ర ): హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో నిర్వహించనున్న పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా కి, రాష్ట్ర సామాజిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎన్ఐటీ వరంగల్ అతిథి గృహంలో గవర్నర్, మంత్రిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య , శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి , కేఆర్ నాగరాజు , శాసనమండలి సభ్యులు బసవరాజు సారయ్య , రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ , డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రాంరెడ్డి , అయూబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడిని తట్టుకునే పంటలను సాగు చేయాలి

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**




వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 9 ( విజన్ ఆంధ్ర ) : నీటి ఎద్దడిని తట్టుకునే, వర్షాధార పంటలను సాగు చేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులకు సూచించారు. గురువారం ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువ కురిసే అవకాశం ఉన్నందున పంటల సాగుపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు లు జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు సలహాలు ఇచ్చారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ.... నీటి ఆధారిత పంటలు కాకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునే విధంగా అధికారులు రైతులకు తెలియజేయాలన్నారు. ఎల్ నినో ప్రభావం వల్ల అతి తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని, నీటి ఆధారిత పంటలు వేసినట్లయితే రైతులు నష్టపోతారు అనే విషయాన్ని వారికి స్పష్టంగా తెలియజేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రిజర్వాయర్లలో నీటి సామర్థ్యం తక్కువగా ఉన్నందున ఆయకట్టు కింద ఉన్న పొలాల్లో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు అంటే కందులు, మొక్కలు, చిరుధాన్యాల పంటలను వేసుకునే విధంగా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ నుండి జిల్లా వ్యవసాయ అధికారి కవిత, ఇరిగేషన్ డిఈ మంజుల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరగాలి

**- విద్యార్థులను ఇబ్బంది పెట్టే ప్రైవేట్ యాజమాన్యాలపై చర్యలు**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల జూలై 09 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలని, అక్కడ అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో గతేడాది, ప్రస్తుతం విద్యార్థుల ఎన్రోల్మెంట్ ఆఫ్లైన్, ఆన్లైన్ నివేదికలను అందజేయాల్సిందిగా ఆదేశించారు. ఎన్రోల్మెంట్ పెంచే టాప్ ముగ్గురు డిఈఓ లకు ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో పతకాలను, ఎంఈఓ లకు జిల్లా స్థాయిలో ప్రోత్సాహకాలు అందజేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు వస్తున్న విద్యార్థులకు ప్రైవేటు యాజమాన్యాలు బోనఫైడ్, టీసీలు ఇవ్వకుండా ఇబ్బంది పెడితే సహించేది లేదని తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అపార్ నమోదు పెరగాలని, ప్రీమెట్రిక్ ఉపకార వేతనాలకు రెన్యువల్, కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు సహకరించాలన్నారు. ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో అంగన్వాడి కేంద్రాల చిన్నారులు పెద్ద సంఖ్యలో చేరేలా కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం రుచికరంగా వండించాలని ఆదేశించారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో విద్యాబోధన చేసేందుకు విశ్రాంత ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ముందుకు రావచ్చని, ఈ ఏడాది విద్యార్థుల ప్రవేశాలు పెరిగిన పాఠశాలలకు విద్యా వాలంటీర్లను నియమిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, డీఈవో విజయలక్ష్మి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ బాషా, సెక్టోరియల్ అధికారులు, ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధితో పాటు ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలి

**- జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



ఆదిలాబాద్, జూలై 09(విజన్ ఆంధ్ర): జిల్లాలోని గ్రామాలను అభివృధితో పాటు ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. గురువారం స్థానిక రెవెన్యూ గార్డెన్‌లో "గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (విబిజి రామ్ జీ), ఘన వ్యర్థ నియమాలు – 2026 పై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం కేవలం ఒక సంవత్సరానికే కాకుండా, ప్రజాప్రతినిధుల పదవీ కాలానికి సరిపడేలా సుదీర్ఘ సమగ్ర ప్రణాళికలను సిద్ధం చేయాలని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. వీబీజీ రామ్ జీ పథకం కింద గత ఉపాధి హామీ కంటే ఎక్కువ మెటీరియల్ పనులకు అవకాశం ఉందని తెలిపారు. పాఠశాలల కొత్త గదులు, ప్రహరీ గోడలు, కిచెన్ షెడ్లు, శౌచాలయాల నిర్మాణం, వాటి మరమ్మతు పనులను ఈ పథకం ద్వారా చేపట్టవచ్చని వివరించారు. గ్రామ పంచాయతీలు కేవలం ప్రభుత్వ నిధులపైనే ఆధారపడకుండా సొంతగా ఆదాయంపై సమకూర్చుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే ట్రేడ్ లైసెన్సు, బిల్డింగ్ పర్మిషన్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తద్వారా గ్రామాల్లో మరిన్ని మౌలిక వసతులు కల్పించవచ్చని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నిరంతరం డ్రైనేజీల క్లీనింగ్, వీధుల శుభ్రత చేపట్టాలని, ప్రతి నెల 1, 11, 21 తేదీలలో నీటి ట్యాంకులను తప్పనిసరిగా శుద్ధి చేయాలని స్పష్టం చేశారు. జిల్లాకు నీటి సంరక్షణలో అవార్డు వచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ.. గుట్టల ప్రాంతాల్లో ట్రెంచ్‌లు, పొలాల్లో నీటి కుంటలు, ఇళ్ల వద్ద ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా భూగర్భ జలాలను పెంచాలన్నారు. వీటితో పాటు గ్రామాల్లో బాల్యవివాహాల నిర్మూలన, పిల్లలందరినీ బడికి పంపించడం, మత్తు పదార్థాల నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనల అమలు వంటి సామాజిక బాధ్యతలపై గ్రామాల్లో తీర్మానాలు చేసి కఠినంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ నరసింహులు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీపీఓ రమేష్, డీఆర్డీఓ రవీందర్, జడ్పీ సీఈఓ రవి, పంచాయతీ రాజ్ ఈఈ శివరాం, గ్రామీణ నీటి సరఫరా ఈఈ చంద్రమోహన్, డిఎల్పిఓలు ఫణిందర్, ప్రభాకర్, జిల్లా, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

# SIR గడువు దగ్గరపడుతున్నా పాలమూరులో అవగాహన లోపం

**- ఫారాలు చేతిలో ఉన్నా నింపలేకపోతున్న ఓటర్లు...**

**- ఓట్లు పోతాయేమోనన్న భయం**

**- గడువు పొడిగించాలని డిమాండ్...**

**- ప్రతి కాలనీలో SIR అవగాహన క్యాంపులు నిర్వహించాలి ప్రజలు...**

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో,జూలై 10, (విజన్ ఆంధ్ర) ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ప్రతి పౌరుడి గొంతు... ఆ గొంతు వినిపించాలంటే ముందుగా పేరు ఓటరు జాబితాలో ఉండాలి. ఈ నేపథ్యంలో చేపట్టిన SIR ప్రత్యేక సవరణ కార్యక్రమంకు గడువు ముగుస్తున్న వేళ ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా పలు నియోజకవర్గాలు, గ్రామాల్లో ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. అధికారులు ప్రతి ఇంటికి SIR ఫారాలు అందించినా, వాటిని నింపే విధానంపై సరైన అవగాహన లేకపోవడంతో చాలా ఇళ్లలో ఫారాలు అలాగే ఉండిపోయాయి. దీంతో అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోతాయేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

### ఫారాలు చేతిలోనే... నింపేందుకు మార్గం తెలియక

జిల్లాలోని పలు కాలనీలు, గ్రామాల్లో బీఎల్ఓలు ఫారాలు పంపిణీ చేసి వెళ్లిపోయారు. కానీ ఆ ఫారంలో ఏం రాయాలి? ఏ పత్రాలు జత చేయాలి? తప్పులుంటే ఎలా సరిదిద్దాలి? అనే విషయంపై స్పష్టత లేకపోవడంతో చాలా చోట్ల వృద్ధులు, చదువురాని వారు, కూలీలు నిస్సహాయంగా ఉన్నారు. "ఫారం ఇచ్చి వెళ్లారు. ఎవరిని అడగాలో, ఎలా రాయాలో, ఎక్కడ ఇవ్వాలో కూడా తెలియడం లేదు" అని ఓటర్లు వాపోతున్నారు. ఫలితంగా చాలా ఇళ్లలో SIR ఫారాలు నింపకుండానే అలాగే ఉన్నాయి.



పెంట్లవెల్లి మండలంలో SIR ఫారాలు నింపేందుకు అధికారులతో సలహా సూచనలు తీసుకుంటున్న ఓటర్లు...



కల్వకుర్తి ఇందిరా నగర్లో SIR ఫారాలు నింపుతున్న మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం..

### అవగాహన కార్యక్రమాలు పెంచాలని డిమాండ్

ప్రస్తుతం జరుగుతున్నది కేవలం పంపిణీ మాత్రమేనని, ప్రజల్లో అవగాహన పెంచే కార్యక్రమాలు చాలా చోట్ల లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రతీ కాలనీ, గ్రామంలో బీఎల్ఓలు, రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యా శాఖ, మున్సిపల్ శాఖ అధికారులు కలిసి అవగాహన సదస్సులు మరింతగా నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఫారం నింపడంలో సహాయం చేసేందుకు ప్రత్యేక సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### గడువు పొడిగించాలని విజ్ఞప్తి

గడువు ముగుస్తున్న తరుణంలో కూడా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో పెద్ద సంఖ్యలో SIR ఫారాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ మేరకు ఓటర్లు, ప్రజలు SIR ఫారాలు నింపడానికి ప్రతి ప్రభుత్వం మరింత గడువు పెంచాలని కోరుతున్నారు. ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో జరిగినట్లు తెలంగాణలోనూ ఓట్లు పోతాయేమోనన్న భయం ప్రజల్లో పట్టుకుంది. ఈ నేపథ్యంలో గడువును మరికొన్ని రోజులు పొడిగించి, 100% ఫారాలు సేకరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఓటర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

### అధికారులు స్పందించాల్సిన అవసరం

SIR ప్రక్రియ లక్ష్యం ఓటర్ జాబితాను పటిష్టం చేయడమే. కానీ అవగాహన లేకపోవడం వల్ల అర్హులైన వారి పేర్లు తొలగిపోతే ప్రజాస్వామ్యానికి నష్టమని సామాజిక కార్యకర్తలు అంటున్నారు. ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని గడువును పొడిగించాలని, ప్రతి వార్డు, గ్రామంలో అవగాహన క్యాంపులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ఫారం నింపేందుకు హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేపట్టాలని ఓటర్లు కోరుతున్నారు. గడువు ముగిసేలోపు అధికారులు కేవలం లెక్కల కోసం కాకుండా, ప్రతి ఒక్క ఓటరు ఫారం నింపేలా బాధ్యత తీసుకుంటేనే SIR ప్రక్రియ సఫలమవుతుందని ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

# బోడుప్పల్ సర్కిల్ లో ఇంటింటికీ వెళ్లని బీఎల్‌వోలు..!

**- ఫోన్లు ఎత్తని అధికారులు..**
**సర్కిల్ కార్యాలయానికి రావాలంటూ హుకుం..**

**- గడువులోగా ఓటరు సవరణ పూర్తవుతుందా..?**

**- ఫోటోలకు పరిమితం... ఓటర్ల వద్ద జాడలేని బీఎల్‌ఏలు..!**

**- ఉన్నతాధికారులు స్పందించాలి....**

బోడుప్పల్/మేడ్చల్ జిల్లా,జూలై 09( విజన్ ఆంధ్ర ప్రతినిధి): ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు పూర్తి భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంటింటికీ వెళ్లి ప్రతి ఓటరిని కలవాల్సిన బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) అనేక ప్రాంతాల్లో అసలు కనిపించడం లేదని ఓటర్లు మండిపడుతున్నారు. ప్రతి ఇంటిని మూడు సార్లు సందర్శించాలని ఎన్నికల సంఘం నిబంధనలు చెబుతుండగా, "ఒక్కసారి కూడా మా ఇంటి గడప తొక్కలేదు" అని పలువురు ఓటర్లు చెబుతున్నారు. అయినప్పటికీ సర్వే సజావుగా సాగుతోందని అధికారులు చెబుతుండటంపై ప్రజలు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.




### పర్యవేక్షణ ఎక్కడ..?

బీఎల్‌వోల పనితీరును పర్యవేక్షించాల్సిన అధికారులే అందుబాటులో ఉండడం లేదని ఓటర్లు ఆరోపిస్తున్నారు. ఫోన్ చేస్తే ఎత్తడం లేదని, తిరిగి కాల్ కూడా చేయడం లేదని వాపోతున్నారు. ప్రజల సమస్యలు వినాల్సిన అధికారులు స్పందించకపోవడంతో ఫిర్యాదు ఎవరికి చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది.

### సర్కిల్ కార్యాలయానికి రండి... ఇదేనా ఇంటింటి సర్వే..?

ఇంటికే వచ్చి వివరాలు నమోదు చేయాల్సిన అధికారులు, "సర్కిల్ కార్యాలయానికి వచ్చి ఫారాలు నింపండి" అని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, ఉద్యోగులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని నిలదీస్తున్నారు.

### ఫారాలు ఇచ్చామంటున్నారు... ఎక్కడ ఇచ్చారు?

ఎన్యూమరేషన్ ఫారాలు ప్రతి ఇంటికీ అందించామని అధికారులు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం వేలాది మంది ఓటర్లకు ఇప్పటికీ ఫారాలు అందలేదని సమాచారం. "ఫారాలు పంపిణీ చేశామనే రికార్డులు ఒకవైపు... ప్రజల చేతుల్లో ఫారాలు లేకపోవడం మరోవైపు" అనే పరిస్థితి కనిపిస్తోందని స్థానికులు అంటున్నారు.

### ఓటర్లలో భయం.. అయోమయం

"బీఎల్‌వో రాలేదు... ఫారం ఇవ్వలేదు... కార్యాలయానికి వెళ్లలేదు... మరి మా ఓటు ఉంటుందా? తొలగిస్తారా?" అనే సందేహాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనిపై అధికారులు స్పష్టమైన అవగాహన కల్పించకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మారుస్తోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### కేవలం రికార్డులకే పరిమితమైందా కార్యక్రమం?

క్షేత్రస్థాయిలో ఇంటింటికీ సర్వే జరగలేదని ఓటర్లు చెబుతుండగా, అధికారులు మాత్రం ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతోందని చెబుతున్నారు. దీంతో వాస్తవంగా సర్వే జరుగుతోందా? లేక కేవలం రికార్డులకే పరిమితమైందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### ఫోటోలకు పోటీ... ఓటర్ల వద్ద జాడలేని బీఎల్‌ఏలు..!

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో పార్టీల తరఫున పనిచేయాల్సిన బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు) క్షేత్రస్థాయిలో కనిపించడం లేదని ఓటర్లు విమర్శిస్తున్నారు. పార్టీ నాయకులతో ఫోటోలకు మాత్రమే పరిమితమై, ఓటర్ల సమస్యలు, నమోదు ప్రక్రియపై శ్రద్ధ చూపడం లేదని ఆరోపిస్తున్నారు. అర్హులైన ఓటర్లకు సహకరించి, ఓటరు జాబితా సవరణలో చురుకుగా పాల్గొనాలని ప్రజలు కోరుతున్నారు.

### గడువులోగా ప్రక్రియ పూర్తవుతుందా..?

ఓటరు జాబితా సవరణకు ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువు సమీపిస్తున్న వేళ, ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో ఇంటింటి సర్వే పూర్తి కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికైనా బీఎల్‌వోలు ప్రతి ఇంటిని సందర్శించి, ఫారాలు అందజేసి, అర్హులైన ప్రతి ఓటరి వివరాలు నమోదు చేస్తారా? లేక గడువు ముగిసినా వేలాది మంది ఓటర్ల వివరాలు నమోదు కాకుండానే మిగిలిపోతాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### ఉన్నతాధికారులు స్పందించాలి....

ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు. అలాంటి హక్కుకు సంబంధించిన ప్రక్రియలో నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా జిల్లా ఎన్నికల అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ప్రజల ఫిర్యాదులపై విచారణ జరిపి, బీఎల్‌వోలు నిజంగా ఇంటింటికీ వెళ్లారా లేదా అన్న అంశాన్ని స్పష్టంచేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే అవసరమైతే బాధ్యులపై చర్యలు తీసుకుని, ప్రతి అర్హుడి ఓటు హక్కు రక్షించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# మెట్ పల్లి లో ప్లాస్టిక్ నిషేధం ఒట్టి మాటేనా..!?




**- దుకాణాల్లో యథేచ్ఛగా విక్రయాలు..**

**- పట్టించుకోని అధికారులు**

**మెట్ పల్లి జూలై 09 (విజన్ ఆంధ్ర):**

ప్లాస్టిక్ ఆరోగ్యానికి ప్రమాదకరమని వాతావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిసినా వినియోగం మాత్రం తగ్గడం లేదు. 50 మైక్రాన్‌ల కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేదించింది. దీన్ని పక్కాగా అమలు చేయాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా పట్టణ వీధులు, మురుగు కాలువలు ప్లాస్టిక్ కూపాలుగా మారుతున్నాయి. పర్యావరణం దెబ్బతింటోంది.

### విచ్చలవిడి వినియోగం

మెట్ పల్లి లో దాదాపు అన్ని దుకాణాల్లో ప్లాస్టిక్‌ను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్ నిషేధం అమల్లో ఉన్నప్పటికి వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి పాలిథీన్ కవర్లు విక్రయిస్తున్నారు. ప్లాస్టిక్ హోల్‌సేల్ షాపులపై ఇంతవరకు అధికారులు దృష్టిపెట్టిన దాఖలాలు లేవు. కిల్లీ కొట్టు నుంచి సూపర్‌మార్కెట్ వరకు ప్లాస్టిక్ విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గత ప్రభుత్వ హయం లో అధికారులు ప్లాస్టిక్‌ను వినియోగించే వారిపై కొరడా ఝుళిపించారు. వర్తక, వాణిజ్య సంఘాల వారితో వరుస సమావేశాలు నిర్వహించి, పారిశుధ్య మెరుగుదలకు చర్యలు చేపట్టారు.









### సచివాలయ వ్యవస్థ ఉన్నా నిర్లక్ష్యమే

మెట్ పల్లి మున్సిపల్ పరిధిలో వార్డు సచివాలయాల వ్యవస్థ ఉన్నా పారిశుధ్య నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. సచివాలయాల్లో పర్యావరణానికి ప్రత్యేక కార్యదర్శిని ప్రభుత్వం నియమించినప్పటికి ప్లాస్టిక్ నిషేదం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. ముఖ్యంగా సచివాలయాలపై కార్యదర్శులు నిఘా పెట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. శానిటేషన్ కార్యదర్శులు దీనిపై దాడులు నిర్వహించి, ఆయా సచివాలయాల పరిధిలో పూర్తిగా ప్లాస్టిక్ నిర్మూలించాల్సి ఉన్నప్పటికి ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్లాస్టిక్ నిషేదం అమలుకు చర్యలు తీసుకునేముందు ప్రజల్లో చైతన్యం కల్పించాల్సిన బాధ్యత అధికారులకు ఉంది. వ్యాపారుల తోనూ, చిరు దుకాణదారులతోనూ సమావేశాలు నిర్వహించి, ప్లాస్టిక్ వినియోగిస్తే అపరాధ రుసుములు విధించడంతో పాటు చట్టపరంగా చర్యలు చేపడితేనే ఫలితం ఉంటుంది.

### మెట్ పల్లి మొత్తం ఇదే పరిస్థితి

మున్సిపల్ పరిధిలో లో నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వినియోగం యథేచ్ఛగా సాగుతోంది. ప్లాస్టిక్ నిషేధిద్దామంటూ ప్రభుత్వం, పలు స్వచ్ఛంద సంస్థలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నా ప్రజల్లో మార్పు రావడం లేదు. నిషేధిత క్యారీ బ్యాగుల విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వ్యాపార సంస్థలు, కూరగాయలు, పండ్ల మార్కెట్‌లో కవర్లు విరివిగా వాడుతున్నారు. అధికారులు ప్లాస్టిక్ కవర్ల విక్రయాలపై చర్యలు తీసుకోవాలని మెట్ పల్లి మున్సిపల్ ప్రజలు కోరుతున్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.